ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 118 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం, 28 జనవరి 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: బహుళ అష్టమి రా.7.47
నక్షత్రం: స్వాతి రా.7.42
వర్జ్యం: రా.1.16 నుండి 2.51 వరకు
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు

రైతులకు తీపి కబురు?

కేంద్రం ప్యాకేజీ ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న రైతులను బుజ్జగించడానికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించనుంది. వారి ఆదాయం పెంచే ప్యాకేజిని ప్రకటించాలని భావిస్తోంది. దీనిని సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో ఆమోదించే అవకాశం ఉందని తొలుత వార్తలు వచ్చినా కేబినెట్ సమావేశం వాయిదా పడటంతో రెండుమూడు రోజుల్లోనే దీనిపై ప్రకటన రావొచ్చు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అసంతృప్తితో ఉన్న రైతులను సంతృప్తి పరిచేందుకు, ఆ వర్గాన్ని తమవైపు తిప్పుకునేందుకు కేంద్రం ఈ ప్యాకేజీ తీసుకువస్తోందని రాజకీయ వర్గాలు తెలియజేస్తున్నాయి. చిన్న, మధ్యతరగతి రైతులకు ఆదాయం లోటు అంశమే ప్రధాన అజెండాగా ప్రారంభమయ్యే మంత్రివర్గ సమావేశంలో ఈ ప్యాకేజీని ప్రకటిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. సంక్షోభంలో ఉన్న ఈ వర్గాల రైతులకు సంబంధించి స్వల్ప, దీర్ఘకాలానికి ఉపయోగపడేలా పలు

- మిగతా 6వ పేజీలో



31 నుంచి పార్లమెంట్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆఖరు పార్లమెంటు సమావేశాలు జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. ఫిబ్రవరి ఒకటిన కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 31వ తేదీ ఉదయం పదకొండు గంటలకు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యుల సంయుక్త సమావేశంలో ప్రసంగించడంతో పార్లమెంటు మధ్యంతర బడ్జెట్ సమావేశాలు మొదలవుతాయి. అరుణ్ జైట్లీ వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్లినందున కేంద్ర ఆర్థిక

ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్

శాఖ తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం పదకొండు గంటలకు లోక్‌సభలో 2019-20 వార్షిక సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. మోదీ ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీనాడు ఆనవాయితీ ప్రకారం ఓట్ ఆన్ అకౌంట్ ఇంటరిమ్ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుందా? కొత్త పథకాలు, తాయిలాలు, విధాన నిర్ణయాలతో కూడిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుందా? అనేది ఇంకా స్పష్టం కావటం లేదు. ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, అది ఎంతమాత్రం మంచిది కాదని, సంప్రదాయానికి విరుద్ధమని రాజ్యసభలో కాంగ్రెస్ పక్షం ఉపనాయకుడు ఆనంద్ శర్మ ఇటీవల ఆరోపించిన

- మిగతా 6వ పేజీలో

ఎన్నికైన సర్పంచుల

ప్రమాణం ఒకేరోజు

ఫిబ్రవరి మొదటి వారంలో ముహూర్తం • తేదీలపై రెండు రోజుల్లో నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఎన్నికయిన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఫిబ్రవరి మొదటివారంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ నెల 30న తుది విడత పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఏ గ్రామంలోనైనా పోలింగ్ నిర్వహించేందుకు వీలుకాకపోతే మళ్లీ పోలింగ్‌కు రెండు రోజుల సమయమైనా అవసరం ఉంటుంది. అంటే ఫిబ్రవరి రెండో తేదీలోగా రీపోలింగ్‌కూడా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల తర్వాత ఉపసర్పంచ్ ఎన్నిక తదితర కార్యక్రమాలు కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ ఫిబ్రవరి మూడు లేదా నాలుగోతేదీలోగా పూర్తి చేసేందుకు వీలవుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎన్నికలు పూర్తయిన తర్వాత సర్పంచ్, వార్డు సభ్యుల చేత పదవీ ప్రమాణమే తరువాయి. ఇందుకు సంబంధించి రాష్ట్రమంతటా ఒకేరోజు పదవీ ప్రమాణం చేయించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే ఫిబ్రవరి 4 తర్వాత తొమ్మిదో తేదీలోగా ఏదో ఒక రోజును పదవీ ప్రమాణం కోసం నిర్ణయిస్తారు. సర్పంచ్‌ల చేత గ్రామ పంచాయతీ కార్యదర్శి పదవీ ప్రమాణం చేయిస్తారు. వార్డు సభ్యుల చేత కొత్త సర్పంచ్ పదవీ ప్రమాణం చేయిస్తారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పదవీ ప్రమాణం చేసినప్పటి నుండి వారి పదవీ కాలం ఐదేళ్లు

- మిగతా 6వ పేజీలో

తుది విడత ప్రచారం నేటితో సమాప్తం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది విడత పోలింగ్ ఈ నెల 30న జరుగుతుండటంతో, అభ్యర్థుల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించడం వల్ల అభ్యర్థులకు ప్రచారం చేసుకునేందుకు వారం రోజుల సమయం మాత్రమే లభించింది. మూడు విడతల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. రాష్ట్రంలో దాదాపు 24 వేల గ్రామాలు ఉండగా, 12,751 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలావరకు ఒకే గ్రామానికి ఒకే పంచాయతీ ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో రెండేసి గ్రామాలకు ఒక పంచాయతీ ఉంది. పంచాయతీలో ఉండే జనాభాకు అనుగుణంగా వార్డుల సంఖ్యను నిర్ణయించారు.

ముంచెత్తిన ముసురు



భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో తడిసి ముద్దయిన మిర్చి పంట

2

రేపటి 'అయోధ్య' విచారణ రద్దు


జడ్జి అందుబాటులో లేకపోవడంతో వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 27: ముందు ప్రకటించినట్లుగా అయోధ్య రామజన్మభూమి వివాదం కేసు విచారణను ఈ నెల 29వ తేదీ మంగళవారం చేపట్టడం లేదని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఐదుగురు న్యాయమూర్తులతోకూడిన ధర్మాసనంలో న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే మంగళవారం అందుబాటులో ఉండనందు వల్ల 29వ తేదీన కేసు విచారణను రద్దు చేస్తున్నట్లు కోర్టు రిజిస్ట్రీలో ప్రకటించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ ఇటీవలనే ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నెల 29వ తేదీన ఈ కేసు విచారణ ప్రారంభమవుతుందని కోర్టు ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. కాగా ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గగోయ్, జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే,

- మిగతా 6వ పేజీలో

వైకాపాలోకి దగ్గుబాటి

త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడి • జగన్‌తో భేటీ



హైదరాబాద్ లోటస్ పాండ్‌లో ఆదివారం వైకాపా అధినేత జగన్‌ను కలిసిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హితేశ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పెద్దల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. ఆదివారం దగ్గుబాటి వెంకటేశ్వర రావు తన కుమారుడు హితేశ్ చెంచురామ్‌తో కలిసి బంజారాహిల్స్, లోటస్ పాండ్‌లోని జగన్ నివాసానికి వెళ్లారు. అక్కడ వైసీపీ సీనియర్ నాయకులు విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి తదితరులు వారిని ఆహ్వానించారు. అనంతరం ఆయన జగన్‌తో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. తన కుమారుడు హితేశ్ వైకాపాలో చేరి, ప్రజా జీవితంలో ఉంటూ ప్రజలకు సేవలందించుకుంటున్నారని దగ్గుబాటి తెలిపారు. దగ్గుబాటి లోగడ పర్చూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తన వారసునిగా హితేశ్ చెంచురామ్‌కు పర్చూర్ నియోజకవర్గం టిక్కెట్ ఇవ్వాల్సిందిగా కోరారు. అందుకు జగన్ సానుకూలంగా స్పందించారని సమాచారం.

ఇలాఉండగా సమావేశానంతరం దగ్గుబాటి వెంకటేశ్వర రావు తన కుమారుడితో కలిసి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పని చేయడానికి వచ్చామని అన్నారు. తమ రాక పట్ల జగన్ సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. అసెంబ్లీ టిక్కెట్ అడిగారా? అని ప్రశ్నించగా, పార్టీ విధి విధానాల ప్రకారం నిర్ణయం ఉంటుందని, ఏదైనా పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని దగ్గుబాటి జవాబిచ్చారు. వైసీపీలో

- మిగతా 6వ పేజీలో

నిఘా వైఫల్యం!

దండకారణ్యంలోకి చొరబడిన మావోయిస్టులు

- ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై గురి
- 31న భారత్ బంద్‌కు మావోలు పిలుపు
- పోస్టర్లు, బ్యానర్లతో పోలీస్ వర్గాల్లో కలవరం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: ఉత్తర తెలంగాణ దండకారణ్యంలోకి మావోయిస్టులు ప్రవేశించడం నిఘా వర్గాలు వైఫల్యమేనని పోలీస్ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టుల టార్గెట్ ఎవరు అన్న కోణంలో దృష్టి పెట్టారు. దేశ వ్యాప్తంగా పౌరహక్కులకు భంగం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై మావోయిస్టులు ఈనెల 30న బంద్‌కు పిలుపు ఇచ్చారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోకి ఎన్ని దళాలు ప్రవేశించాయన్న సమాచారం కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజు మావోయిస్టు కేంద్ర నాయకత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలోకి మావోయిస్టులు ప్రవేశించడం జరిగింది. మావోయిస్టు కేంద్ర అధినాయకత్వ సూచనలతో నక్సల్స్ దండకారణ్యంలో విధ్వంసక చర్యలకు దిగారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై మావోయిస్టుల గురి ఉండవచ్చునని పోలీస్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం 18 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఉంటుందని పోలీస్ నివేదికల్లో తేల్చారు. మావోయిస్టు బంద్ పిలుపుతో ప్రజాప్రతినిధులకు మరింత భద్రతను పెంచాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు. ఎమ్మెల్యేలు సమాచారం ఇవ్వకుండా నియోజక వర్గాల్లో ఎలాంటి కార్యక్రమాలు పెట్టుకోవద్దని, అత్యవసర కార్యక్రమాలు ఉంటే అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని జిల్లాల ఎస్పీలు చెబుతున్నారు. జయశంకర్ జిల్లా వాజేడు వెంకటాపురం, నూగూరు వెంకటాపురం మండలాల్లో మావోయిస్టులకు పట్టుఉంది. ఈ ప్రాంతల్లోకి పోలీసులు వెళ్ళడానికి సాహసించరు. భూపాలపల్లి, చర్ల మండలాల్లో ఇటీవల మావోయిస్టులు తమ బలాన్ని చాటుకోవడానికి విస్తృత ప్రచారానికి నాందిపలికారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు ఈనెల 30వ తేదీ నాటికి ముగుస్తున్నాయి. మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ వెలువడుతున్న తరుణంలో తెలంగాణలో మావోయిస్టుల ప్రవేశం చర్చనీయాంశం అయ్యింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున కేంద్ర బలగాలు అనుకున్నంతగా

- మిగతా 6వ పేజీలో

ముంచెత్తిన ముసురు

బంగాళాఖాతంలో అల్పపీడనంతో పలు జిల్లాల్లో అకాల వర్షాలు


వనపర్తి జిల్లా శ్రీరంగాపురం పుష్కరఘాట్ల దగ్గర రైతులు ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయిన దృశ్యం

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 27: బంగాళాఖాతంలో అల్పపీడనంతో రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షానికి అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మొక్కజొన్న పంటకు అపార నష్టం వాటిల్లగా, దమ్మన్నపేటలో చేతికొచ్చే బొప్పాయి పంట ధ్వంసమై అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పత్తి పంటలకు నష్టం వాటిల్లగా ఈదురుగాలులతో విరుచుపడ్డ చెట్లతో పౌల్ట్రీ ఫాంల్లోని వందలాది కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. చాలా చోట్ల మామిడి పూత రాలిపోయింది. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో అధిక నష్టం వాటిల్లగా సుమారు 160 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. చొప్పదండి నియోజక వర్గంలో అధిక నష్టం వాటిల్లగా గంగాధర, మానకొండూర్ ప్రాంతాలలో మొక్కజొన్న నేలకొరిగింది. జగిత్యాల జిల్లా ధర్మపురి, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంట నష్టం వాటిల్లగా పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం మండలాల్లో నష్ట ప్రభావం ఎక్కువగా ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తిపంటకు నష్టం వాటిల్లగా ఇల్లంతకుంట మండలంలో అధికంగా 7.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

తడిసి ముద్దయిన మిర్చి

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఆకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. ఆరుగాలం కష్టించి పంట చేతికి వచ్చే సమయంలో వరుణుడు కన్నెర చేయడంతో అన్నదాతలు కుదేలయ్యారు. ప్రధానంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆకాల వర్షాలకు చేతికి వచ్చిన మిర్చి పంట వర్షార్పణం అయ్యింది. జిల్లాలోని టేకుమట్ల, ఏటూరునాగారం, మంగపేట, మహాదేవపూర్, కాటారం, మహాముత్తారం, వాజేడు, వెంకటాపూరం, ములుగు, తాడ్వాయి మండలాలతో పాటు వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోని పరకాల, ఆత్మకూరు, నర్సంపేట మండలాల్లో కూడా చేతికి వచ్చిన మిర్చి నీళ్లపాలైంది. మిర్చిని పండించి అమ్ముకునే దశలో కల్లాల్లో ఆరబోసి రేపోమాపో మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుందామనుకునే లోపే అకాల వర్షం రైతన్నల పాలిట విలన్‌గా మారింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 550 హెక్టార్ల మిర్చి పంట వేయగా పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లినట్లు అధికారులు చెప్తున్నారు. తడిచిన మిర్చిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చేతికి అందిన పంట రైతుల కళ్లెదుటే నీళ్లపాలు అవుతుంటే రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మహబూబాబాద్, జనగామ, వరంగల్ అర్బన్ జిల్లాలో కూడా కొన్ని ప్రాంతాల్లో మిర్చి పంటకు త్రీవ నష్టం వాటిల్లింది. గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల వర్షాలు కురుస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ వర్షాలకు తడిసిన మిర్చితో రైతులు ఇబ్బందులు పడుతుండగా, చల్ల గాలితో ప్రజలు అవస్తలు పడుతున్నారు. తాజా వాతావరణంతో చలి తీవ్రత పెరిగింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ముసురు వర్షాలతో ముప్పే..

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆదివారం రోజంతా ముసురు వర్షాలు కురిశాయి. రబీ పంటలకు తాజా ముసురు వర్షాలు ఆశాజనకంగా ఉండగా, ముసురు వర్షాలతో దినసరి కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి వరకు కూడా ఎడతెరపి లేకుండా ముసురు వర్షాలు పడుతూనే ఉన్నాయి. వర్షాలకు పెద్దవూరా మండల వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న రైతుల వందలాది బస్తాల ధాన్యం తడిసిపోయింది. ఆదివారం సాయంత్రం ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ల వర్షాపాత లెక్కల మేరకు నల్లగొండలో 29.5మిల్లిమీటర్లు, మిర్యాలగూడలో 73మిల్లిమీటర్లు, దేవరకొండలో 61.5, వేములపల్లిలో 29.7, డిండిలో 20.8, చిట్యాలలో 19.5, సూర్యాపేటలో 12.5, రామన్నపేటలో 13, నారాయణపూర్‌లో 9.3, చౌటుప్పల్‌లో 8.5మిల్లిమీటర్లు, తుర్కపల్లిలో 15.7మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. కాగా మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలోని 23మండలాల్లోని పంచాయతీ ఎన్నికల అభ్యర్థులు ముసురు వర్షాల్లోనే తమ ప్రచారాలు కొనసాగించడం విశేషం.

తడిసిన ధాన్యంతో రైతన్న దిగాలు...

మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గత రెండు రోజుల నుండి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఆదివారం మాత్రం వనపర్తి, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో వనపర్తి జిల్లాలో రైతులు ఆరబోసుకున్న వరి ధాన్యం తడిసి ముద్దైంది. దాదాపు నాలుగువేల ఎకరాల వరి ధాన్యంను రైతులు కోతకోసుకుని రెండు మూడు రోజుల వ్యవధిలో మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకుందామని భావించిన నేపథ్యంలో అకాల వర్షం రైతులను నట్టేటా ముంచింది. తడిసిన వరి ధాన్యంను కళ్లారా చూసిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మండలాల్లో శనివారం అర్థరాత్రి నుండి ఎడతెరపి లేని వర్షం కురుస్తుండడం అది కూడా ముసురు వర్షం కురుస్తుండడం, మరో పక్క ఈదురు గాలులు తీవ్రంగా జనాన్ని వణికిస్తుంది.

ఇటుక బట్టీలకు అపార నష్టం

నాగర్‌కర్నూల్: గత రెండు రోజుల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలో కురుస్తున్న అకాల వానలపై రైతులనుంచి మిశ్రమ స్పందన వస్తుంది. ఈ అకాల వానలతో జిల్లాలో ఇటుక బట్టీలకు అపారమైన నష్టం వాటిల్లింది. అకాల వానలు ఎండకాలంలో వస్తాయని, కాని జనవరిలోనే వానలు పడటంతో ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని పలువురు ఇటుక వ్యాపారులు అన్నారు. ఇది ఇలా ఉండగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో వేరుశనగ పంటను ముందుగానే వేసుకోవడంతో అట్టి పంట చేతికి రాగా ఇటీవల వాటిని తెంపి కల్లాలలో వేసుకున్నారు. శని, ఆది వారాలలో కురిసిన అకాల వానలతో కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలతోపాటు అమ్రాబాద్ తదితర మండలాలలో తెంపిన వేరుశనగ పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలలోని చాలా మండలాలలో వేరుశనగ పంటను ఆలస్యంగా వేయడంతో అట్టి పంటలకు ఈ వానలు ఎంతో దోహదపడ్డాయని ఆయా ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద జిల్లాలో ఈ అకాల వానలు కొందరిలో ఆందోళన కలిగించగా, మరికొందరి రైతులలో ఆనందాన్ని కలిగించాయని చెప్పవచ్చు.

మరో 24 గంటలు...

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో మరో 24 గంటల పాటు ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. గత 24 గంటల్లో సిద్ధిపేట, జనగామ, భూపాలపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో భారీగా వర్షం కురిసింది. నంగనూర్ (సిద్ధిపేట) లో 10 సెంటీమీటర్లు, దుబ్బాక (సిద్ధిపేట)లో 9 సెంటీమీటర్లు, నర్మెట్ట (జనగామ), భూపాలపల్లి, మొగుళ్లపల్లి (కరీంనగర్) లలో ఎనిమిదేసి సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హుజూరాబాద్ (కరీంనగర్)లో ఏడు సెంటీమీటర్లు, మంథని (పెద్దపల్లి) లో ఆరు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్ధిపేట, జనగామ, జగిత్యాల తదితర జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో రెండు సెంటీమీటర్ల నుండి ఐదు సెంటీమీటర్ల వరకు నమోదైంది.

వర్షానికి రాలిపోయిన బొప్పాయి పంట


పెద్దవూరా వ్యవసాయ మార్కెట్‌లో ముసురు వర్షాలకు తడిసిన ధాన్యం


నష్టపోయిన రైతులను ఆదుకోండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: అకాల వర్షాలతో తెలంగాణలో పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపిలేని అకాల వర్షాలు కురుస్తున్నందున చేతికి వచ్చిన పంట దెబ్బ తిన్నదని, దీంతో రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూసిందని, వీరిని తక్షణమే ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వేరుశనగ పంటకు మొలుకలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. మరో వైపు మామిడి పూత రాలిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను క్షేత్ర స్థాయికి పంపాలని ఆయన సూచించారు. నష్టపోయిన పంటకు ఎకరాకు రూ.20వేల పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కలల హామీలకు పరాభవం తప్పదు

ఇచ్చిన వాగ్దానాలన్నీ వంద శాతం నెరవేర్చా

❖ బీజేపీ తీర్థం పుచ్చుకున్న బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్

❖ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

ముంబయి, జనవరి 27: నిద్రలో వచ్చిన కలలను వాస్తవ రూపంలో అమలు చేయడంలో విఫలమైన రాజకీయ నాయకులకు నిజజీవితంలో ప్రజల చేతిలో పరాభవం తప్పదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా తాను తప్పకుండా నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. 'రాజకీయ నాయకులు తమకు వచ్చిన కలలతో ప్రజలను మభ్యపెడుతుంటారు. కానీ వారిచ్చిన కలల హామీలను నిలబెట్టుకోవడంలో విఫలం కావడంతో ప్రజల చేతిలో పరాభవాన్ని ఎదుర్కోక తప్పదు' అని గడ్కరీ వ్యాఖ్యానించారు. 'నేను ఆ తరహా కలల హామీలిచ్చే నాయకుడిని కాను. కానీ నా హామీలను వంద శాతం అమలు చేసేందుకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాను' అని స్పష్టం చేశారు. 'నేను ఎలాంటి వ్యక్తినో ఇక్కడి పత్రికా ప్రతినిధులకు బాగా తెలుసు. నేనిచ్చిన హామీల మేరకు వివిధ ప్రాజెక్టులను ఏవిధంగా పూర్తిచేశానో వారికి తెలుసు. వారికి నాపై అంతటి నమ్మకం ఉంది' అని గడ్కరీ వ్యాఖ్యానించారు. 'నేను మహారాష్ట్ర ప్రభుత్వంలో 1995-99 మధ్య కాలంలో పీడబ్ల్యూడీ మంత్రిగా వ్యవహరించిన కాలంలో ఇక్కడి ప్రజలు నన్ను చూసి నవ్విన దాఖలాలు ఉన్నాయి. కానీ ఆ తర్వాత కాలంలో నేను చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 50 ఫ్లైఓవర్లు, ముంబయి నుండి పుణేకు రైలు రవాణా సదుపాయం వంటివాటిని వారు స్వయంగా గమనించారు. నేను ఇచ్చిన ఏ హామీ విషయంలోనూ తప్పటడుగు వేయలేదు. ప్రతి ప్రాజెక్టునూ పూర్తి చేసి చూపించాను' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇదిలావుండగా, ఇదే వేదికపై బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెకు బీజేపీ మహిళా ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు.

వినియోగదారుల ఫిర్యాదులపై సర్క్యూట్ బెంచ్

❖ జాతీయ కమిషన్ చైర్మన్ జస్టిస్ అగర్వాల్ రాక ❖ రాష్ట్ర కార్యదర్శి అకున్ సబర్వాల్‌తో సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో


జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ చైర్మన్ ఆర్‌కే అగర్వాల్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

హైదరాబాద్, జనవరి 27: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అపరిష్కృతంగా ఉన్న వినియోగదారుల ఫిర్యాదులపై జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) సర్క్యూట్ బెంచ్ సోమవారం నుంచి విచారణ చేపట్టనుంది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు పెండింగ్‌లో ఉన్న కేసులపై బెంచ్ విచారించనుంది. ఈ విచారణలో పాల్గొనడానికి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ అగర్వాల్‌తో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్‌తో పాటు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎంఎస్‌కె జైస్వాల్ సమావేశమయ్యారు. జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర అధికారులకు జాతీయ చైర్మన్ ఆర్‌కె అగర్వాల్ దిశా నిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో విచారణ జరుపనున్న బెంచ్‌ని ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ వద్ద 2685 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోటి రూపాయలు అంతకు పైబడిన ఫిర్యాదులు మాత్రమే ఈ సర్క్యూట్ బెంచ్ పరిధిలోకి రానున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీల్స్‌గాని, రివిజన్ పిటిషన్స్‌నుగాని నేరుగా బెంచ్‌కు దాఖలు చేయవచ్చని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కార్యదర్శి అకున్ సబర్వాల్ తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగులకు ప్రభుత్వ అండ

మాజీ మంత్రి హరీష్ రావు హామీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: ప్రైవేటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీ. హరీష్ రావు హామీ ఇచ్చారు. ఆదివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీని హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సమైక్య రాష్ట్రంలో ప్రైవేటు ఉద్యోగులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రైవేటు ఉద్యోగుల పాత్ర మరువలేనిదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటే ఉద్యోగం పోతుందని తెలిసి కూడా ధైర్యంగా పోరాటం చేశారని ఆయన చెప్పారు. కాబట్టి వారి సేవలను, పోరాటాన్ని ప్రభుత్వం మరిచిపోదని, వారికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఉద్యాన వర్శిటీలో సోలార్ పవర్

ప్రభుత్వ కార్యదర్శి పార్థసారథి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: ములుగులో నిర్మాణంలో ఉన్న ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన భవనంలో 'సోలార్ పవర్' ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి సంబంధిత అధికారులను ఆదేశంచారు. ఉద్యాన విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణంపై చర్చించేందుకు సచివాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ములుగులోని ప్రధాన కార్యాలయంతో పాటు రాజేంద్రనగర్, మోజర్లలో ఉన్న ఉద్యాన కాలేజీల్లో కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. భవనాల నిర్మాణం, రోడ్ల నిర్మాణం, ప్రయోగశాలలు, విద్యార్థుల వసతి గృహాలు, పరిశోధనాశాలలు తరగతి గదుల నిర్మాణం 2019 మార్చి చివరి వరకు పూర్తి చేయాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేసేందుకు వీలుగా వర్సిటీలో ఆడిటోరియాన్ని నిర్మించాలని పార్థసారథి సూచించారు. విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన 'ఆర్నమెంటల్ గార్డెన్'ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

రేపటి నుంచి కిసాన్ కాంగ్రెస్ సదస్సు

హాజరుకానున్న కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి ప్రతినిధులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 27: వ్యవసాయరంగ సమస్యలతో పాటు రైతు సంక్షేమం కోసం అనుసరించాల్సిన అంశాలపై చర్చించటానికి దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సదస్సు మంగళవారం నుంచి హైదరాబాద్‌లో జరగబోతుంది. ఈ సదస్సుకు తెలంగాణతో పాటు తమిళనాడు, కర్నాటక, కేరళ, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ ఆరు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు విశేషాలను గాంధీభవన్‌లో ఆదివారం కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కిసాన్ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి మీడియాకు వివరించారు. దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, రైతుల ఆత్మహత్యలతో పాటు ఈ రంగం అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సదస్సులో చర్చించనున్నట్టు తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో వ్యవసాయరంగంపై కాంగ్రెస్ రూపొందించే మేనిఫెస్టోలో చేర్చాల్సిన ప్రతిపాదనలపై సదస్సులో చర్చిస్తామని కోదండరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు నానా పటోలేతో పాటు కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కిసాన్ సెల్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి వివరించారు.

మావోల యాక్షన్ టీం సంచారంతో కలకలం?

పాడేరు, జనవరి 27: మావోయిస్టు ఏక్షన్ టీం సంచరిస్తోందని ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులను హెచ్చరించింది. ఈ సమాచారంతో పాడేరు ప్రాంతంలో ఆదివారం కలకలం సృష్టించింది. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి గ్రామ ప్రాంతంలో మావోయిస్టు ఏక్షన్ టీం సభ్యులు మకాం వేసినట్టు ఇంటలిజెన్స్ విభాగం సమాచారంతో పోలీసు బలగాలతో కూంబింగ్ చేపట్టారు. అప్రమత్తమై పాడేరు నుంచి ఆదివారం మధ్యాహ్నం పాడేరు ఘాట్‌కు బలగాలు తరలివెళ్లాయి. పాడేరు ఘాట్ లోని వంట్లమామిడి, పన్నెండుమైలు రాయితోపాటు మిగిలిన ఘాట్ భాగంలో కూంబింగ్ నిర్వహిస్తూ జల్లెడ పడుతున్నాయి. ఘాట్‌లో పోలీసు బలగాలను మోహరించడమే కాకుండా ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పాడేరు ఘాట్ ప్రాంతమంతా ఆదివారం పోలీసులతో నిండిపోయింది. మావోల హిట్‌లిస్టులో ఉన్న నాయకులను పోలీసులు అప్రమత్తం చేసినట్టు తెలిసింది.

జర్నలిస్టుల సంక్షేమానికి వంద కోట్లతో నిధి

బీజేపీ లోక్‌సభ సభ్యుడు దత్తాత్రేయ డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో


తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) ద్వితీయ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న దత్తాత్రేయ

హైదరాబాద్, జనవరి 27: జర్నలిస్టుల సంక్షేమానికి వెంటనే వంద కోట్ల రూపాయలతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని బీజేపీ జాతీయ నాయకుడు, లోక్‌సభ సభ్యుడు బండారు దత్తాత్రేయ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావును డిమాండ్ చేశారు.

మజీతియా వేజ్ బోర్డు ఇచ్చిన నివేదికను అమలు చేసేలా చూడాలని తాను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తానని ఆయన చెప్పారు. ఆదివారం నగరంలోని దోమల్‌గూడా, ఏవీ కళాశాలలో ఏర్పాటైన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) ద్వితీయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండాలని అన్నారు. అప్పుడే ప్రభుత్వాల వైఫల్యాలను, అవినీతిని ప్రజల ముందు ఉంచేందుకు వీలు అవుతుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేశానని ఆయన చెప్పారు.

జింక కొమ్ములు పట్టివేత


స్వాధీనం చేసుకున్న జింక కొమ్ములు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 27: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఆదివారం జింక కొమ్ములను ఎస్ఐ షేక్ మస్తాన్ వలీ పట్టుకున్నారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. పిక్కల కుమార్ ఇంటిలో జింక కొమ్ములు ఉన్నట్లు సమాచారం మేరకు సోదా చేయగా జింక కొమ్ములు లభ్యమైనట్లు తెలిపారు. వెంటనే జింక కొమ్ములను స్వాధీనం చేసుకొని కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కొమ్ములను ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రీపోలింగ్ కోసం మూడో రోజు ముస్తాబాద్ బంద్

సర్పంచ్ అభ్యర్థుల సామూహిక ఆమరణ దీక్షలు


ఆమరణ దీక్షలు చేపట్టిన సర్పంచ్ అభ్యర్థులు

ముస్తాబాద్, జనవరి 27: సర్పంచ్ స్థానానికి రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ మండలకేంద్రంలో ఆదివారం అఖిల పక్షం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఆందోళనతో ఉద్రిక్తత నెలకొని అట్టుడికింది. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్, టీడీపీ కార్యకర్తలు, వందలాది గ్రామస్థులు, ముదిరాజు సామాజిక వర్గం, రాస్తారోకో, నిరసన ప్రదర్శన, ర్యాలీ, వంటావార్పు నిర్వహించడమేగాక, సమీప సర్పంచ్ అభ్యర్థి రంజాన్ రాధతో పాటు మహిళా సర్పంచ్ అభ్యర్థులు ముకుమ్మడిగా సామూహిక ఆమరణ దీక్షలు చేపట్టారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని, సర్పంచ్ అభ్యర్థుల అభ్యంతరాల్ని పరిగణలోకి తీసుకోక, పారదర్శకతకు తిలోదకాలిచ్చి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సర్పంచ్‌గా గాండ్ల సుమతిని ఏకపక్షంగా ప్రకటించడంపై మూడు రోజులుగా వివాదం రాజుకొంటున్నది. సమీప అభ్యర్థి రంజాన్ రాధకు మద్దతుగా 10మంది మహిళా సర్పంచ్ అభ్యర్థులు, అఖిల పక్షం నాయకులు, గ్రామస్థులు ఏకతాటిపై నిలిచి, ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేశారు. రంజాన్ రాధ భర్త రాజలింగం, టవరెక్కి నిరసన వ్యక్తం చేసి, గ్రామస్థుల విజ్ఞప్తితో దిగొచ్చారు. యంత్రాంగం స్పందించి రీపోలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల నాయకులు, సంఘీభావం వ్యక్తం చేసి రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే



సారంగాపూర్, జనవరి 27: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలోజరిగిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామప్రజలతో కలిసి బోనమెత్తుకొని ఘనంగా పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయంలోప్రత్యేకత ఉన్న బోనాల ఉత్సవాలు పెద్ద పండుగలాంటివని సంజయ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొల్మల శారద, రమణ, సర్పంచ్ ఏసుదాసు, మాజీ సర్పంచ్ రంగు మల్లేషం, గాజర్ల రాంచంద్రం, రామకిష్టు గంగాధర్, సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుకు వర్ష కష్టం

తడిసిన కందులు • కొనుగోలులో నిర్లక్ష్యం • రోడ్డుపై గంటల పాటు ధర్నా



రహదారిపై ముళ్ళపొదలు వేసి ధర్నా చేస్తున్న రైతులు
కార్యాలయ ఆవరణలో వర్షానికి తడిసిన కంది బస్తాలు

నర్వ, జనవరి 27: ఆరుగాలం కష్టించి పండించిన పంటను మార్కెట్‌లో విక్రయించుకుందామన్న రైతన్నలకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ సింగ్‌విండో సొసైటీలో కందులు విక్రయించుకునేందుకు ముందస్తుగా సొసైటీ సిబ్బంది రైతులకు టోకెన్లను జారీ చేశారు. అయినప్పటికీ రైతుల నుండి సకాలంలో కందులను కొనుగోలు చేయకపోవడంతో ఆదివారం భారీ వర్షానికి సొసైటీలో ఉన్న కందులు తడిసి ముద్దవడంతో రైతన్న బాధలు వర్ణనాతీతంగా మారింది. కందుల బస్తాలు వర్షానికి తడవడంతో కాగితాలు కప్పిన ధాన్యం తడిసిపోయి ముద్దయింది. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు రహదారికి ముళ్ళ పొదలు అడ్డం వేసి రోడ్డుపై రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా టోకెన్లు జారీ చేసి కందులను ఎందుకు కొనుగోలు చేయడం లేదని సిబ్బందిపై రైతులు మండిపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కందులను కొనుగోలు చేయడం లేదని రైతులకు చెబుతున్నారని వాపోయారు. నర్వ సింగిలోవిండో కందుల కొనుగోలు వ్యవహారంలో సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని రైతులు మండిపడ్డారు. వర్షంలోనే రైతులు వారి వారి కంది బస్తాలను తడవకుండా పలురకాల చర్యలు చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

గద్వాల, జనవరి 27: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ఆదివారం గద్వాలలో టీజేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలకు మిరుప, పప్పుశనగ, పత్తిపంటలు తడిసిపోయ్యాయని, రైతులకు తీవ్ర నష్టం చేకూర్చిందని, తెలంగాణ ప్రభుత్వం దెబ్బతిన పంటలకు గిట్టుబాటు కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. బ్యాంకులో తీసుకొన్న రుణాలకు పంట బీమా అనుసందానం చేయడం వల్ల బీమాలు చెల్లించడం తెలియక పంట బీమాలు రైతులకు సంపూర్ణంగా వర్తించలేక పోతుందని ఇలాంటి విపత్కర పరిస్థితులలో భీమా కిందా రైతులకు రావలసిన సహాయం రావడం లేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు జరుగుతున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని తక్షణం ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా టీజేఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లి గ్రామాల్లో పంట నష్టం సమాచారం సేకరించి జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులకు, ఆయా మండలాల తహశీల్దార్లకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేయాలని సూచించారు. ప్రాజెక్టుల మీద నాయకులు జోక్యం చేసుకోరదని, ఇరిగేషన్ అధికారులు నీటి సంఘాల నాయకుల చర్చించి కచ్చితమైన ప్రణాళికను రూపొందించి, ప్రతి రైతుకు న్యాయం చేయాలన్నారు. ఆర్డీఎస్ రావలసిన నీళ్ల వాటాను తెలంగాణ ప్రాంతం కోల్పోరాదని, ఆర్డీఎస్ మీద ఆదారపడి ఉన్న తుమ్మిళ్ల ప్రాజెక్టుకు దిగువన ఉన్న భూములకు నీళ్లు అందించాలంటే ఆర్డీఎస్ ప్రాజెక్టును ఆధునీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఈవి ఎం పనితీరు బాగానే ఉన్న సరైన మార్గంలో దీని ఎన్నికల సంఘం అధికారులు పట్టించుకోకుండా ఉండడంతో ఎన్నికల్లో పారదర్శకత కోల్పోయిందన్నారు. టెక్నాలజీని సరైన పద్ధతిలో వాడితే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ మహబూబ్‌నగర్, గద్వాల జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, ఆలూరు ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు • తల్లిదండ్రులకు అప్పగింత


విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తుంగతుర్తి సీఐ అయోధ్య

తుంగతుర్తి, జనవరి 27: పోలీసుల కృషి ఫలితంగా కలకలం సృష్టించిన బాలిక కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సంఘటన జరిగిన 24గంటల లోపే మిస్టరీని ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకొని సర్కిల్ పోలీసులు రికార్డు సృష్టించారు. కిడ్నాపర్‌ల చెర నుంచి బాలికను విడిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సీఐ అయోధ్య ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మద్దిరాల మండలం చిననెమిల క్రాస్‌రోడ్డుకు చెందిన లింగాల వెంకన్న ఏడేళ్ల కుమార్తె కీర్తన సెలవులు కావడంతో నూతనకల్ మండలంలోని మామిళ్లమడవ గ్రామంలోని వెంకన్న సోదరుని ఇంటివద్ద వెళ్లి స్వగ్రామానికి వెళ్లిపోయారు. కాగా మామిళ్లమడవ పరిధిలోని ధారవత్‌తండాకు చెందిన ధారవత్ వీరన్న అతని భార్య శాంతి, ధారవత్ రవి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు స్వగ్రామానికి వచ్చిన వారు శనివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. బాబాయి ఇంటివద్ద ఆడుకుంటున్న చిన్నారి కీర్తనను గమనించి కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకొని చిన్నారికి మయామాటలు చెప్పి బిస్కెట్ ప్యాకెట్‌లు ఇచ్చి తమతో బస్సులో హైదరాబాద్ తీసుకెళ్లారు. బాలిక కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు గ్రామం నుంచి దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు వ్యక్తులు బాలికను తీసుకెళ్లినట్లు గ్రామస్థుల నుంచి సమాచారం తెలుసుకొని హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడ పోలీసులు కిడ్నాపర్‌లను అదుపులోకి తీసుకొని బాలికను, నిందితులను స్థానిక పోలీసులకు అప్పగించారు. డబ్బు కోసం బాలికను ఇతరులకు విక్రయించేందుకు కిడ్నాప్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరిపై గతంలో ఎలాంటి కేసులూ లేవన్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. 24గంటల్లోనే ఈ కేసును ఛేదించిన నూతనకల్ ఎస్ఐ వీరబాబు, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

చలికి తట్టుకోలేక 40 గొర్రెలు మృతి

పెద్దపల్లి, జనవరి 27: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి భారీ ఆస్తి నష్టం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. మండలంలోని రాఘవాపూర్ గ్రామంలోని బొడ్డుపల్లి శంకరయ్య ఇల్లు వర్షం తీవ్రతకు శనివారం రాత్రి కూలిపోయింది. అలాగే, ఆదే గ్రామానికి చెందిన కుంట సుధాకర్, బొడ్డు కొమురయ్య, పొలవేని శ్రీశైలం, కుంట ఎల్లయ్య, కుంట నర్సయ్య, కొమ్మ ఐలయ్యలకు చెందిన 40 గొర్రెలను మేతకు తీసుకవెళ్లే క్రమంలో అవి చలికి తట్టుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు బాధితులు వాపోయారు. ఆ గ్రామ సర్పంచ్ ఆడెపు వెంకటేశం కూలిపోయిన ఇళ్లను, మృతి చెందిన గొర్రెలను సందర్శించి ఆర్థికంగా నష్ట పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్, చలికి మృతి చెందిన గొర్రెలు

తెలంగాణ చరిత్రను నిర్లక్ష్యం చేయొద్దు

ఆధునిక చరిత్రకు ప్రాధాన్యతతోబాటు పురాతన, మధ్యయుగ చరిత్రలపై విశేష పరిశోధనలు జరగాలి ★ కాకతీయ చరిత్రతో మిషన్ కాకతీయకు బాంధవ్యం
అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చరిత్ర పట్ల నిర్లక్ష్యం ★ ఓయూ పూర్వపు ఉపకులపతి ఆచార్య తిరుపతి రావు

ఆంధ్రభూమి బ్యూరో



సదస్సులో మాట్లాడుతున్న ఓయూ పూర్వపు ఉపకులపతి తిరుపతిరావు

వరంగల్, జనవరి 27: తెలంగాణ చరిత్ర ఎంతో ప్రాముఖ్యమైనదని, దీనిని అలక్ష్యం చేయకూడదని ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వపు ఉపకులపతి ఆచార్య పి. తిరుపతిరావు అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ చరిత్ర, పర్యాటక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 'తెలంగాణ చరిత్రపై 4వ వార్షిక సదస్సు' విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో ప్రారంభమైంది. మొదటి రోజు ప్రారంభ సమావేశానికి కేయు వైస్ చాన్సలర్ ఆచార్య ఆర్. సాయన్న అధ్యక్షత వహించగా తిరుపతిరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కేవలం అధునిక చరిత్రకు ప్రాధ్యానం కాకుండా, పురాతన, మధ్యయుగ చరిత్రలపై విశేష పరిశోధనలు జరగాలని అన్నారు. వినూత్న పరిశోధనలు, శాస్త్ర బద్ధంగా చరిత్ర పరిశోధన జరగాలని చెప్పారు. నాణ్యమైన పరిశోధన జరగాలని, పరస్పర సహకారంతో ఇతర సబ్జెక్టులు అయిన పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంథ్రోపాలజీ, ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్టేషన్‌లతో ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ జరగాలన్నారు. చరిత్ర పరిరక్షించటంలో సాంకేతిక నిపుణుల సహకారము తీసుకోవాలని సూచించారు. విదేశాలలో చరిత్రకు చాలా ప్రాముఖ్యత ఉందని, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ చరిత్రకు అంత ప్రాధాన్యత దక్కలేదని అన్నారు. ప్రస్తుత తెలంగాణలో విశేష కృషి చేసి కొత్త విషయాలు బయటకు తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. ఇంత వరకు అన్వేషణ జరగని ప్రాంతాలలో కూడా పరిశోధనలు జరగాలన్నారు. సామాజిక కోణంలో, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయం ఇప్పటి పరిస్థితుల కోణంలో పరిశోధనలు జరగాలి. సోషల్ డైనమిక్స్, సానుకూల చరిత్ర పునరావృతం కావాలిగాని ప్రతికూల చరిత్ర పునరావృతం కావద్దని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూస్తూ ఉన్నాయి అని, చరిత్ర విభాగం మరియు అర్చివీస్ కలిసి పనిచేయాలని చెప్పారు. ప్రభుత్వం మంచిగా నడవాలంటే చరిత్ర అవసరం అని చెప్పారు. ప్రణాళిక రూప కల్పనలో సంక్షేమ కార్యక్రమాల అమలులో గత చరిత్ర అవసరం అని చెప్పారు. ముగింపు కేవలం కొన్ని ఆధరాలతో కాకుండా బహుళ ఆధారాలతో శాస్త్రీయంగా ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్‌తో చరిత్ర పరిశోధనల్లో ముగింపు చెప్పాలని అన్నారు. మన కుటుంబ మూలాలు, సంప్రదాయాలు, చరిత్ర మనతాత, ముత్తాత, వారి తల్లిదండ్రులు, వారి, వారి తండ్రులు పూర్వోత్తరాలు అధ్యయనం చేయవలసిన సమయం అసన్నం అయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్‌కాకతీయ, కాకతీయల చరిత్రతో సంబంధం ఉందని ఇప్పటి నుంచి ప్రతి కుటుంబం తమతమ తరాల చరిత్రను తెల్సుకోవలసిన అలవాటు జనాల్లో తీసుకొని రావాలని , పాఠశాల స్థాయిలో చరిత్రపై అవగాహన పెంపొందించాలని అన్నారు. సంకేతిక మాధ్యమాలను వినియోగించి విద్యార్థి దశలోనే సానుకూల దృక్పథం కలగజేయాలని అన్నారు. మన కుటుంబ, గ్రామ, జిల్లా, ప్రాంత చరిత్ర చెప్పలేకపోతున్నామని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య సాయన్న మాట్లాడుతూ చరిత్ర అధ్యయనం బట్టి విధానంలో కాకుండా ఆచరణాత్మకంగా ఉండాలని, చరిత్ర పరిణామం, ఆనాటి రాజకీయ, సాంఘిక పరిస్థితులను గురించి భవిష్యత్తు అంచనావేయగలమని అన్నారు. విధాన నిర్ణయాలలో చరిత్ర పరిశోధనలు భాగస్వామ్యం కావాలని, కాకతీయుల పరిపాలన అద్భుతమైనదని అన్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చరిత్ర నిర్లక్ష్యం కాబడిందని చెప్పారు. ప్రస్తుతం అద్భుతమైన పరిశోధనలు జరగాలని, చరిత్ర అంటే బట్టి కాదనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు.

వైద్యరంగ అభివృద్ధికి కృషి

ప్రభుత్వ దృష్టికి ప్రైవేట్ వైద్యుల సమస్యలు ★ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే, నేత్ర వైద్యుడు సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, జనవరి 27: రాష్ట్రంలో వైద్యరంగాభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేయనున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే, నేత్ర వైద్యుడు డా.సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ 4వ రాష్ట్ర మహాసభలు ఆదివారం నగరంలోజరిగాయి. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం రోగుల సేవలో తరిస్తున్న ప్రైవేట్ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, పరిష్కరించేందుకు పాటుపడుతానని హామీ ఇచ్చారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం వైద్యులకు మరిన్ని ఇబ్బందులు పెరిగాయని, వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలోనే నిబంధనలు రూపొందించినా, అమలులో కనబరిచిన నిర్లక్ష్యం, ప్రస్తుత ప్రభుత్వంపై పడుతోందన్నారు. రాష్ట్ర వైద్య రంగం ఎదుర్కొంటున్న ఇక్కట్లకు వైద్యులే కారణమని, నిబద్ధతతో నిబంధనలు పాటిస్తే, ఎలాంటి సమస్యలనైనా అధిగమించవచ్చన్నారు. సమాజంలోని అన్ని వృత్తుల్లో కొనసాగుతున్న వారు సమన్వయంతో తమ విధులు నిర్వహిస్తారని అయితే, వైద్యరంగంలో మాత్రం ఇది కొరవడి, ఐకమత్యం లోపించిందన్నారు. ఫలితంగా నిత్యం అన్ని వర్గాల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీర్ఘకాలంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర అసెంబ్లీలో లేవదీసి, చర్చించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, వైద్యులు కనపడే దేవుళ్ళని అన్నారు.

ఈనానుడిని నిజం చేసే దిశగా నిత్యం వైద్యులు శ్రమించాల్సిన అవసరముందన్నారు. కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాలనుంచి వందలాది మంది వైద్యులు హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన తానా రాష్ట్ర కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా. ఈ.రవీందర్‌రెడ్డి, యశోదా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డా.జిఎస్‌రావు, డా.నరేందర్‌రెడ్డి, డా.సిఆర్‌కె ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.ప్రతాప్‌రెడ్డి, తానా అధ్యక్షుడు డా.సత్యసాగర్ రావు, నిర్వాహక సంఘం అధ్యక్షుడు డా.ఇ. విజయేంద్రరెడ్డి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వైద్యులు పాల్గొన్నారు.

రిగ్గింగ్‌కు పాల్పడ్డారు

మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల, జనవరి 27: రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో మంచిర్యాల నియోజక వర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్‌కు పాల్పడి, ఎమ్మెల్యేలుగా గెలిచారని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో జరిగిన ఫలితాలపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిపారు. న్యాయం జరిగే వరకు సుప్రీం కోర్టుకు వెళ్తామని అన్నారు. మంచిర్యాల నియోజక వర్గంలో ఎన్నికలు జరిగిన తీరు గంట గంటకు పోలైన ఓట్ల సమాచారం తన వద్ద ఉందని ఆయన చూపించారు. ప్రతీ రెండు గంటలకు ఒక సారి పోలైన ఓట్లపై ఆయన సమాచారం అందజేశారు. ఉదయం నుండి సాయంత్రం 4 గంటల వరకు 54 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు ఇచ్చిన ధృవీకరణ పత్రాలు ఉందన్నారు. చివరి గంటలో 3 శాతం పోలింగ్ నమోదు కాగా 4 గంటల వరకు బూత్ లోపల ఉన్న వారికే ఓట్లు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. అయితే చివరి 1 గంటలో 61.88 శాతం చూపించిన అధికారులు 5 గంటల నుంచి 7 గంటల వరకు 64.87 శాతం చూపించారని అన్నారు.

అంటే పోలింగ్ సమయం ముగిసే వరకూ లోపల ఉన్న ఓటర్లు 3 గంటల వరకు వేచి చూసి ఓట్లు వేశారా? అని ఆయన ప్రశ్నించారు. గణాంకాల ప్రకారం 4 గంటల తరువాత ఏకంగా 20 వేల వరకు ఓట్లు పడినట్టు తెలుస్తోందన్నారు. అంటే పోలింగ్ సమయం ముగిసిన తరువాత ఒక్క నియోజక వర్గం పరిధిలో ఏకంగా 20 వేల ఓట్లు ఎలా పడతాయని అనుమానం వ్యక్తం చేశారు.

కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం

సీఎం ఆదేశాలతో అప్రమత్తం • స్మగ్లర్ షబ్బీర్ అరెస్ట్ • పీడి యాక్ట్ ప్రయోగం • ఇద్దరు పోలీసు అధికారులపై వేటు

ఆంధ్రభూమి బ్యూరో


పట్టుబడ్డ కలప స్మగ్లర్ షబ్బీర్

ఆదిలాబాద్, జనవరి 27: అటవీ సంపదను కొల్లగొడుతున్న కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని, ఎంతటివారైన కఠినతర చట్టాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం పక్కా వ్యూహంతో స్మగ్లర్ల ఆటకట్టుకు నడుం బిగించింది. ఆదిలాబాద్ జిల్లాలో 43 శాతం ఉన్న అడవులు 33 శాతానికి పడిపోయిన నేపథ్యంలో కలప స్మగ్లర్లు అధికార పార్టీ నేతలు, పోలీసుల అండదండాలతో రెచ్చిపోతున్న సంఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం పోలీసులు, అటవీ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం, స్మగ్లర్లపై పీడీయాక్ట్‌ల నమోదు ప్రథమ ఎజెండాగా ముందుకు సాగాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ జిల్లాలో అటవీ సంపద తగ్గిపోవడంతో పాటు హరితహారం కార్యక్రమాలు కూడా ఫలితాలు రావడం లేదని ఇంటలిజెన్స్ వర్గాలు పూర్తిసమాచారంతో ప్రభుత్వానికి ఇటీవలే సర్వే నివేదిక పంపారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులతో సమీక్షించిన సీఎం కేసీఆర్ పోలీసు, అటవీ ఉన్నతాధికారులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో నిద్రనుండి మేల్కొన్న అధికారులు పచ్చదనం పెంచడానికి బహుముఖ వ్యూహం రూపొందిస్తునే కరడుగట్టిన కలప స్మగ్లర్లను కటకటాల పాలు చేసేందుకు కసరత్తు సాగిస్తోంది. ఇందులో భాగంగానే ఆదివారం జిల్లాలోనే మొట్టమొదటిసారిగా సిరికొండ మండలం కేశవ్‌పట్నం గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ అనే కలప స్మగ్లర్‌పై ఆదివారం కలెక్టర్ దివ్య అనుమతితో జిల్లా ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ తొలిసారిగా పీడీయాక్ట్ (ప్రివెన్షన్ డేంజరస్ యాక్టివిటీస్) చట్టం కింద కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. షేక్ షబ్బీర్ ఉమ్మడి జిల్లాలో అటవీ అధికారులను బెదిరిస్తూనే పోలీసులు, అధికార పార్టీ నేతల సహకారంతో అటవీ సంపదను కొల్లగొడుతున్నట్లు కలప స్మగ్లింగ్ జీవనోపాధిగా మలుచుకున్నట్లు ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఇచ్చోడ, నేరడిగొండ, గుడిహత్నూర్, ఆదిలాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో షబ్బీర్‌పై కలప అక్రమ రవాణాకు సంబంధించి 12 కేసులు నమోదు కాగా, అటవీ శాఖలో మరో 9 కేసులు కూడా నమోదై ఉన్నట్లు ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ తెలిపారు. అక్రమ కలప రవాణాను నివారించేందుకు, స్మగ్లర్ల ఆట కట్టించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలప స్మగ్లింగ్ నేర ప్రవృత్తిపైనే ఆధారపడ్డ 69 మంది స్మగ్లర్లపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అటవీ శాఖ పిసిసిఎఫ్ పికె ఝా, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ తదితరులు జంగిల్ బచావో.. జంగిల్ బడావో నినాదంతో అడవుల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిసింది. అయితే గత రెండు మూడు దశాబ్దాలుగా కలప స్మగ్లింగ్‌పైనే ఆధారపడి లక్షలు సంపాదించుకున్న ఇచ్చోడ మండలంలోని కేశవ్‌పట్నం, సిరికొండ గ్రామాలతో పాటు జన్నారం, పెంబి, ఖానాపూర్, నేరడిగొండ, బోథ్, ఇంద్రవెల్లి, తిర్యాణి, వాంకిడి మండలాల్లో అటవీ సంపదను కొల్లగొడుతున్న స్మగ్లర్ల జాబితాను సిద్ధం చేయడం గమనార్హం. పోలీసులు, అటవీ శాఖ క్షేత్రస్థాయి అధికారుల సహకారంతోనే జోరుగా కలప స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. రెండు రోజులక్రితం నిర్మల్ ఎస్పీ శశిదర్ రాజ్ మీడియా సమావేశం ఏర్పాటుచేసి కలప స్మగ్లింగ్ కేసులో పోలీసుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడడం జిల్లాలో కలకలం రేపుతోంది. ఇచ్చోడ నుండి వ్యాన్‌లో అక్రమంగా 16లక్షల విలువ చేసే కలపను నిజామాబాద్‌కు తరలిస్తుండగా నిర్మల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఒక ఏఆర్ ఎస్సైతో పాటు అటవీ శాఖ ఫారెస్ట్ సెక్షన్ అధికారుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి వీరిపై చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ కేసును లోతుగా విచారించగా ఇచ్చోడ నుండి నిజామాబాద్‌కు కలప అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరు పోలీసు అధికారులు దగ్గరుండి సహకరించినట్లు తేలడంతో డిజిపి మహేందర్ రెడ్డి ఈ వ్యవహారంపై సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో నేరడిగొండ ఎస్సై సతీష్‌తో పాటు మరో ఎస్సైని జిల్లా పోలీసు కార్యాలయంలో క్రమశిక్షణ చర్యల కింద రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో మరో ఐదుగురు ఎస్సైల ప్రమేయంతో అక్రమ కలప రవాణా జోరుగా సాగుతున్నట్లు ఇంటలీజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఖానాపూర్‌కు చెందిన కీలకమైన టీఆర్ఎస్ పార్టీ నేతలు కలప స్మగ్లింగ్ సాగిస్తూ ఫారెస్ట్ పోలీసు అధికారులను బెదిరించిన సంఘటనలపై కూడా లోతుగా దర్యాప్తుసాగుతోంది. సీఎం ఆదేశాలతో టీఆర్ఎస్ నేతలపై కూడా రెండు మూడు రోజుల్లోనే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

సాహితి

email: sahiti@andhrabhoomi.net



ఎదురుచూపులు

రోజుల తరబడి వదిలిపోలేని బెంగ
తిరిగి ఇంటికి వస్తుంటే
వాహనం రానప్పుడు
అటీటు చివరలకు చూపులు
నిట్టూర్పులుగా సారించడం


టన్నుల కొద్దీ బరువును తలపై మోస్తూ
బస్సు కోసం ఎదురుచూడటం

బడి వదిలినా
చిన్న మనుమరాలు రాకపోయినప్పుడు
కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ
పదేపదే వేచి చూస్తూ
ఎత్తుకునే చంక తియ్యగా తీపు తీయడం

బోర్డింగ్ పాసు తీసుకున్న పిదప
విమానం మూడు గంటల ఆలస్యమని
తెలిసినప్పుడు
గడియారం వెంట కాలాన్ని
గడియ గడియకు పరుగెత్తిస్తూ
ఒంటరి మనసు వేస్తున్న గంతులకు
వంతుల వారీగా తిలకించడం

ప్రాంతం కాని ప్రాంతంలో
భాషగాని భాషావరణంలో
కాలం నేనూ
తారసపడి కన్నెర్ర చేయడం
తలుపు సందులో నలిగిన
చెయ్యి బాధను తలుచుకోవడం

- జూకంటి జగన్నాథం



ప్రయాణం

మన గురించి లోకం గీసే ఊహాచిత్రాలన్నీ
కాలం చెరిపేస్తుంది!
మన గురించి మనం ఎంచుకున్న
మార్గాలన్నీ
లోకం మూసేస్తుంది!
తెలియని శక్తులేవో నిర్దయగా, నిర్భీతితో
నచ్చిన మార్గంలో నడిపిస్తాయి!
దీనంగా హీనంగా చైతన్యరహితంగా
మనము నడిచి వెళ్లాం
యుగాల దూరం గమ్యమొక్కటే...?
గతాన్ని ఎందుకో మనసు అంగీకరించదు
దాటేసిన మైలురాళ్లు
కాటేసిన విషనాగులే
గత కాల జ్ఞాపకాలు ఒక్కొక్కటే ప్రశ్నిస్తాయి
గుండెలలో గునపాలు గుచ్చి కదిలిస్తాయి
తలవంచుకుని మనం నడిచాం
ముందు వెనకాల శవాల గుట్టలు

ఆధిపత్యం కోసం సాగిన రాక్షస క్రీడలో
మిగిలిన ఆనవాలే చరిత్రపుటలు
ఛిద్రమైన దేహాలెన్నో దారి పొడవునా
విచిత్రంగా వీక్షించామే కానీ...
కుట్రలు కుతంత్రాలు మనతోనే...
మనలోనే...
కుడి ఎడమలుగా సాగుతూ ఉంటాయి
దారుణ దానవత్వం అంతరంలో పదిలం
విడనాడని పశుత్వం
విడివడని క్రూరత్వం మనలో
సోదరత్వపు ఆనవాలు శూన్యం
సాధుతత్వం సంతలో సరుకవుతుందిక్కడ
దూరమవుతుంది సమానత్వం
నిత్యం ఓడిపోతుంది మానవత్వం
జీవశ్చవాలుగా నడిచాం యుగయుగాలు
ఇలా ఎంత దూరం...
చలనం లేని పయనం?

- ఒరువూరు క్రిష్ణయ్య, 8500957899



మనసుపడే ఆరాటం

ఏ పుష్ప సౌరభాలూ
ఆఘ్రాణించి ఆనందించాలని లేదు
రామణీయత దృశ్యాలేవీ
నాకు నేత్రానందకరంగా లేవు
ఎదలో వలపులూరించు
తీయటి పలుకులేవీ
పరితృప్తి జనింపజేయడం లేదు
ఇష్టమృష్టాన్నాలకై
నా మనసు ఉవ్విళ్లూరడం లేదు
ఆడంబరాలంటే ఎందుకో
నాకెన్నడూ విముఖతే
వాస్తవిక దృష్టితో
నేను చూసే ప్రతి వ్యక్తిలోనూ
కొట్టొచ్చినట్టు కనపడే

మరో వికృత రూపమే
చీకటిలో వెలుగు
చూడాలనుకునే నాకు
వెలుగులోనూ చీకటే
స్వచ్ఛమైన మనుషుల్లోని
కలుషిత భావాలే
నన్నెంతగానో కలచివేస్తున్నాయి
తెల్లారితే అంతా
తన చుట్టూ గిరిగీసుకుని
ఆ వృత్తంలో పరిభ్రమించేవాళ్లే
విశాల దృక్పథాలు
కావ్యపక్షులుగా మిగిలిపోరాదన్నదే
నా మనసుపడే ఆరాటం!

- కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం, 9492457262

‘మహీధర’ స్వరాజ్య శంఖం ‘కొల్లాయిగట్టితేనేమి?’

1921 ఏప్రిల్‌లో గాంధీజీ ముంగండ అగ్రహారంలో ఒక పది నిమిషాలు గడిపితే, తన పదేళ్ళ వయసులో ఆ అపురూప దృశ్యాన్ని చూసి, రాబోయే కాలంలో, ఈ స్మృతి వైభవాన్ని సమృద్ధ నవలారాజంగా రూపొందించిన ఘనత మన మహీధర వారిది. సాంఘిక, రాజకీయ, చారిత్రక నేపథ్యంలో స్వాతంత్ర్య భావన, గాంధీజీ నాయకత్వం పట్ల తెలుగు ప్రజల స్పందనను, పది నిమిషాల గాంధీజీ సమయం, తను పదేళ్ళప్పుడు చూసిన దృశ్యం, పది కాలాలు నిలబడే నవలగా రూపొందించడమే మహీధరవారి ప్రగతిశీల, ప్రజావిధేయ కళాకౌశలం.

అనగా అనగా ఒక ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ. మూడున్నర దశాబ్దాల కిందటి వరకూ పనిచేస్తూ ఉండేది. ఆ పనిలో భాగంగానే 1968లో తెలుగునాట స్వాతంత్ర్యోద్యమ చిత్రణ చేసిన నవలల్లో ఒకటైన ‘కొల్లాయిగట్టితేనేమి’ నవలకు ఉత్తమ నవలగా, ఈ రాష్ట్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రకటించింది. ఆ నవలా రచయిత మహీధర రామమోహనరావుగారు. నేటికీ, ఈ నవలకు పురస్కార గౌరవం లభించి యాభై ఏళ్లు. ఈ జనవరి 26, డెబ్భయ్యో రిపబ్లిక్ దినోత్సవం, మన దేశానికి అరవై తొమ్మిదేళ్ల గణతంత్ర జీవితం పూర్తయి డెబ్భయ్యో ఏటికి తెర తీస్తున్నాము. ఈ విశేష సందర్భంలో తెలుగుజాతి, సాంఘిక పరిస్థితి, గాంధీజీ చింతన, స్వరాజ్య కాంక్ష, ఇవన్నీ సముచితంగా, వాస్తవిక దృష్టితో చిత్రించిన నవల ‘కొల్లాయిగట్టితేనేమి’. రచయిత 1960ల్లో రాసినా, అది 1920ల నాటి తెలుగు సమాజపు కథ. 2011లో వేగుంట మోహనప్రసాద్‌గారి అనువాదంలో ‘‘స్వరాజ్యం’’ పేరిట, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌వారి ప్రచురణగా ఇంగ్లీష్ భాషలో కూడా వచ్చింది.

రాస్తున్న కాలానికి మహీధరవారు కూడా పరిణత నడివయస్కులు. 1909లో పుట్టిన మహీధర రామమోహనరావుగారికి 1960ల నాటికి యాభైల వయసు. అప్పటికే అంతకుముందర వారి రచనలు అగ్నిగుండం, కత్తుల వంతెన వంటివి వెలువడ్డాయి. రామమోహనరావుగారి తండ్రి బ్రహ్మసమాజ ఆవలంబికులు. వారి పూర్వుల ఊరు, తాను పుట్టిన ఊరు ముంగండ అగ్రహార గ్రామం, ఎక్కువగా బ్రాహ్మణ పల్లె. గోదావరి లంకల్లో ఉన్నది. అక్కడికి పడవ ప్రయాణాలు తప్ప మరో దారి లేని 1920ల కాలం, అప్పటికి పదకొండేళ్ళవాడు అయిన ఈ బాలుడికి ఈ పడవ ప్రయాణాలు అనుభవంలో ఉన్నవే. ఆ కారణంగా, నవల మొదటి అధ్యాయాల్లో చిత్రించిన గోదారి లంకల పడవ ప్రయాణం, సహజంగానే చదువరులను ఆకట్టుకుంటుంది. స్వాతంత్ర్యోద్యమ కార్యకర్త కావడానికి, తన కాలేజీ చదువు మానుకుని, విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా తన దుస్తులను కూడా తగులపెట్టి, పల్లెకి ప్రయాణం అయిన రామనాథానికి, ఆ పడవ ప్రయాణంలో పరిచయం అయిన నాయుళ్ళ యువతి స్వరాజ్యం. సాంస్కృతిక చరిత్ర తెలీకుండా భారతీయ విప్లవాలు జరగవు అని గ్రహించి, ఏ దేశానికైనా తనదైన సాంస్కృతిక చరిత్రనుంచే జాతీయావేశంతో కూడిన సంస్కరణ, పరిణామ వేగంతో కూడిన రాజకీయ సాంఘిక సంఘటనలు జరుగుతాయి అని తన నవల ద్వారా చిత్రించాలన్నది ఒక లక్ష్యంగా మహీధరవారు ఈ నవల రాశానని చెప్పారు. అందుకు కారణం, ‘‘అమృతాంజన్ అమ్ముకోవడానికే ఆంధ్రపత్రిక పెట్టారు, అల్లూరిని సమర్థించడానికి కాదు’’ అన్న ఒక విమర్శ ఒకసారి వామపక్షీయులే రాసినది, విశాలాంధ్ర పత్రికలో చదివి, నొచ్చుకుని, చరిత్ర, సంస్కృతి సక్రమంగా అర్థం చేసుకోవడం, జాతీయోద్యమం, సంస్కరణల బీజాల పట్ల అవగాహన ఏర్పరచుకోవడం మార్పుకోరే వారి మౌలిక బాధ్యతగా తెలియచెప్పాలి అంటే కావలసిన ఒక బలమైన దృష్టిని రచన రూపేణా చెప్పడం అవసరం అని తాను తలపెట్టిన నవలగా వారు విశదపరిచారు.

రామమోహనరావుగారు నవలలో పాత్రల విషయమై అన్నీ కల్పితాలే అని చెప్పారు. పాత్రల స్వరూప స్వభావాల్లో, తాను చూసిన, ఎరిగిన బ్రహ్మ సమాజ చింతన ప్రభావం, స్వతహాగా సంఘ మనస్థితిలో సాధారణ పరిస్థితుల్లో ఉండే స్వల్పబుద్ధి, అనాలోచితంగా ఆచార వ్యవహారాల పాటింపు, వీటి పాత పద్ధతులకు, చదువువల్ల వస్తున్న కొత్త ఆలోచనల అమలువల్ల ఎంత గ్రామీణ సమాజమైనా అక్కడ తలెత్తుతున్న ఘర్షణ వాతావరణం, ఎంత స్వాతంత్ర్యం కోసం అయినా, తమ పద్ధతులను మార్చుకోవడం ఇష్టం లేని పాత సమాజ చట్రం, అందులో ఇరుక్కుని ఉన్న తన బంధువులు, అయినవారు, ఇతర శ్రేణుల ప్రజలు, వీరి మానసిక దశలో ఒక గుణాత్మక పరిణామం, క్రమేపీ మాత్రమే ఎలాసాధ్యమో, చిన్న చిన్న మాటలతో, నింపాదిగా చెప్పిన నవలా చిత్రణ, మనకి ‘కొల్లాయిగట్టితేనేమి’లో కనిపిస్తుంది.

ప్రధాన పాత్రల పేర్లు రామనాథం, స్వరాజ్యం. రామనాథం, స్వరాజ్యం స్వాతంత్ర్య పోరాట క్రమంలో ఒకరికి ఒకరు చేరువవుతారు. ఈ పేర్లు, ముఖ్యంగా ‘స్వరాజ్యం’ అనే పేరు ఆలోచించి పెట్టినదే అని తెలుస్తుంది. రామనాథంలో మహీధరవారు జీవితంలో ఎదుర్కొన్న అనేక ఘట్టాల కళాత్మక ప్రసక్తి కనిపిస్తుంది. ముంగండలో వాళ్ళ చావడిలోనే ఊరి గ్రంథాలయం ఉండేది. అందులోనే ఏడేళ్ళ వయసుకే వావిలకొలను సుబ్బారావు, సెట్టి లక్ష్మీనరసింహం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు లాంటి ప్రముఖులు రచించిన పలు పుస్తకాలు చదవడం అలవాటు అయ్యింది. పధ్నాలుగేళ్ళ వయసులో ఆయనకు వివాహమైంది. అది కూడా ఆ ఎదురింటి పిల్ల చక్కదనాలు చూసే పెళ్ళాడేశాను సుమా అనే మహీధర ఇలా చెప్పారు. ‘‘నేను 13 ఏళ్ళ వయస్సులో వుండగా మా వీధిలో, మా యింటికెదురుగా ఇల్లు కొనుక్కుని పొరుగూరునుంచి ఒక కొత్త కుటుంబం కాపురం వచ్చింది. మర్నాడు ఉదయం మా ఇంటి గుమ్మంలో కొత్త అమ్మాయి 10 ఏళ్ళది- పచ్చని ఛాయ, నవ్వు ముఖం, నల్లని మస్లిన్ దుస్తులతో హాజరయింది. ఆనాటి ఆ విగ్రహం 70 ఏళ్ళ తర్వాత కూడా నా కళ్ళముందు కనిపిస్తూంది. దానికి ప్రేమా, దోమా అని పేరు వద్దు. ఆడ-మగ మధ్య వుండే ఆకర్షణ. అప్పటినుంచి ఆమె మా యింటికే ఒక విధంగా అతుక్కుపోయింది. ఓ ఏడాదిపోయాక ఆమెతో పెళ్ళి అన్నారు. నేను వీరేశలింగంగారి హితబోధ మరచిపోయేను. ఎగతాళి చేసి లాభం లేదు. వ్యక్తులు ఏర్పరచుకొనే నియమాలు సమాజగత సంస్కారంగా మారే లోపున వ్యవధి తీసుకుంటుంది.’’

ఆంధ్రపత్రిక అల్లూరి విషయంలో తీసుకున్న స్టాండ్ చూసి ఏదో అన్నారని నొచ్చుకున్న మహీధర, నిజానికి చిన్నతనంలోనే కాశీనాధుని నాగేశ్వరరావుగారి కృషిని ఎరుగుదురు. అది కారణంగా జాతీయోద్యమ మూలాలు సమాజంలో ఎక్కడ ఉన్నాయో చూపడం, వాటిని భారతీయ విప్లవకారులు అవగాహన చేసుకోవలసిన అవసరం ఉండగా, తానీ రచన చేశాను అన్న చారిత్రక దృష్టి రచయితలో, పేరు దగ్గరనుంచీ కనిపిస్తుంది. ‘కొల్లాయిగట్టితేనేమి?’ అన్నది నిజానికి మన తెలుగు నాట ప్రభవించిన గాంధీజీ ప్రభావిత సాహిత్యంలో ఒక ప్రముఖ గీతపు పల్లవి. తెలుగునాట బహుళ ప్రచారంలో ఉన్నా ఈ పాట రాసినది బసవరాజు అప్పారావుగారు. 1933లో వారి అకాల మరణానంతరం, బసవరాజు మెమోరియల్ కమిటీ, 1934లో ప్రచురించిన బసవరాజు అప్పారావు గీతాలులో ‘మా గాంధీ’ పేరిట ఈ గీతం కనిపిస్తుంది. 1938లో తీసిన ‘మాలపిల్ల’ సినిమాలో సూరిబాబుగారు దీనిని పాడారు. ఇదీ మహీధర వారి ‘కొల్లాయిగట్టితేనేమి’ నవలా శీర్షిక చరిత్ర. అయితే మహీధరవారు చరిత్ర దృష్టిగల రచయిత గనుక, కథాకాలం అయిన 1920-21 నాటికి, నిజానికి గాంధీజీ కొల్లాయి కట్టడం మొదలుకాలేదని, తరువాత కొన్నాళ్ళకు ఈ వస్త్రధారణ ప్రారంభించారని కూడా సూక్ష్మ వివరణ ఇవ్వడం అవసరం అని పాటించిన జాగ్రత్తగల రచయిత. సెప్టెంబర్ 1921 ముందరే, ఈ కథాకాలం ముగుస్తుందని మనం చరిత్ర ఆధారంగానే గ్రహించాలి. ఎందుకంటే, సెప్టెంబర్ 1921లో మదురైలో గాంధీజీ తన దుస్తుల విషయంలో ఈ ప్రధాన నిర్ణయం తీసుకుని అమలుపరిచారు. అలా మదురై, గాంధీజీని కొల్లాయికి, భారతీయ వస్త్రధారణకి మార్చిన మహత్తర స్థలం.

నవలా కథాకాలం 1920-21లో కొద్దినెలలు మాత్రమే అన్నది ఎంత ఖచ్చితమో గ్రహిస్తే ఆశ్చర్యపోతాము. కథాకాలానికి రామనాధానికి డిగ్రీ చదువుల వయసు, అంటే పందొమ్మిది - ఇరవై ఏళ్ల వయసు. విదేశీ వస్త్ర దహనంలో తన బట్టలు, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యానికి తన చదువు సమర్పించి పల్లెదారి పట్టాడు. అప్పటికే ఈ యువకునికి పెళ్లి అయింది. బాగా చదివి అధికారి అవుతాడని, మామగారు పోలీసు సూపరింటెండెంట్ అయిన నారాయణమూర్తిగారు ఇతనికి పిల్లనిచ్చారు. తల్లిదండ్రులు చిన్నప్పుడే పోగా, దత్తు తీసుకుని పెంచిన పెత్తండ్రి, పెత్తల్లి ఉన్నారు. వారికి ఆ గ్రామంలో ఇతరులకు, రామనాథం భవిష్యత్తు పట్ల ఇటువంటి ఆశలే ఉన్నాయి. వాటిని వమ్ముచేస్తూ, రామనాథం ముంగండ తిరిగి వస్తున్న కాలం డిసెంబర్ 1920 తరువాత. ఎందుకంటే, 1920 డిసెంబర్‌లోనే జరిగిన జాతీయ కాంగ్రెస్ సభల్లో సి.ఆర్.దాస్ ప్రవేశపెట్టిన సహాయ నిరాకరణ తీర్మానం అనుసరమే, ఈ యువకుని ప్రవర్తన ఉన్నది. ఆ ప్రధాన తీర్మానంలో ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు, విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులు, గౌరవ పదవులను వదులుకోవడంతోపాటు ప్రభుత్వ సర్వీసులనుంచి వైదొలగడం వరకు సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని విస్తరించాలని నిర్ణయించారు.

ఈ నవల ఇలా డిసెంబర్ 1920 కాలంలో మొదలై, ఏప్రిల్ 1921 మొదటి వారంలో ముగుస్తుంది. అంటే నాలుగునెలల కథాకాలం నవలలో ఉన్నది. రాజోలునుంచి పాత గన్నవరం మీదుగా అమలాపురం రావడానికి వీలుంటే, ముంగండ గ్రామానికి గాంధీజీ రాక, అక్కడ ఖద్దరు ఉత్పత్తి కేంద్రం ప్రారంభించడం జరగాలని నవలలో రామనాథం, ఇతర గ్రామస్థుల ఆలోచన. గ్రామ ప్రజలందరూ కులాలకు అతీతంగా, గాంధీజీ సందర్శన కోసం ఉత్సాహంగా ఎదురుచూడడం, శ్రోత్రియ బ్రాహ్మణ ప్రతినిధి అయిన శంకరశాస్త్రి, రామనాథం బాబాయి సైతం తమ గ్రామానికి గాంధీజీ రాగానే సమర్పించడానికి గీత శ్లోకాన్ని తాటాకు మీద రాసి తెచ్చి అందిస్తాడు రామనాధానికి. (ఇవీ మహీధరవారి మాటలు నవల చివర్లో).

‘‘చక్కని గుండ్రని అక్షరాలతో దానిమీద భగవద్గీతనుంచి ఒక్క శ్లోకం వ్రాసి వుంది. అక్షరాలు స్ఫుటంగా కనిపించేటందుకు కాకరాకు పసరు రుద్ది వుంది.

‘యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థానమధర్మస్య సంభవామి యుగే యుగే’

ఆ తాళపత్రం గాంధీగారికి విరాళంతోపాటు ఇవ్వడానికి తయారుచేశాడు ప్రత్యేకంగా శాస్త్రి. ముంగండ తరపున గాంధీజీకి అది జ్ఞాపిక, ఆయన యెడ వారి విశ్వాసానికది గుర్తు. ఆయన సందేశం యెడ వారికి గల శక్తి భావానికది సూచిక. ముంగండే కాదు, తెలుగుదేశమే ఆ విశ్వాసంతో ప్రతిబింబించింది. గాంధీజీ సందర్శనం కోసం గ్రామం ముస్తాబు అయింది. గ్రామస్తులు సంబరంగా ఎదురుచూస్తున్నారు. ఇదీ నవల ముగింపు. ఒకామే తరువాత అడిగింది, అయితే నిజంగా గాంధీజీ ముంగండ వచ్చారా? అని దానికి మహీధరవారు రికార్డ్‌లో ఇచ్చిన జవాబు. నవల చదివిన ఒక అమ్మాయి, ‘గాంధీగారు నిజంగా ముంగండ వచ్చారా’? అని రాసింది. రావడమే కాదు. ఆయనకు ‘‘యదా యదాహి ధర్మస్య’ శ్లోకం తాటాకుమీద రాసి, పసరుపూసి కనబడేలాచేసి ఇవ్వడం కూడా నిజమే. కాని, తరువాత నవలలో కనిపించే ‘సుందరమైన రాట్నమే’ పాట అబద్ధం. నిజానికి ఆ క్షణంలో నేను అక్కడే వున్నాను.’’ తన బాల్య జీవన బలమైన ఛాయలతో కథ చెప్పి, దాన్ని 1920-21 కాలంలో నాలుగు నెలలపాట కథాకాలంగా క్రమశిక్షణతో చెప్పిన మహీధర, గాంధీజీ కొల్లాయి గట్టే నిర్ణయం, ఈ విజయవాడ/ ముంగండ యాత్ర జరిగిన కొద్ది నెలల తరువాత మాత్రమే (మదురైలో సెప్టెంబర్ 1921లో) తీసుకున్నారు అని చెప్పడంలోగల అంతరార్థం, చరిత్ర కల్పనలో కలిపి చెప్పేటప్పుడు రచయితకి ఉండవలసిన అపారమైన బాధ్యత, క్రమశిక్షణ పట్ల తనకుగల విధేయత గురించి వివరించడమే.

1921 ఏప్రిల్‌లో గాంధీజీ ముంగండ అగ్రహారంలో ఒక పది నిమిషాలు గడిపితే, తన పదేళ్ళ వయసులో ఆ అపురూప దృశ్యాన్ని చూసి, రాబోయే కాలంలో, ఈ స్మృతి వైభవాన్ని సమృద్ధ నవలారాజంగా రూపొందించిన ఘనత మన మహీధర వారిది. సాంఘిక, రాజకీయ, చారిత్రక నేపథ్యంలో స్వాతంత్ర్య భావన, గాంధీజీ నాయకత్వం పట్ల తెలుగు ప్రజల స్పందనను, పది నిమిషాల గాంధీజీ సమయం, తను పదేళ్ళప్పుడు చూసిన దృశ్యం, పది కాలాలు నిలబడే నవలగా రూపొందించడమే మహీధరవారి ప్రగతిశీల, ప్రజావిధేయ కళాకౌశలం. 1960ల్లో తను రాసిన 1920-21 కాలపు నవలకి పేరుగా నిలిచే సంఘటన, ఆ నవలలో చిత్రితమైన కాలం తరువాత జరిగిందని చెప్పడం సాహిత్యానికి చరిత్ర సూత్రాలను అనువర్తింప చేసేటప్పుడు రచయిత తీసుకోవలసిన జాగ్రత్తకూడా. ఇలా ప్రస్తుతపు ఏడుపదుల భారత గణతంత్ర సందర్భంలో, స్వాతంత్ర్యోద్యమ ప్రభంజనానికి తెలుగునాట సూత్రధారిగా నిలిచిన ఒక సాంఘిక కల్పన చేసిన రచయిత, నిజంగా, సాహిత్య క్షేత్రంలో మహీధరమే.

- రామతీర్థ, 9849200385

ఊరకుక్క

చిన్నప్పుడు నా తొలి స్నేహితులు
కుక్కపిల్లలే!
చంకలో బెట్టుకొని ఊరంతా తిప్పేవాణ్ణి
కుక్కకున్న బుద్ధి ఎంత గొప్పది...
ఒకనాటి కోటయ్య తాత
మాట కోసం
మరణించింది కూడా ఓ కుక్కే!
అదో కత...

మా పొలాన
ఊరకుక్కే పెంపుడు కుక్కై
నిజంగా నీతిగ బతికిపోయిందొకటి వెనకట
ఏ రోతూ దొంగతనం చేయలా?
ద్రోహిగా మారలా?
అటు పంటనీ
ఇటు పొట్టు కుంపటి మీద
కోడిగుడ్లనీ
కాపలా కాసిన అత్యంత నమ్మకస్తురాలు అది!

ఏ జన్యువు
ఎలా ప్రతిస్పందిస్తుందో గానీ
కుక్కకీ మనిషికీ ఆ మైత్రీబంధం అద్భుతం!

పది రోజుల క్రితం
ఓ కుక్కపిల్ల
దారంతా వెతుకుతోంది ఎందుకో ఏమిటో
దాన్ని దాని భాషలో అలా పలకరించా!
అది నా ఎనమాలనే మా ఇంటికి వచ్చి
కాసిన్ని పాలు తాగి
మేడ పైకీ కిందికీ ఎక్కి దిగి
మెట్లమీద కాలెత్తి పోసి మౌనంగా వెళ్లిపోయింది..
మళ్ళీ రాలా!!



మొన్నటి
అర్ధరాత్రి ఆటో దిగి నడుస్తున్నప్పుడు
కొన్ని పరాయి కుక్కలు
పరిచయం లేని పెద్ద కుక్కలు
నా రాకని చూసి అనుమానంగా, అసహనంగా
మొరిగితే
నా చెలిమి - నా బంగారి
ఆ చిన్ని విశ్వాసి నన్ను గుర్తించి
నా గురించి
అనంత ప్రేమ ప్రకటించింది
అన్నింటి అరుపులు కట్టిపెట్టండంటూ
నాతో
మా ఇంటిదాకా తోకాడిస్తూ
వెంబడించి
మూచ్చూసి మళ్లీ వెళ్ళిపోయింది చలాకీగా!
అదొక బుజిగీ...

కుక్క విశ్వాస జీవి మాత్రమే కాదు
అది
మనిషి చదవాల్సిన
ఓ మంచి వీధి పుస్తకం!

- రవి నన్నపనేని, 7993981211

తెలియని దిగులు, తరగని ప్రేమ కలుగచేసే కథలు

వేసవి వర్షిస్తుందా? అవును. వర్షిస్తుంది. చండ్రప్రచండంగా మండే సూర్యుడు తాను వేడెక్కి, భూగోళాన్ని వేడెక్కించి, సూర్యుడూ భూమీ- ఇద్దరూ తాపానికి గురియై పరితపించి, పరితపించిన వేళ ఇద్దరినీ శ్రావణ మేఘాలు తన పరిష్వంగనంలోకి తీసుకుని, తడిపి ముద్దచేసినది వేసవి వల్లనే కద! 53 ఏళ్ళ ఆకునూరి హసన్, 23 ఏళ్ళ ప్రాయంనుండి రాస్తూనే ఉన్నారు. 8 నవలలు, 50 వరకు కథలు ఇంతవరకు రాసారు. 30 ఏళ్ళ సాహితీ ప్రస్థానంలో ఇదేమంత పెద్ద సంఖ్య కాదు. కాని ఆయన ‘రాసి’ కంటే ‘వాసి’ ముఖ్యం అని నమ్ముతారు. రాసిన ప్రతి కథలోనూ దగాపడిన, దౌష్ట్యానికి, అణచివేతకు గురియైన ఒక స్త్రీ ఉంటుంది. అగ్నిలా జ్వలించే పురుషుడికి ఆమె సమిధ అవుతుంది. జాతిలో సగం స్త్రీ. అయినా, ఆమె ఎప్పుడూ పురుషుడికి పాదాక్రాంతం అవుతున్న స్థితిని, ఆమెపై జరుగుతోన్న వికృతాలను ఒక నిరాపేక్ష ప్రేక్షకుడిగా గమనిస్తున్నాడు ఈ రచయిత. నిజం, నిజాయితీ అక్కరలేని ఈ కర్కశ ప్రపంచంలో ఆమె ఎలా రాజీపడి బ్రతుకుతోందో ఈ రచనల ద్వారా చూపాలన్న ప్రయత్నం చేస్తున్నాడు హసన్‌గారు. రికార్డింగ్ డాన్సు ట్రూపులోని ‘ఎర్రచొక్కా అమ్మాయి’ లైరా; బంగాళా ఖాతంలో వాయుగుండం వస్తే, ఏటికి అవతలి గట్టు చేరాలనుకున్న ఆ మనిషికి తన పూరి గుడిసెలో ఆశ్రయం ఇచ్చింది ‘ఆమె’. గత స్మృతులతో ‘ఆమె’లో అగ్నిజ్వాలలనెగదోస్తాడు. ఆమెని తన కోరికకీ, అనుభవానికీ లొంగిపోయేట్లు చేస్తాడు. అపురూపమైన ఆ అనుభవానికి రెండువందల రూపాయల వెలకడితే ఆమె గుండె పగలక మరేమవుతుంది? (అవతలి గట్టు). బేల్దారి పని వెదుక్కుంటూ శేషమ్మ భర్త నైజాం వెళ్తాడు. ఎప్పుడో కాని ఏడాదికో, మరో యేటికో వస్తాడు. అంతవరకు శేషమ్మా ఇద్దరు పిల్లలు ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీయాల్సిందే! ఆ సమయంలో వేసవి, వర్షాన్ని స్వాగతించినట్టుగా, సైకిలుమీద బట్టలుంచుకుని అమ్మే రామరాజు తారసపడతాడు. మగాడి రక్షణ కరువై శేషమ్మా, తండ్రి ఆప్యాయతకు కరువై పిల్లలు, నేలన పడ్డ సొరతీగలా అల్లాడిపోతోంటే, ఆదుకుంటానంటూ రామరాజు చేతులు చాపితే, అతని చేతుల మధ్య ఇమిడిపోకుండా ఎలా ఉంటారు? (వేసవి వర్షం)

‘వెలుతురు పిట్ట’లోని మధులికది మరో రకమైన జీవితం. ప్రేమించిన కృష్ణచైతన్యకు కాకుండా, మునసబుగారి చిన్న కోడలవుతుంది. ఆమె కోరికల్ని చంపుకోలేక అప్పుడప్పుడు రహస్యంగా ‘చైతూ’ని కలుస్తుంటుంది. పండు మిరపళ్ళు అమ్ముకునే మునిరత్నంతో ఉంటున్న రత్నావళి సాయంతో ఓసారి మధులిక చైతూని కలుస్తుంది. అప్పుడప్పుడు దొరికే మధులిక కంటే, చాచగానే చేతికందే రత్నావళిని కృష్ణచైతన్య ఇష్టపడటంలో ఆశ్చర్యం ఏముంటుంది? సాంప్రదాయాలు, కట్టుబాట్ల చట్రంలో బిగించబడిన స్త్రీ, ఉండేది బంగారు పంజరం. అయినా బయటపడి స్వేచ్ఛగా ఎగరాలనుకుంటుందిట. తెలుగు సాహితీ లోకానికి చిర పరిచితురాలైన డి.కామేశ్వరి గారు ఒకచోట - ‘అరిటాకు ముల్లు సామెత ఎప్పటికీ మారదు’ అని అంటారు. ఇది నూటికి నూరుపాళ్ళూ నిజం అని నమ్ముతాడు ఈ రచయిత. చలం కథల్ని, ఆయన ఆలోచనలను తోడుగా ఒంటపట్టించుకున్న వాడిలా అవుపిస్తాడు హసన్. సంకలనంలోని ‘ఆనాటి వెన్నెల చినుకు’ కథ చదువుతూంటే పాఠకులకు చలంగారి ‘బోగంమేళం’ (అనుకుంటాను) కథ గుర్తుకు వస్తుంది. ‘‘పర్ణశాల లాంటి పూరిల్లు పక్కనే పశువుల పాక ఇంటిముందు పూల చెట్లూ అలికి ముగ్గులుపెట్టిన నేలా గాలికి తలలూపుతున్న బంతి పూలు, ఇల్లెక్కి కూత పెడుతున్న కోడి పుంజు’ (పే.47)లాంటి వర్ణనలతో చిత్రాలు గీసి చూపుతాడు రచయిత. ఎన్నోచోట్ల, ఎంతో కొత్తగా చెప్పుతాడు హసన్. రామరాజు ఇచ్చిన చీర ‘ఆడదానిని ప్రేమించే మగవాడి మెత్తటి మనసులాగా తగిలిందట’ శేషమ్మకు (వేసవి వర్షం). ‘వెలుతురు పిట్టకథలో ఒంటరిగా క్షణాలు లెక్కిస్తూ వెన్నెల వెలుగులో కూర్చున్న రత్నావళికి ‘పక్షేదో నిప్పు కణికల్లాగా మెరిసే కళ్ళతో కూర్చుందిట. (పే 55). ప్రతి కథ చివర ముగింపుగా రచయిత ఇచ్చిన పేరాలు/వాక్యాలు పాఠకుడిని మళ్ళీ మళ్ళీ చదివింపచేస్తాయి. స్త్రీ కేంద్రకంగా రాసిన హసన్‌గారి 15 కథల్ని రసజ్ఞులైన పాఠకుల గుండెల్ని సున్నితంగా తాకుతాయి. కొన్ని కొన్ని వాక్యాలు రెండోసారి, మూడోసారి చదివితే గాని కథకుడి ఆంతర్యం అవగతం కాదు. ‘‘దమ్ బిర్యానీ’’ కథలో సల్మా గురించి రచయిత ఇలా చెబుతాడు. ‘అందరు మగవాళ్ళే కాదు, అందరు ఆడవాళ్ళు కూడా ఒకేలాగా ఉండరు. అవును. అందరు రచయితల్లాగే ఆకునూరి హసన్ రాయరు. నిజం, నిజాయితీ అక్కర్లేని బూజు మసక లోకపు మనుషుల్లోంచి బయటపడి, ఇంద్రధనుస్సు అందుకోవాలని ఆశపడుతూ రాస్తారు.

వేసవి వర్షం కథలు
రచన : ఆకునూరి హసన్,
వెల: రూ.150/-
ప్రతులకు: జె.వి.పబ్లికేషన్స్,
హైదరాబాద్, ఫోను: 8096310140
మరియు ప్రధాన పుస్తక విక్రయశాలలు

- కూర చిదంబరం, 8639338675



ప్రధాని మోదీకి బహుమతులుగా వచ్చిన వస్తువులను ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీలో వేలానికి ప్రదర్శించిన దృశ్యం

వేలానికి మోదీ మెమెంటోలు

❍ అమ్మకానికి 1990 బహుమతులు ❍ కనీస ధర రూ.100, అత్యధిక ధర రూ.30,000

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో వచ్చిన మెమెంటోలను ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు వేలంలో ఉంచారు. ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ) అనే ప్రధాన ప్రాజెక్టు వేలం ద్వారా నిధుల సమీకరణ కోసం ముందుకు వచ్చింది. ఈ-వేలంలో పాల్గొనాలనుకునేవారు ఎవరైనా సంబంధిత ప్రభుత్వం సైట్ 'హెచ్‌టీటీపీ://పీఎంమెమొంటోస్.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా కనీస ధర 100 రూపాయల నుంచి 30,000 రూపాయలు చెల్లించి ఈ వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది. ఇత్తడి, సిరామిక్, దుస్తులు, గ్లాస్, బంగారం, మెటాలిక్ వంటివాటితో తయారైన ఆయా మెమెంటోల బరువు, ఎవరు వాటిని ప్రదానం చేశారో వంటి వివరాలతో పాటు అమ్మకం విలువతో కూడిన పూర్తి జాబితాను ఆ వెబ్‌సైట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇదిలావుండగా, బంగారం పూత పూసిన రాధ, కృష్ణుల విగ్రహాల కనీస ధర 20,000 రూపాయలుగా నిర్ణయించారు. అదేవిధంగా 4.76 కేజీల బరువు గల విగ్రహాన్ని సూరత్‌కు చెందిన మాంద్వినగర్ పాలిక ప్రాంతం నుంచి ప్రధాని మోదీకి బహుమతిగా వచ్చిన మెమొంటోల్లో అతి పెద్దది. ఆ తర్వాత 2.22 కేజీల వెండి పూత పూసిన మొమెంటోను బీజేపీ మాజీ ఎంపీ సీ.నరసింహన్ ప్రధాని నరేంద్ర మోదీకి బహుమతిగా అందజేశారు. వేలంలో దీని విలువ 30,000 రూపాయలుగా నిర్ణయించడంతో ఇదే అత్యంత ఖరీదైనదిగా పేర్కొన్నారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీకి జాతీయ, అంతర్జాతీయంగా 1900 మొమెంటోలు అందాయని, ఇవన్నీ కూడా ఇపుడు వేలంలో ఉంచినట్టు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్ శర్మ తెలిపారు.

ఈబీసీ కోటాపై అపోహలొద్దు

❍ అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తాం
❍ రాజకీయ పార్టీల దుష్ప్రచారాలను నమ్మవద్దు
❍ ఆర్థిక నేరగాళ్లను వదిలిపెట్టం
❍ బీజేపీ వ్యతిరేక కూటమి ప్రజా వ్యతిరేక కూటమి
❍ అభివృద్ధి ఆగదు, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతాయి
❍ మధురై బహిరంగ సభలో మోదీ పిలుపు

మధురై, జనవరి 27: ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు కల్పించిన పది శాతం కోటా వల్ల ప్రస్తుతం అమలులో ఉన్న రిజర్వేషన్ల వ్యవస్థకు ఎటువంటి విఘాతం కలగబోదని, ఈ విషయమై అపోహలను కొంత మంది పని కట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు.

ఆదివారం ఆయన ఇక్కడ బహిరంగ సభలో మాట్లాడుతూ, స్వప్రయోజనాలకోసం చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, ఈబీసీ కోటా వల్ల ఏ వర్గాలకు హాని జరగదన్నారు. జాతీయ స్థాయిలో బీజేపీని చూసి ఓర్వలేక సిద్ధాంతాలను పక్కనపెట్టి విపక్షాలు ఏకతాటిపైకి రావడం అంటే ప్రజా వ్యతిరేక కూటమిగా ఏర్పడడమేనన్నారు. దేశంలో గత ఐదేళ్లలో అవినీతిని, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతాన్ని తొలగించామన్నారు. ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. దళితులు, బీసీలు, గిరిజన వర్గాలకు ప్రస్తుతం అమలవుతున్న కోటాకు ఈబీసీ కోటా వల్ల వచ్చే ముప్పేమీ లేదన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ చట్టాన్ని తెచ్చామన్నారు. ఇప్పటికే రిజర్వేషన్లను అనుభవిస్తున్న వర్గాలు అపోహలకు గురికారాదని ఆయన కోరారు. తమిళనాడులో కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ఇది దురదృష్టకరమన్నారు. ఈ విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో డీఎంకే పార్టీతో పాటుకొన్ని పక్షాలు ఈబీసీ కోటాను వ్యతిరేకించిన విషయం విదితమే. ఈ కోటాను సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో డీఎంకే పిటిషన్ దాఖలుచేసింది.

ఆర్థిక నేరగాళ్లు, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసే వ్యక్తులను వదిలిపెట్టే ప్రసక్తిలేదని, వారిని అరెస్టు చేసి చట్టం ముందు నిలబెడుతామన్నారు. ఆర్థిక నేరగాళ్లు విదేశాల్లో నక్కినా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వంలో అధికారంలో ఉన్న నేతలు పదవులను అడ్డుపెట్టుకుని నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, చెన్నై నుంచి ఢిల్లీ దాకా ఈ తరహానేతలు ఉన్నారన్నారు. ఎవరేన్ని విమర్శలు చేసినా, సంక్షేమ విధానాలకు వ్యతిరేకంగా అక్రమ పొత్తులను పెట్టుకున్నా, నా పనినేను చేసుకుంటూ పోతాను. నేను దేశంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తాను. అభివృద్ధి కోసం, అవినీతి నిర్మూలనకు అహర్నిశలు పాటుపడుతాని అని నరేంద్రమోదీ అన్నారు. అభివృద్ధి నిరోధకులను తిరస్కరించాలని ఆయన యువకులను కోరారు. తమిళంలో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ముఖ్యమంత్రి జయలలితకు నివాళులు అర్పించారు. మధురైకు సమీపంలో ఆయన ఎయిమ్స్ కళాశాల, ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. ప్రతి మూడు నియోజకవర్గాలకు ఒక వైద్యకళాశాలను, ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామన్నారు.

దేశ వ్యాప్తంగా 9.5 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని, తమిళనాడులో 47 లక్షల మరుగుదొడ్లనిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. రామేశ్వరం, పంబన్ మధ్య అనుసంధానం కోసం రూ.2100 కోట్లతో ప్రాజెక్టు చేపట్టినట్లు చెప్పారు. మధురై నుంచి చెన్నైకు వేగంగా వెళ్లే రైలును ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.



మధురైలో ఆదివారం జరిగిన ర్యాలీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని గజమాలతో సత్కరిస్తున్న తమిళనాడు బీజేపీ నాయకులు

చాయ్ విక్రేతకు పద్మ పురస్కారం

న్యూఢిల్లీ, జనవరి 27: చాయ్ విక్రయిస్తూ దాని ద్వారా వచ్చే లాభాన్ని మురికి వాడల్లోని బాలల విద్యాభివృద్ధికి వెచ్చిస్తున్న వ్యక్తి ఒకరు.. తమ వద్దకు వచ్చే రోగుల నుంచి కేవలం ఒక్క రూపాయిని కన్సల్టేషన్ ఫీజుగా తీసుకుంటూ వైద్య సాయం అందిస్తున్న డాక్టర్ దంపతులు.. మహాదళిత్ కమ్యూనిటీ కోసం ఒక పాఠశాలను ప్రారంభించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మరొకరు.. మొన్నటి వరకు పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోని వీరంతా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. కేంద్ర ప్రభుత్వం 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పద్మ అవార్డులను పొందడం ద్వారా వీరి సేవలు దేశవ్యాప్తంగా తెలిసిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 112 పద్మ పురస్కారాలకు ఎంపికయిన వారిలో వీరితో పాటు ఇలాంటి వారు చాలా మందే ఉన్నారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఒడిశాలో పర్వత సానువుల నుంచి వంద ఎకరాలకు సాగునీటిని తీసుకు రావడానికి ఒక్కడే మూడు కిలో మీటర్ల పొడవునా కాలువను తవ్విన వ్యక్తీ ఇందులో ఉన్నారు. మథురలో అనారోగ్యం పాలయిన, ముసలివి అయిన, గాయపడిన 1200 ఆవుల బాగోగులు చూస్తున్న జర్మన్ దేశస్థుడు కూడా ఈ పద్మ పురస్కారాల జాబితాలో ఉన్నారు. చాయ్ అమ్ముతున్న దేవరపల్లి ప్రకాశ్ రావు దాని ద్వారా వచ్చే లాభంతో మురికి వాడల్లో ఉన్న బాలలకు విద్యను అందిస్తున్నారు. ఏడేళ్ల వయసు నుంచే పనిచేస్తున్న ఆయన తన ఆదాయంలో సగ భాగాన్ని కటక్‌లో 'ఆశ ఓ ఆశ్వాసన' పేరిట ఒక పాఠశాలను నెలకొల్పి, నడపడానికి వెచ్చించారు. మహారాష్ట్రలోని నక్సలైట్ల ప్రాబల్యం గల మేల్‌ఘట్ జిల్లా బైరాగఢ్‌లో స్మితా, రవీంద్ర కోల్హే అనే డాక్టర్ దంపతులు గత మూడు దశాబ్దాలుగా కుర్కు తెగకు చెందిన గిరిజనులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ దంపతులు ఒక క్లినిక్‌ను నడుపుతూ పేదల నుంచి నామమాత్రంగా ఒకటి లేదా రెండు రూపాయలు మాత్రమే కన్సల్టేషన్ ఫీజుగా తీసుకుంటున్నారు. మేల్‌ఘట్‌ను రైతుల ఆత్మహత్యలు లేని జోన్‌గా తీర్చిదిద్దడంలో వీరి కృషి ఎంతో ఉంది.

'ఆయుష్మాన్ భారత్' బలోపేతమే లక్ష్యం

❍ అందరి ఆరోగ్యానికి కట్టుబడి ఉన్నాం: మోదీ

మధురై, జనవరి 27: అందరికి ఆరోగ్యాన్ని ప్రసాదించడానికి చేపట్టిన కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజల ఆరోగ్య సంబంధ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమయిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోందని ఆయన అన్నారు. మదురైకి సమీపంలోని తొప్పూర్‌లో రూ. 1,264 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎయిమ్స్ (అఖిల భారత వైద్య విజ్ఞానాల సంస్థ) భవన సముదాయానికి ఆదివారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ఈ కార్యక్రమానికి హాజరయిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో తీసుకొచ్చిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' దూరదృష్టిని ఎయిమ్స్ ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ తనను తాను ఆరోగ్య రంగంలో బ్రాండ్ నేమ్‌గా తీర్చిదిద్దుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు మదురైలోని ఎయిమ్స్ కూడా అలాగే ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 'కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు, గౌహతి నుంచి గుజరాత్ వరకు దేశం నలుమూలలా ఆరోగ్య రంగంలో ఇలాంటి బ్రాండ్‌ను తీసుకెళ్లడం జరుగుతోందని మేము చెప్పగలము' అని ప్రధాని అన్నారు. ప్రతిపాదిత ఎయిమ్స్ వల్ల మొత్తం తమిళనాడు రాష్ట్రానికి లబ్ధి చేకూరుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. 'ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి, ఆరోగ్య సంరక్షణ ప్రజలకు అందుబాటులో ఉండటానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఆరోగ్య రంగానికి గొప్ప ప్రాధాన్యత ఇస్తోంది' అని మోదీ అన్నారు. ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన ద్వారా ప్రభుత్వం దేశవ్యాప్తంగా గల ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి మద్దతిస్తోందని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకులే లక్ష్యంగా దాడులు తగవు

❍ అరుణ్ జైట్లీ వ్యాఖ్యలను స్వాగతించిన మాజీ మంత్రి చిదంబరం

న్యూఢిల్లీ, జనవరి 27: కొన్ని బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని ఇష్టం వచ్చినట్లు దాడులు చేసి సోదాలు నిర్వహించడం సీబీఐకు అలవాటైందని కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం ధ్వజమెత్తారు. సీబీఐ బ్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం తగదని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించడాన్ని ఆయన స్వాగతించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులోనే చాలా మంది ప్రముఖ ఐఎఎస్ అధికారుల పేర్లను సీబీఐ ప్రస్తావించారని ఆయన చెప్పారు. సీబీఐ ఎడాపెడా దాడులు చేస్తూ ఉన్నతాధికారులపై కేసులు పెట్టడం తగదన్నారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో మాజీ మంత్రి చిదంబరం పాత్రపై సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. చిదంబరంను ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్రం అనుమతిని కోరుతూ సీబీఐ లేఖ రాసింది. ఐసీఐసీఐ స్కాంలో చందాకొచ్చర్‌కు సంబంధించి బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌వీ కామత్‌ను కూడా విచారించాలని సీబీఐ యోచించడం తగదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరున్నారనే అంశంపై ఆలోచించకుండా బ్యాంకర్లను టార్గెట్ చేయడం తగదన్నారు. సీబీఐ వృత్తిపరమైన నైపుణ్యంతో దర్యాప్తు చేయాలని, కేవలం సాహసోపేతమైన రీతిలో దర్యాప్తును చేపట్టడం వల్ల మంచి ఫలితాలు రావన్నారు. దీని వల్ల దోషులకు శిక్షపడదన్నారు.


వచ్చే ఎన్నికల్లో మేమే గెలుస్తాం

❍ ఒడిశా ఎన్నికల్లో సీఎం పదవికి ముందుగా అభ్యర్థిని ప్రకటించం: ధర్మేంద్ర ప్రదాన్

న్యూఢిల్లీ, జనవరి 27: ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికలకు ముందు ప్రకటించబోమని కేంద్ర మంత్రి, సీనియర్ బీజేపీ నేత ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించారు. ఈ ఏడాది లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ ఎదుగుదలను చూసి బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆందోళనకు గురవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో లోక్‌సభలో ఎక్కువ సీట్లు తమకు వస్తాయని, అసెంబ్లీలో అధిక సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, అధ్యక్షుడు అమిత్‌షా అధ్వర్యంలో బీజేపీ పట్ల ప్రజలకు నమ్మకం, ఆదరణ రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. మహారాష్ట్ర, త్రిపుర, జార్ఖాండ్, యూపీ, హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల్లో ముందుగా సీఎం పదవికి అభ్యర్థుల పేర్లను ఖరారు చేయలేదని ఆయన చెప్పారు. ఒడిశాలో ప్రధానమైన మంచినీటి సమస్య, సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపడంలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరోగ్య సేవలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా ఉందన్నారు. నవీన్ పట్నాయక్ స్వచ్ఛమైన వ్యక్తి, అవినీతి మచ్చలేదనే ప్రచారం ఒక పెద్ద అవాస్తవమన్నారు. చిట్ ఫండ్ స్కాంలలో ప్రజలు రూ. 60 వేల కోట్ల సొమ్మును కోల్పోయినా ప్రభుత్వం నిందితులను పట్టించుకోలేదన్నారు. బీజేపీకి రాష్ట్రంలో మంచి సంస్థాగత బలం ఉందన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. గతంలో ఏ కేంద్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున నిధులను రాష్ట్రాభివృద్ధికి ఖర్చుపెట్టలేదన్నారు.

దేశీయ పరిజ్ఞానంతో 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'

ఢిల్లీ-వారణాసి మధ్య త్వరలో ప్రారంభం ❍ రైల్వే మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 27: పూర్తి దేశీయ పరిజ్ఞానంతో తయారైన సెమీ ఫాస్ట్ ట్రైన్ 18ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేసినట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.

ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మేకిన్ ఇండియా హోదా సాధించే నేపథ్యంలో చెన్నైలోని ఇంటిగ్రల్ కోచింగ్ ఫ్యాక్టరీలో 97కోట్ల రూపాయలతో దీనిని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసినట్టు చెప్పారు. 16 కోచ్‌లుండే ఈ ట్రైన్ 18కు ఏ పేరు పెట్టాలని కోరగా, చాలామంది ఇచ్చిన సూచన మేరకు దానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా పేరుపెట్టినట్టు చెప్పారు. 18నెలల్లో భారత్ ఇంజనీర్లు దీనిని తయారు చేశారని, ఢిల్లీ-వారణాశి మధ్య నడిచే ఈ రైలు పూర్తి ఎయిర్ కండీషన్ అని, రెండు ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ బోగీలు సైతం ఉంటాయని, కాన్పూరు, అలహాబాద్‌లలో ఆగుతుందని చెప్పారు. సుఖవంతమైన ప్రయాణానికి రైలుకు అధునాతన ఎయిర్‌సస్పెన్షన్‌ను ఇందులో ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. ప్రపంచ స్థాయి నాణ్యతతో రైళ్లను మనం సొంతంగా తయారు చేయగలమని దీనితో రుజువైందని, మేడిన్ ఇండియా హోదాను మనం సాధించాలనే మోదీ ఆకాంక్షకు అనుగుణంగా మనం అడుగులు వేస్తున్నామని మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు అందిస్తున్న ఈ బహుమతిని ప్రధాని నరేంద్రమోదీ త్వరలోనే ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. వీటి ధరను తగ్గించడానికి ఉత్పత్తిని మరింత పెంచాలని తాను రైల్వేబోర్డును కోరానని, ఉత్పత్తి పెరిగితే దేశీయ అవసరాలు పోను ఎగుమతి కూడా చేయవచ్చునని కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్ తెలిపారు.

పేరుకుపోతున్న పెండింగ్ కేసులు

❍ ఒక్కో హైకోర్టు జడ్జి వద్ద 4500 అపరిష్కృత దావాలు

న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలోని హైకోర్టులు, దిగువ కోర్టుల్లో రోజురోజుకు పెండింగ్ కేసుల సంఖ్య కొండలా పేరుకుపోతున్నాయి.

ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఆదివారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా డిసెంబర్, 2018 నాటికి హైకోర్టుల్లో 47.68 లక్షలు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 2.91 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉండిపోయాయని, ఒక్కో హైకోర్టు జడ్జి వద్ద 4,500 కేసులు, దిగువ కోర్టుల్లో ఒక్కో జడ్జి వద్ద 1300 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. హైకోర్టుల్లో, ఆయా కోర్టులో ఉన్న జడ్జిల సంఖ్య ఆధారంగా ఈ సరాసరి సంఖ్యను నిర్ధారించినట్టు నేషనల్ జ్యూడీషియల్ డేటా గ్రిడ్ తెలియజేసింది. ఇప్పటివరకు దేశంలో 24 హైకోర్టులు ఉండగా, తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు రావడంతో వాటి సంఖ్య 25కు చేరిందని చెప్పారు. అలాగే సబార్డినేట్ కోర్టులు 22,644 ఉండాల్సి ఉండగా 17,509 మాత్రమే ఉన్నాయి. వీటికి 5,135 మంది జ్యూడీషియల్ ఆఫీసర్ను కొరత ఉంది. అలాగే హైకోర్టులో మంజూరైన వాస్తవ జడ్జి పోస్టుల సంఖ్య 1,079 కాగా, 384 మంది జడ్జిలు తక్కువగా 695 మంది మాత్రమే ఉన్నారు. పార్లమెంట్‌కు అవసరమైన సమాచారం నిమిత్తం ఈ డేటాను సేకరించారు. గతంలో దిగువ కోర్టుల్లో జడ్జిల పోస్టులను భర్తీ చేయాలని చీఫ్ జస్టిస్‌లకు కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అభ్యర్థనలు పంపా రు. జ్యుడీషియల్ అధికారులు, సిబ్బందిని నియమించకపోతే పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని న్యాయ స్థానాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దానికి సంబంధించిన రాతపరీక్ష, ఇంటర్వ్యూలు వంటి ప్రక్రియలను నిర్వహించాలని కేంద్ర మంత్రి చీఫ్ జస్టిస్‌లను కోరారు.

కొచ్చర్‌పై కేసు పెట్టిన సీబీఐ అధికారి బదిలీ

న్యూఢిల్లీ, జనవరి 27: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, ఇతరులపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసిన మరుసటి రోజే సంబంధిత అధికారి బదిలీ అయ్యారు. ఈ కేసు నమోదు చేసిన ఢిల్లీలోని సీబీఐ బ్యాంకింగ్ అండ్ సెక్యూరిటీస్ ఫ్రాడ్ సెల్ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) సుధాంశు ధర్ మిశ్రా బదిలీ అయ్యారు. మిశ్రాను జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని సీబీఐ ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఐసీఐసీఐ-వీడియోకాన్ కేసుకు సంబంధించి చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్ తదితరులకు వ్యతిరేకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై సుధాంశు ధర్ మిశ్రా జనవరి 22న సంతకం చేశారు. దీంతో ఐసీఐసీఐ బ్యాంకు మంజూరు చేసిన రుణాలలో చందా కొచ్చర్, వ్యాపారవేత్త అయిన ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ ధూత్ అవకతవకలకు పాల్పడినట్టు సీబీఐ జనవరి 24వ తేదీన కేసు నమోదు చేసింది. రుణం మంజూరు ప్రక్రియలో చందా కొచ్చర్ వీడియోకాన్‌కు అనుకూలంగా వ్యవహరించినట్టు అభియోగాలు వచ్చిన నేపథ్యంలో ఆమె నిరుడు అక్టోబర్ 4వ తేదీన ఐసీఐసీఐ బ్యాంకులోని ఉద్యోగం నుంచి వైదొలిగారు. మహారాష్ట్రలోని నాలుగు చోట్ల దాడులు నిర్వహించిన అనంతరం చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్టు సీబీఐ ఇప్పటికే తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంకు 2009 జూన్ నుంచి 2011 అక్టోబర్ వరకు వీడియోకాన్ గ్రూప్‌నకు చెందిన వివిధ కంపెనీలకు పెద్ద మొత్తాల్లో ఆరు రుణాలు మంజూరు చేసినట్టు సీబీఐ ప్రాథమిక విచారణలో తేలినట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. చందా కొచ్చర్ ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా 2009 మే ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరించారు.

ఆనకట్ట ప్రమాదంలో 40కి చేరిన మృతుల సంఖ్య

❍ గల్లంతైన 300 మంది చనిపోయి ఉండొచ్చని అధికారుల ప్రకటన

బ్రూమడిన్హో (బ్రెజిల్), జనవరి 27: బ్రెజిల్‌లో ఆనకట్ట కుప్పకూలిన ప్రమాదంలో మృతుల సంఖ్య 40కు చేరిందని, గల్లంతైన వందలాది మంది జాడ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలియజేశారు. గల్లంతైన వారందరూ మృతి చెంది ఉండవచ్చునని వారు అభిప్రాయపడుతున్నారు.

ఇనుప ఖనిజం వ్యర్థాలు, బురద కిలోమీటర్ల మేర పేరుకుపోయాయి. శనివారం రాత్రి బ్రెజిల్‌లోని మినాస్ గేరియాస్ రాష్ట్రంలోని బ్రూమడిన్హో సమీపంలో పరావోపేట నదిపై నిర్మించిన ఆనకట్ట హఠాత్తుగా కుప్పకూలడంతో తొలుత 8 మంది మృతి చెందారని, 300 మంది గల్లంతయ్యారని అధికారులు ప్రకటించారు. ఇనుప ఖనిజం తవ్వుతున్న వలే అనే కంపెనీ ఆధ్వర్యంలో ఈ డ్యామ్ ఉండగా, ప్రమాదంలో ఆ కంపెనీకి చెందిన వారే ఎక్కువ బాధితులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్‌ఫైటర్స్, ఇతర శాఖల అధికారులు చేపట్టిన పలు రక్షక చర్యల అనంతరం మృతుల సంఖ్య 40గా నిర్ధారించారు. గల్లంతైన 300 మంది జాడ తెలియరాలేదు. వీరంతా మృతి చెంది ఉండవచ్చునని వారు భావిస్తున్నారు. పేరుకుపోయిన బురదలో ఎవరైనా చిక్కుకుపోయారా, మృతదేహాలు ఉన్నాయా అని రాత్రి నుంచి సహాయ సిబ్బంది వెతుకుతున్నారు. సహాయ కార్యక్రమాల్లో హెలికాప్టర్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయి. ఖనిజ వ్యర్థాలు, బురద కిలోమీటర్ల మేర ఆవరించాయి. తమ వారి జాడ ఏమైందో తెలియక గల్లంతైన వారి కుటుంబాలు అల్లాడుతున్నాయి. అధికారులు తమకు సరిగ్గా వివరాలు తెలియజేయడం లేదని, తమ వారు బతికున్నారో, చనిపోయారో చెప్పాలని వారు వేడుకుంటున్నారు. మినాస్ జార్జియస్ స్టేట్ గవర్నర్ రోమియ్ జెమా సహాయ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎంత శిక్షణ ఇచ్చినా వారిది పాకీబతుకే!


న్యూఢిల్లీ, జనవరి 27: '..ఏడాది ఉతికినా.. నలుపు నలుపే కాని.. తెలుపు కాదు..' అన్నట్లు పాకీపని చేసేవాడి బతుకు ఎప్పటికీ పాకీబతుకే. వారి జీవితాలు బాగుచేసేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా సమాజంలో అట్టడుగున్న ఉండిపోయిన వారి స్థాయి ఎప్పటికీ పైకొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ఈ సంఘటనే చక్కటి ఉదాహరణ.

పాకీ పని చేసే 50 మందికి ఆ పని నిర్వహణలో సరికొత్త విధానం పాటించేందుకు ఢిల్లీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి వివిధ ప్రాంతాల్లో పని చేసుకోమని సూచించింది. అయితే అలా వెళ్లిన వారందరూ కొద్ది రోజుల్లోనే మళ్లీ తిరిగి వచ్చి పాత విధానంలోనే పాకీపని మొదలెట్టారు. కారణం అలా వెళ్లిన వారికి సరైన గౌరవం ఇవ్వక పోవడం మాట అటుంచి.. పనికి జీతం ఇవ్వకపోవడం.. పని ప్రదేశాలు దూరం కావడం.. రక్షణ లేకపోవడం తదితర కారణాలతో మళ్లీ తిరిగి వచ్చేసి పాత పద్ధతిలోనే పాకీపని చేయడం మొదలెట్టారు. అయితే వారికి శిక్షణ ఇచ్చిన సాదిక్ మసిహ్ మెడికల్ సోషల్ సర్వెంట్ సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ స్టీఫెన్ మాట్లాడుతూ, 'పాకీ పని నిర్వహణకు కొత్త పద్ధతుల్లో తగిన శిక్షణ ఇచ్చాం.. ఇందులో మా దోషం ఏమీలేదు.. అయితే ముందుగా వారి మైండ్ సెట్ మారాలి' అని చెప్పడం కొసమెరుపు.

సేవలోనే సంతృప్తి

★ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

★ సంస్కృతి, సంప్రదాయం, భాషను కాపాడుకోవాలని పిలుపు



ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 27: మన సంస్కృతి, సంప్రదాయం, భాషను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఆంధ్రా అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతనంగా నిర్మించిన గోదావరి అడిటోరియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ సేవలో దొరికే సంతృప్తి మరెందులోనూ దొరకదని పేర్కొన్నారు. గత 84 సంవత్సరాలుగా ఢిల్లీలోని తెలుగు వారికి, స్థానికులకు సేవలు అందిస్తున్న ఆంధ్రా అసోసియేషన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఆంధ్రా అసోసియేషన్‌ను ప్రారంభించిన ప్రొ. ఎన్జీ రంగా, భారత మాజీ ఉప రాష్ట్రపతి డా. వరాహగిరి వేంకట గిరి, డా. అనంతశయనమ్ అయ్యంగార్, కొత్త రఘురామయ్య, కాశీనాధుని నాగేశ్వరరావుల ముందుచూపు చిరస్మరణీయమని తెలిపారు. కేవలం తెలుగువారికి మాత్రమే కాకుండా, స్థానిక ఢిల్లీ వాసులకు కూడా సేవలు అందించడాన్ని ఆయన ప్రశంసించారు. ఏ సంస్థ అయినా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లడం, దశాబ్దాల తరబడి కొనసాగిచడం ప్రశంసించదగిన విషయమని అన్నారు. సంస్థలు, అసోసియేషన్లు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం లేకుండా ముందుకు సాగడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న విషయమని అన్నారు. కేవలం మిత్రుల సహకారంతో ముందుకు వెళుతున్న స్వర్ణభారత్ ట్రస్ట్ విషయంలో చాలా సమస్యలు చవిచూశానని.. అయితే సేవ అందించే సంతృప్తి ముందు ఇవన్నీ నిలబడవని తెలిపారు.

విద్యాలయాలు విజ్ఞానం, వివేకాన్ని పెంపొందించాలి

విద్యాలయాలు విజ్ఞానం, వివేకాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని, విద్యా సంస్థలు శాంతి, సామరస్యానికి కేంద్ర బిందువులు కావాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ఢిల్లీలోని పన్నాలాల్ గరిధర్ లాల్ దయానంద్ ఆంగ్లో వేదిక్ కాలేజ్ (పిజిడిఎవి) వజ్రోత్సవ వేడుకలకు ఆదివారం వెంకయ్య నాయుడు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదనీ, ఈ సమయంలో విద్యార్థుల మనసుల్లో సానుకూల భావనలను నింపేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యకు, వికాసానికి సంబంధం లేని కార్యక్రమాలను విద్యాలయాల్లో నిర్వహించడం ద్వారా ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్ని అధిగమించేందుకు ప్రస్తుత విద్యా విధానాన్ని భారతీయ చరిత్ర వారసత్వం, సంస్కృతి సంప్రదాయం మరియు విలువలతో పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైన వుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

కేరళ సంస్కృతికి అగౌరవం

★ సంప్రదాయాలపై లెఫ్ట్ సర్కారు దాడి ★ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజం

త్రిసూర్ (కేరళ), జనవరి 27: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మరోసారి శబరిమల ఆలయ అంశాన్ని లేవనెత్తారు. కేరళ సంస్కృతిలోని అన్ని సంప్రదాయాలను, రీతులను కమ్యూనిస్టు ప్రభుత్వం అగౌరవ పరుస్తూ వస్తోందని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్‌కు, కమ్యూనిస్టులకు మహి ళా సాధికారత విషయంలో ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన విరుచుకుపడ్డారు. ముమ్మారు తలాక్ (ట్రిపుల్ తలాక్) విధానానికి ముగింపు పలకడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం చేసిన కృషికి వారు అడ్డుపడటమే ఇందుకు నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. 'కాంగ్రెస్‌కు కాని కమ్యూనిస్టులకు కాని మహిళా సాధికారతకు సంబంధించి ఎలాంటి ఆందోళన లేదు. ఒక వేళ ఉండి ఉంటే, ఎన్‌డీఏ ప్రభుత్వం ముమ్మారు తలాక్ విధానానికి చరమగీతం పాడటానికి చేసిన కృషికి అడ్డుపడి ఉండేవారు కాదు. భారత్‌లో చాలా మంది మహిళలు ముఖ్యమంత్రులుగా పని చేశారు. చేస్తున్నారు. వీరిలో కమ్యూనిస్టు ముఖ్యమంత్రి ఎవరయినా ఉన్నారా?' అని ప్రధాని అన్నారు. శబరిమల ఆలయ అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ, కేరళ సంస్కృతిలోని ఆచారాలు, సంప్రదాయాలు కమ్యూనిస్టు ప్రభుత్వం నుంచి దాడిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. శబరిమల ఆలయ వివాదం నేడు మొత్తం దేశం దృష్టిని ఆకర్షించిందని అన్నారు. కాల పరీక్షకు నిలబడిన మన సంస్కృతి, సంప్రదాయాలను కమ్యూనిస్టులు ఎందుకు బలహీనపరుస్తున్నారో అర్థం చేసుకోవడంలో తాను విఫలమయ్యానని మోదీ పేర్కొన్నారు. యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కూడా కమ్యూనిస్టుల మాదిరిగానే ఉందని ఆయన విమర్శించారు.

బీసీలే మా బలం

25 కులాలకు కార్పొరేషన్లు.. సబ్-ప్లాన్‌కు చట్టబద్ధత

ఇప్పటి ఫెడరేషన్లన్నీ కార్పొరేషన్లుగా మార్పు ◆ బడ్జెట్‌లో రూ.3000 కోట్లు ◆ చేనేత, సంచార, స్వర్ణకార, తదితరులకు ఉచిత విద్యుత్

నాయీ బ్రాహ్మణులకు అమరావతిలో సంప్రదాయ సంగీత పాఠశాల ◆ 'జయహో బీసీ' సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు వరాల వర్షం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 27: రాష్ట్రంలో బీసీల ఆర్థికాభివృద్ధి కోసం 25 కార్పొరేషన్లు ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వివిధ బీసీ కులాల ఫెడరేషన్లను సైతం కార్పొరేషన్లుగా మార్పుచేస్తామన్నారు. కార్పొరేషన్ల కోసం వచ్చే బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయిస్తామన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన 'జయహో బీసీ' సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తన చివరి రక్తం బొట్టున్నంత వరకు బీసీల అభ్యున్నతి, గౌరవం కోసమే కృషి చేస్తానని చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా బీసీ కులాలపై వరాల వర్షం కురిపించారు. శెట్టిబలిజలు ఉభయ గోదావరి జిల్లాల్లో అధికంగా ఉన్నారని, శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, ఈడిగ, యాత ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

విశ్వబ్రాహ్మణ, మేదర, వడ్డెరలకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. యాదవులు ఎపుడూ తెలుగుదేశం పార్టీకి పెద్దఎత్తున అండగా ఉన్నారని పేర్కొంటూ యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రాయలసీమలో అధిక సంఖ్యలో ఉన్న కురమలకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. యాదవులు, కురమలు అధిక సంఖ్యలో గొర్రెలు పెంపకంలో జీవిస్తున్నారని, గొర్రెలకు బీమా చేస్తామని ప్రకటించారు. రాష్ట్రమంతా మత్స్యకారులు ఉన్నారని, వీరంతా ఎపుడూ టీడీపీ వెంటే ఉన్నారన్నారు. శ్రీకాకుళం నుంచి తడ వరకు వున్న మత్స్యకారులందరికీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వీరిని ఎస్టీల్లో చేర్చడానికి వేసిన కమిషన్ నివేదిక వచ్చిన వెంటనే కేంద్రానికి పంపించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. వన్నెకుల క్షత్రియులకు కూడా ఒక ప్రత్యేక కార్పొరేషన్, తూర్పు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేసి, జనాభా దామాషాపై నిధులు కేటాయిస్తామన్నారు. కొప్పు వెలమలను తెలంగాణలో బీసీల నుంచి ఓసీల్లోకి మార్చారని, తెలంగాణలో మళ్ళీ బీసీలుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వీరికి ఇక్కడ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. చేనేత కులాల్లో పద్మశాలీయులు అత్యధికంగా వున్నారని, చేనేతలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా 150 యూనిట్ల వరకు మగ్గాల వద్ద ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో కళింగలు అధికంగా ఉన్నారని, వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి జనాభా దామాషాపై నిధులు వెచ్చిస్తామన్నారు. గవరలు, గాండ్ల కులాలకు కూడా ఒక్కో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరాన్ని బట్టి ఇంకా ఐదారు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. తనను నమ్ముకున్నవారి కోసం, వారి మనోభావాల కోసం ఈ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు చంద్రబాబు జనాల హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ఈ కార్పొరేషన్ల వల్ల బీసీల్లో నాయకత్వం పెరుగుతుందన్నారు.

ఎన్టీఆర్ హయాం నుంచి నాయీబ్రాహ్మణులను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆలయాల్లో తలనీలాలకు సంబంధించి ఆదాయాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. వారికి కులవృత్తి షాపులకు నెలకు 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తామన్నారు. నాయీ బ్రాహ్మణుల్లోని సంగీత నైపుణ్యాన్ని వెలికితీయడానికి రాష్ట్రంలో ప్రత్యేక సంగీత పాఠశాల నెలకొల్పుతామన్నారు. రాజధానిలో ఒక ఆదర్శవంతమైన సంప్రదాయ సంగీత పాఠశాలను నెలకొల్పుతామని, అన్ని టెంపుల్ టౌన్‌లలోనూ ఈ సంగీత పాఠశాలలను ఏర్పాటుచేస్తామన్నారు. జైళ్ళు, పోలీసు శాఖల్లో జీవో 26 ప్రకారం అవకాశాలు కల్పిస్తామన్నారు. రజకులను ఎస్సీల్లో చేర్చడానికి కమిషన్ వేశామని, కమిషన్ నివేదిక ప్రకారం అవసరమైన రీతిలో చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతిలో జ్యోతీరావ్‌పూలే భవన్ నిర్మిస్తామన్నారు. ఇందుకోసం 10 నుంచి 15 ఎకరాల భూమిని కేటాయిస్తామన్నారు. రాజధానిలో అన్ని బీసీ కులాలకు బీసీ భవన్లు నిర్మిస్తామన్నారు. అమరావతిలో మహాత్మా పూలే విగ్రహాన్ని నిర్మిస్తామని, ఇందు కోసం రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు. బీసీ సబ్-ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి ఒక చారిత్రక ఘట్టం ద్వారా వారిని గౌరవిస్తామన్నారు. అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు 90 శాతం జీవనోపాధికి అందించే మొత్తాన్ని రూ.30వేల నుంచి రూ.50 వేలకు పెంచామన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది సంచార జాతుల వారు ఉన్నారని, వారికి కూడా 100 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తామని స్వయం ఉపాధి పథకాల్లో వయోపరిమితిని 60 ఏళ్లకు పెంచుతామన్నారు. బీసీ మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారుకావడానికి అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో మరో 69 బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామని, బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు అందించే సాయాన్ని రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. దొమ్మర, ఉప్పర, పాముల, మొండి వంటి పదాలను వాడకుండా నిషేధిస్తూ ప్రభుత్వం జీవో తెస్తుందన్నారు. కులాన్ని కించపర్చడం, అవమానించడం బాధాకరమన్నారు. సగర, ఉప్పర కులాలు భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా చేయాలని కోరారని, ఈ మేరకు రాష్ట్ర పండుగగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. అదేవిధంగా శాలివాహనులు విజ్ఞప్తి మేరకు మల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. బుడగ జంగాలకు కూడా ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామన్నారు. స్వర్ణకారులకు కూడా 100 యూనిట్ల ఉచిత కరంటు ఇస్తామన్నారు. వడ్డెర్లను కూడా ఎస్టీల్లో చేర్చడానికి కమిషన్ వేస్తామన్నారు. టీడీపీని నమ్ముకున్న బీసీలను పైకి తీసుకురావడానికి, సమర్థ నాయకత్వాన్ని వెలికితీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. బీసీలను టీడీపీ నుండి విడదీయడానికి ప్రయత్నిస్తున్న వారి మాయలో పడొద్దని పిలుపునిచ్చారు. బీసీలంతా ఐక్యంగా ఉండాలని చంద్రబాబు కోరారు. సదస్సులో ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, పితాని సత్యనారాయణ, కె అచ్చెన్నాయుడు, నారా లోకేష్, కెఎస్ జవహర్, దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, కాలువ శ్రీనివాసులు, కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూక్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీటీడీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీలు బుట్టా రేణుకు, నిమ్మల కిష్టప్ప, కె రామ్మోహన్ నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల వారు పాల్గొన్నారు.

ఆంధ్రుల సెంటిమెంట్.. అమరావతి

◆ టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 27: 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. వచ్చే నెల 3న రాజధాని అమరావతిలో తాత్కాలిక హైకోర్టు భవనాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రారంభించనున్నారు. ఆ మహత్తర ఘట్టం రాష్ట్ర చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థ సమగ్ర కార్యకలాపాలకు అమరావతి విశిష్ట కేంద్రంగా మారనుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఐకానిక్ హైకోర్టు కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఐదు అత్యుత్తమ ప్రపంచ శ్రేణి రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరిత్రను తిరగరాస్తున్నారని, అమరావతి తెలుగు ప్రజలకు గర్వకారణం, అభివృద్ధికి ఓ చిహ్నామని ఆయన అభివర్ణించారు. రాజధాని నగర నిర్మాణ పనులపై ఆదివారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 62 సంవత్సరాల తరువాత విజయవాడ - గుంటూరు ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభం కావడం నవశకానికి నాంది అన్నారు. భారత ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ మూల స్తంభం లాంటిదని చెపుతూ కొత్త రాజధానిలో న్యాయ కార్యకలాపాలు ప్రారంభం కావటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశంలోనే ఉత్తమ న్యాయస్థానంగా నిలవాలని అభిలషించారు.

భారతరత్న అవార్డు గ్రహీతలపై కాంగ్రెస్ నేత ఖర్గే అనుచిత వ్యాఖ్యలు

అసోంలో కేసు నమోదు చేసిన పోలీసులు

మోరీగాన్ (అసోం), జనవరి 27: అసోంకు చెందిన ప్రముఖ సంగీతవిద్యాంసుడు, గాయకుడు భూపేన్ హజారికాపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గేపై అస్సాంలో పోలీసులు కేసు నమోదు చేశారు. సామాజిక కార్యకర్త రాజు మహంత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నాటకకు చెందిన లింగాయత స్వామి శివకుమార స్వామికి భారత రత్న ఇవ్వకుండా, అస్సాంకు చెందిన ఒక గాయకుడు భూపేన్ హజారికా, ఆరెస్సెస్ సిద్ధాంతాలను ప్రచారం చేసిన నానాజీ దేశ్‌ముఖ్‌కు భారత రత్న ఇవ్వడమేంటని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం చెందిన సామాజిక కార్యకర్త మహంత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. మోరిగాన్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఖర్గే వ్యాఖ్యలు అస్సాం ప్రజల మనోభావాలను గాయపరిచాయన్నారు.

బుకర్ ప్రైజ్‌కు కరవైన స్పాన్సరర్లు

అన్వేషణలో బుకర్ ప్రైజ్ సంస్థ

లండన్, జనవరి 27: ప్రపంచంలో ఆంగ్ల నవలా సాహిత్య రంగంలో మంచి నవలలు రాసిన వారికి ఇచ్చే ప్రతిష్టాకరమైన బుకర్ ప్రైజ్‌కు స్పాన్సరర్లు కరవయ్యారు. దీంతో ఈ ఏడాది బుకర్ ప్రైజర్‌ను ఇంతవరకు ప్రచురించలేదు. భారతదేశానికి చెందిన ముగ్గురు ఆంగ్లసాహిత్యవేత్తలకు ఇంతవరకు ప్రతిష్టాకరమైన ఈ బహుమతి దక్కింది. సల్మాన్ రష్డీ, అరుంధతీరాయ్, అరవింద్ అడిగకు ఈ బహుమతి లభించింది. బుకర్ ప్రైజ్ విలువ 1.6 మిలయన్ పౌండ్లు. స్పాన్సరర్ కోసం అన్వేషిస్తున్నట్లు బుకర్ ప్రైజర్ ఫౌండేషన్ తెలిపింది. ఈ సంస్థకు చెందిన ప్రతినిధి హెలీనా కెనడీ మాట్లాడుతూ మాన్‌గ్రూప్ ఇంతకాలం స్పాన్సర్ చేసేదని చెప్పారు. కొత్త సంస్థకు అన్వేషిస్తున్నామన్నారు. పబ్లిక్ ఫండింగ్ తగ్గిపోయినందు వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని మాన్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లూక్ ఎలిస్ చెప్పారు. 2014 వరకు ఈ బహుమతిని కామన్ వెల్త్ దేశాలకే పరిమితం చేశామన్నారు. కాని 2014 నుంచి ఇతర దేశాల నవలా రచయితలు పాల్గొనేందుకు అవకాశం ఇచ్చారు. తాము స్పాన్సర్‌షిప్ నుంచి ఎందుకు వైదొలగాల్సి వచ్చిందో మాన్ గ్రూపు ఇంతవరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. గత ఏడాది మిల్క్‌మాన్ పుస్తక రచయిత ఐరిష్‌కు చెందిన అన్నా బర్న్సకు లభించింది.

జన్మభూమి రుణం తీర్చుకుందాం

◆ కొమరవోలు బహిరంగ సభలో ఏపీ సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం/ పామర్రు, జనవరి 27: ప్రజల సహకారం, ప్రోత్సాహం ఉంటే ప్రతి పల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రతి ఒక్కరూ జన్మభూమిపై మమకారంతో కులమతాలకు అతీతంగా ముందుకొచ్చి గ్రామాల అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల సరసన రాష్ట్ర రాజధాని అమరావతిని నిలపనున్నట్లు ఉద్ఘాటించారు. తన సతీమణి నారా భువనేశ్వరి దత్తత గ్రామమైన కృష్ణా జిల్లా పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో రూ.10కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పాలన చేపట్టి గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధిని సాధించటంతో పాటు ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించామని గుర్తుచేశారు. పట్టిసీమ ద్వారా డెల్టా భూములను బీడు పడకుండా చూశామన్నారు. గోదావరి జలాలతో ఈ ప్రాంత భూములను సారవంతం చేసి అధిక దిగుబడుల సాధనకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సంకల్ప బలంతో రాష్ట్రాభివృద్ధికి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 10 స్టార్స్ రేటింగ్ దక్కించుకున్న కొమరవోలు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. జన్మభూమి, జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకోవటం ద్వారా మానవతా విలువలు పెంపొందుతాయని, సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలను ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

1వ పేజీ తరువాయి

31 నుంచి పార్లమెంట్

విషయం తెలిసిందే. మోదీ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదిస్తే సహించేది లేదని ఆయన ఇది వరకే తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగవలసి ఉన్నందున మోదీ ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఈ ఆనవాయితీని కొనసాగించాలని ఆయన బీజేపీ ప్రభుత్వానికి సూచించారు. మోదీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని వ్యాఖ్యానించారు. ఓడిపోబోతున్న ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించటం ద్వారా కొత్త ప్రభుత్వం అధికారాన్ని హరించకూడదని ఆనంద్ శర్మ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం ఈ అంశంపై ఇంతవరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

ఎన్నికైన సర్పంచుల ప్రమాణం ఒకేరోజు

ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి. 2013 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. భారతరాజ్యాంగం 73 వ సవరణ ప్రకారం పంచాయతీలకు తప్పనిసరిగా ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దీని ప్రకారం 2018 జూలైలోనే ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, పరిపాలనాపరమైన, చట్టపరమైన కారణాల మూలంగా ఐదునెలల పాటు వాయిదాపడ్డాయి.

నెలరోజుల వ్యవధిలో..

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు ప్రభుత్వం నుండి తమకు అందిన తర్వాత 20 రోజుల నుండి 40 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి, కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ గతంలో ప్రకటించారు. ఈ ప్రకారమే ప్రభుత్వం రిజర్వేషన్ల వివరాలను 2018 డిసెంబర్ 31 న ఎన్నికల కమిషన్‌కు అందచేసింది. ఏ మాత్రం జాప్యం చేయకుండా ఆ మరురోజే అంటే జనవరి 1న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 21, 25, 30 వ తేదీల్లో మూడు దశల్లో పోలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనకు అనుగుణంగా ఇప్పటికే రెండు దశల పోలింగ్ పూర్తయింది. తుది దశ పోలింగ్ బుధవారం జరుగుతోంది.

రేపటి 'అయోధ్య' విచారణ రద్దు

జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్ ఉన్నారు. ఒక న్యాయమూర్తి అందుబాటులో లేనందు వల్ల 29వ తేదీన అయోధ్య అంశంపై రాజ్యాం ధర్మాసనం విచారణ ఉండదని రిజిస్ట్రీలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ లలిత్ ఈ కేసు విచారణ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించడం గమనార్హం. అనంతరం ప్రధాన న్యాయమూర్తి ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అంతకుముందు ధర్మాసనంలో ఉన్న జస్టిస్ ఎన్‌వీ రమణ కూడా లేకపోవడం గమనార్హం. అలహాబాద్ హైకోర్టు 2010లో అయోధ్య అంశంపై తీర్పు ఇచ్చింది. 2.77 ఎకరాల భూమిని ఈ కేసులో నాలుగు పార్టీలకు విభజించి కేటాయించింది. కాగా ఈ తీర్పును సవాలు చేస్తూ అనేక పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

వైకాపాలోకి దగ్గుబాటి

ఎప్పుడు చేరుతారన్న మరో ప్రశ్నకు 'మా శ్రేయోభిలాషులు, హితులు అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటా' మన్నారు. బీజేపీలో ఉన్న దగ్గుబాటి పురంధ్రీశ్వరి కూడా వైకాపాలో చేరుతారా? అని ప్రశ్నించగా, పురంధ్రీశ్వరి పార్టీ మారరని ఆయన తెలిపారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటారు కానీ, పార్టీ మారే ఆలోచన ఆమెకు లేదన్నారు. ఈ విషయంలో తమ కుటుంబంలో ఎవరి అభిప్రాయాలు, ఇష్టాలు వారివేనని ఆయన చెప్పారు. పురంధ్రీశ్వరిని పార్టీ మారకూడదని బీజేపీ ముఖ్య నేతలు చెబుతున్నారని ఆయన తెలిపారు.

పార్టీని నడపడం సులభం కాదు..

జగన్ నిర్వహించిన సంకల్ప యాత్రను, ఇంటర్వ్యూలను తాను గమనించానని దగ్గుబాటి అన్నారు. పార్టీని నడపడం అంత సులభం ఏమీ కాదని అన్నారు. జగన్ ఇన్ని సంవత్సరాలు ఒక వ్యక్తిగా ఎన్నో కష్టాలు ఓర్చి, పార్టీని నడుపుతున్నారని ఆయన తెలిపారు. జగన్‌పై అనేక రకాలుగా వదంతులు సృష్టించారని, కానీ తాను ఆయన్ని కలిశాక అవన్నీ ఒక పథకం ప్రకారం జరుగుతున్నవేనని స్పష్టమైందని దగ్గుబాటి చెప్పారు. భగవంతుడి ఆశీస్సులతో జగన్ శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఏపీలో ప్రభుత్వం గాడి తప్పింది

ఏపీలో ప్రభుత్వ పని తీరు గాడి తప్పిందని దగ్గుబాటి విమర్శించారు. ప్రభుత్వ డబ్బుతో దీక్షలు చేయడం సమంజసం కాదన్నారు. అసలు ప్రభుత్వం తన దగ్గర డబ్బులు లేవంటూనే కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ దీక్షలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను బస్సుల్లో తీసుకుని వస్తున్నారని, కలెక్టర్లు, ఎస్పీలు ఈ సభల కోసం పని చేస్తున్నారని ఆయన తెలిపారు. అధికారులు విధులు వదిలేసి, నెలలో 10 రోజులు టీడీపీ నిర్వహించే సభలు, సమావేశాల కోసం పని చేస్తున్నారని, దీనిని గాడి తప్పిన వ్యవహారం అనకుండా మరేమి అంటారని ఆయన మరో ప్రశ్నకు సమాధానంగా అన్నారు. రైతు రుణ మాఫీకి నాలుగైదు విడతల డబ్బులు ఇవ్వలేదని, పోస్ట్ డేటెడ్ చెక్కుల ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు డబ్బులు ఇస్తామంటున్నారని ఆయన విమర్శించారు.

నిఘా వైఫల్యం!

తెలంగాణకు వచ్చే అవకాశం లేదు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల బందోబస్తుతో పాటు మావోయిస్టుల చర్యలను ఎదుర్కోవడం పోలీసలకు సవాల్‌గా మారనున్నది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్రాలు లక్షమంది బలగాలను మోహరించాయి. కేవలం రాష్ట్ర బలగాలతో పార్లమెంట్ ఎన్నికలను, మావోయిస్టులను ఎదుర్కోలేమని కేంద్రానికి పోలీస్ అధికారులు నివేదికను పంపుతున్నారు. నివేదికలను బట్టి ఎన్ని బలగాలు వస్తాయోనని అధికారులు అంచనాకు రాలేకపోతున్నారు. అనుకున్న బలగాలను కేంద్రం పంపకపోతే బందోబస్తుకు ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఇటీవల విధ్వంసక చర్యల ద్వారా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకున్నారు. జయశంకర్ జిల్లాలో జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల వద్ద పని చేస్తున్న ప్రొక్లేన్లను మావోయిస్టులు ధ్వంసం చేశారు. ఈనెల 31న భారత్ బంద్‌కు మావోయిస్టులు పిలుపు ఇచ్చారు. బంద్‌ను జయప్రదం చేయడానికి ఇప్పటికే ఏజెన్సీలోలో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు వెలిశాయి. భారత్ బంద్‌కు అన్ని వర్గాలు సహకరించలని మావోయిస్టలు పిలుపు ఇచ్చారు. దీన్ని అడ్డుకోవడానికి పోలీసులు సమాయత్తం అవుతున్నారు. ఈనెల 31న బంద్ నేపథ్యంలో ఉత్తర తెలంగాణ జిల్లాలో పని చేస్తున్న పోలీస్ సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని అనధికారికంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెళ్ళాయని చెబుతున్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాలకు పోలీస్ బలగాలను పంపుతున్నారు. 31న బంద్ నేపథ్యంలో అన్ని ప్రధాన మార్గాల్లో ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర సరిహద్దుల నుంచి తెలంగాణలోకి వచ్చే మార్గాల్లో పటిష్ట బందోబస్తుకు బలగాలను పంపుతున్నారు. తెలంగాణలో అన్ని ప్రధాన పట్టణాల్లో ఉన్న ప్రజా సంఘాల నేతలపై పోలీసులు దృష్టి పెట్టారు. మావోయిస్టలకు అర్బన్ నక్సల్స్ నుంచి మారణాయాధాలు సరఫరా జరుగుతోందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల మావోయిస్టులకు ఆయుధాలు సరఫరాచేస్తున్న సానుభూతిపరుల్ని మహబూబాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 25 నుంచి 31 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మావోస్టులు పిలుపు ఇచ్చిన విషయం తెల్సిందే.

రైతులకు తీపి కబురు?

సూచనలను కేంద్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే చేసింది. అయితే ఇందులో ఉత్తమమైన పథకాన్ని రైతులకు ప్రవేశపెడతారని, దీనివల్ల ఖజానాపై అధిక భారం పడినా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం వీటిని ప్రవేశపెడుతోందని భావిస్తున్నారు. రైతులకు ప్రవేశపెట్టవచ్చునని భావిస్తున్న పథకాల్లో మొదటిది రుణాలపై వడ్డీ మాఫీ. రైతులు తీసుకున్న పంట రుణాలపై వడ్డీని మాఫీ చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఇది అమలు చేస్తే కేంద్ర ఖజానాపై 15000 కోట్ల భారం పడుతుంది. పంటలకు సంబంధించి తీసుకునే బీమా ప్రీమియాన్ని పూర్తిగా రద్దు చేయడం రెండో పథకం. అలాగే ప్రస్తుతం తెలంగాణ, ఒడిసా రాష్ట్రాలు అమలు చేస్తున్న విధంగా ప్రతి రైతు ఖాతాలో నగదు నేరుగా జమచేయడం.

2019-20 బడ్జెట్‌కు ముందే రైతులకు సంబంధించిన ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తామని ఇటీవల కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్ ఇటీవల ప్రకటించారు. బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దానికన్నా ముందుగానే రైతులకు ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటిస్తుందని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఎంతోకాలం లేనందున కేంద్రం ఏ కొత్త పథకాన్ని ప్రకటించినా, వాటి ఫలాలు వారికి దక్కాలంటే త్వరగా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఈ నేపథ్యంలోనే ఇటీవల హఠాత్తుగా ఈబీసీ బిల్లు ఆమోదించి అమలు చేసిన విధంగానే రైతులకు సంబంధించిన పథకాన్ని కూడా కేంద్రం త్వరగా ఆమోదించి అమలు చేస్తుందని భావిస్తున్నారు. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఎన్నికల్లో తమ పార్టీ ఘోర పరాజయం అనంతరం రైతులకు ఎట్టిపరిస్థితుల్లో ఒక సంక్షేమ పథకాన్ని తీసుకురావాల్సిందేనని కేంద్రం నిర్ణయించినందున ఆమేరకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక దీనికి సంబంధించి రెండుమూడు రోజుల్లో పథకాన్ని ప్రకటించడమే తరువాయి.

క్రీడాభూమి

టీమిండియాతో జాగ్రత్త!

- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన న్యూజిలాండ్ పోలీసుల ఫన్నీ పోస్ట్

మౌంట్ మాంగనూయ్, జనవరి 27: న్యూజిలాండ్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో చేసిన ఓ ఫన్నీ పోస్టు వైరల్‌గా మారింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు ఐదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మొదటి రెండు వన్డేలను గెలిచిన విషయం తెలిసిందే. అయితే దీనిపై అక్కడి పోలీసులు 'న్యూజిలాండ్ పోలీసులు ప్రజలకు ఒక హెచ్చరిక చేయాలనుకుంటున్నారు. మన దేశానికి పర్యటన నిమిత్తం ఒక ప్రమాదకర జట్టు వచ్చింది. అమాయక న్యూజిలాండ్ జట్టుపై వారు నేపియర్, మౌంట్ మాంగనూయ్‌లో దాడి చేశారు. ఎవరైనా బ్యాట్లు, బంతులు తీసుకొని బయటకు వెళ్లాలనుకునే వారు తగిన జాగ్రత్తలు తీసుకోండి' అంటూ ఫన్నీగా చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. అభిమానులు సైతం ఈ పోస్టుపై ఫన్నీగానే కామెంట్లు పెడుతున్నారు.

సైనాదే ఇండోనేషియా మాస్టర్స్

ఫైనల్‌లో గాయంతో కరోలినా ఔట్

- గేమ్ ముగియకుండానే విజేతగా ప్రకటించిన నిర్వాహకులు
- ఈ ఏడాది తొలి టైటిల్‌ను ఖాతాలో వేసుకున్న భారత షట్లర్

జకార్తా, జనవరి 27: ఇండోనేషియా మాస్టర్స్ వరల్డ్ సూపర్-500 టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ విజేతగా నిలిచింది. స్పెయిన్ షట్లర్ కరోలినా మారిన్‌తో ఆదివారం ఫైనల్‌లో తలపడిన సైనా గేమ్ ముగియకుండానే టైటిల్‌ని తన ఖాతాలో వేసుకుంది. ఆట ప్రారంభం నుంచి దూకుడు ప్రదర్శించిన కరోలినా, సైనాపై ఆదిపత్యం ప్రదర్శించింది. ఓ దశలో 7-2తో ఆధిక్యంలో ఉన్న సమయంలో కరోలినా కాలికి గాయమైంది. కొద్దిసేపు చికిత్స తీసుకున్న అనంతరం మ్యాచ్ తిరిగి ప్రారంభించిన కరోలినా మరో రెండు పాయింట్లు సాధించిన అనంతరం మరోసారి గాయం తిరగబెట్టడంతో ఫైనల్ పోరు నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. దీంతో టోర్నీ నిర్వాహకులు సైనా నెహ్వాల్‌ను విజేతగా ప్రకటించారు. ఈ టైటిల్ గెలవడంతో ఈ ఏడాది తొలి మాస్టర్స్ టైటిల్‌ను సైనా తన ఖాతాలో వేసుకుంది. కాగా మలేషియా మాస్టర్స్ సెమీ ఫైనల్‌లో సైనా కరొలినా చేతిలో ఓడిన విషయం తెలిసిందే. గతేడాది కూడా ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్ చేరినా తుది పోరులో ఓటమి చవిచూసింది.




ఇండోనేషియా మాస్టర్స్ వరల్డ్ సూపర్-500 టోర్నమెంట్ గెలిచిన సైనా నెహ్వాల్, గాయంతో కుప్పకూలిన కరోలినా

'ఆస్ట్రేలియా' కింగ్ జొకోవిచ్

- ఫైనల్‌లో రాఫెల్ నాదల్‌పై విజయం
- కెరీర్‌లో 15వ గ్రాండ్ శ్లామ్ టైటిల్ కైవశం

మెల్బోర్న్, జనవరి 27: ప్రపంచ నెంబర్ వన్ హోదాలో, టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సెర్బియా ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అతను ప్రపంచ రెండో ర్యాంక్ ఆటగాడు రాఫెల్ నాదల్‌ను 6-3, 6-2, 6-3 తేడాతో ఓడించాడు. కెరీర్‌లో అతనికి ఇది 15వ గ్రాండ్ శ్లామ్ టైటిల్‌గా ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఏడవది. నిజానికి ఈ ఫైనల్ హోరాహోరీగా సాగుతుందని అంతా ఊహించారు. కానీ, అందుకు భిన్నంగా, దాదాపు ఏకపక్షంగా ముగిసింది. క్లే, హార్డ్ కోర్టులపై విజృంభించే నాదల్‌కు ఆస్ట్రేలియా ఓపెన్ అచ్చిరాలేదని మరోసారి రుజువైంది. 2009లో ఈ టైటిల్ గెల్చుకున్న అతను మరోసారి






ఫైనల్‌లో ఓడిన రాఫెల్ నాదల్

విజయభేరి మోగించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ టోర్నమెంట్ తొలి రౌండ్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన జేమ్స్ డక్‌వర్తను 6-4, 6-3, 7-5 తేడాతో ఓడించిన నాదల్ ఆతర్వాత వరుసగా మాథ్యూ ఎబ్డెన్ (6-3, 6-2, 6-2), అలెక్స్ డి మినౌర్ (6-1, 6-2, 6-4), థామస్ బెర్డిచ్ (6-0, 6-1, 7-6)పై విజయాలు నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్ చేరాడు. అక్కడ ఫ్రాన్సిస్ తియాఫోను 6-3, 6-4, 6-2 ఆధిక్యంతో ఓడించాడు. సెమీ ఫైనల్లో స్టెఫానో సిట్సిపాస్‌పై 6-2, 6-4, 6-0 స్కోరుతో గెలుపొంది జొకోవిచ్‌తో తుది పోరును ఖరారు చేసుకున్నాడు. అయితే, తుది పోరులో తడబడి, రన్నరప్ ట్రోఫీతో సరిపుచ్చుకున్నాడు.


ఈ టోర్నీ మొత్తం దూకుడుగా ఆడిన జొకోవిచ్ తొలి రౌండ్‌లో క్వాలిఫయర్ మిచెల్ క్రూగెర్‌ను 6-3, 6-2, 6-2 స్కోరుతో ఓడించాడు. అనంతరం అతను జో విల్‌ఫ్రైడ్ సోంగా (6-3, 7-5, 6-4), డానిస్ షెపొవలోవ్ (6-3, 6-4, 4-6, 6-0), డానిల్ మెద్వెదెవ్ (6-4, 6-7, 6-2, 6-3)పై విజయాలు సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టాడు. ఈ దశలో అత్యంత ప్రమాదకరమైన ఆటగాడు కెయ్ నిషికోరి అతని దూకుడుకు అడ్డుతగిలే ప్రమాదం కనిపించింది. అయితే, జొకోవిచ్ తేతిలో తొలి సెట్‌ను 1-6 తేడాతో కోల్పోయి, రెండో సెట్‌లో 1-4 తేడాతో వెనుకబడి ఉన్న సమయంలో, కండరాలు బెణకడంతో ఆటను కొనసాగించలేకపోయాడు. దీనితో జొకోవిచ్‌కు సెమీస్‌లో చోటు దక్కింది. టైటిల్‌పై కన్నేసిన అతను లుకాస్ పౌలీని 6-0, 6-2, 6-2 తేడాతో చిత్తుచేశాడు. తుది పోరులోనూ అదే దూకుడును కొనసాగించి, నాదల్‌ను వరుస సెట్లలో ఓడించి, టైటిల్ అందుకున్నాడు.



ట్రోఫీని ముద్దాడుతున్న జొకోవిచ్

విండీస్ భారీ విజయం

- మొదటి టెస్టులో 381 పరుగుల తేడాతో ఓడిన ఇంగ్లాండ్



రోస్టన్ చేస్ 8/60

బ్రిడ్జిటౌన్, జనవరి 27: కొన్నాళ్లుగా వరుస ఓటములతో సతమతమవుతున్న వెస్టిండీస్ ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టెస్టులో భారీ విజయాన్ని అందుకుంది. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో రాణించి మునుపటి ఆట తీరును గుర్తుకు తెచ్చింది. బ్రిడ్జిటౌన్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విండీస్ షాయి హోప్ (57), రోస్టన్ చేస్ (54), షిమ్రాన్ హిట్మయిర్ (81) రాణించడంతో మొదటి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ అండర్సన్ 5, బెన్ స్టోక్స్ 4, మొయిన్ అలీ 1 వికెట్ తీశారు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లాండ్ జట్టు విండీస్ బౌలర్ల ధాటికి కేవలం 77 పరుగులకే ఆలౌట్ అయింది. కిమన్ రోచ్ 5, జాసన్ హోల్డర్, అల్జారి జోసెఫ్ తలో రెండు, షానన్ గబ్రియెల్ ఒక వికెట్ తీసుకున్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో 212 పరుగుల ఆధిక్యం సంపాదించిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ జాసన్ హోల్డర్ (202)కి తోడు షానె డౌరిచ్ సెంచరీ చేయడంతో ఐదు వికెట్లు కోల్పోయి 415 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. 628 పరుగుల లక్ష్య ఛేదనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లీష్ జట్టు 246 పరుగులకే కుప్పకూలింది. దీంతో వెస్టిండీస్ 381 భారీ పరుగుల తేడాతో విజయం సాధించింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేస్ 8 వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు.

పాక్ కెప్టెన్‌పై వేటు



దుబాయ్, జనవరి 27: పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించినట్లు ఐసీసీ ఆదివారం ప్రకటించింది. దక్షిణాఫ్రికా తో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సఫారీ బ్యాట్స్‌మన్ అండిలె ఫెలుక్వాయోపై సర్ఫరాజ్ వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

సీఎన్‌జీ వాహనాల వినియోగంలో ఢిల్లీ ఫస్ట్

- ఏడు, ఎనిమిది స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్



న్యూఢిల్లీ, జనవరి 27: సీఎన్‌జీ వాహనాలను వినియోగించడంలో ఢిల్లీ దేశంలోనే అగ్రస్థానాన్ని ఆక్రమించింది. ఈనెల ఒకటవ తేదీనాటి గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రంలోలో 10,58,111 సీఎన్‌జీ వాహనాలు ఉన్నాయి. పదిలక్షల వాహనాల మైలురాయిని అధిగమించిన తొలి రాష్ట్రం కూడా ఢిల్లీ కావడం విశేషం. రాష్ట్ర రాజధాని సహా ఎన్నో నగరాలు, పట్టణాలు తీవ్రమైన కాలుష్య సమస్యతో అల్లాడుతున్న విషయం తెలిసిందే. పర్యావరణాన్ని పరిరక్షించి, ఢిల్లీని కాలుష్య సమస్య నుంచి తప్పించడానికి అటు సుప్రీం కోర్టు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే సంపీడన సహజ వాయువు (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్/ సీఎన్‌జీ) వాహనాలను ప్రోత్సహించాయి. కాలుష్యానికి కారణమైన అంశాలను గుర్తించి, పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈ కారణంగానే ఢిల్లీలో సీఎన్‌జీ వాహనాల వినియోగం ఇటీవల కాలంగా గణనీయంగా పెరిగి, అగ్రస్థానానికి చేరింది. మహారాష్ట్ర 8,89,921 వాహనాలతో రెండో స్థానంలో ఉంటే, గుజరాత్ 8,85,049 వాహనాలను కలిగి ఉండడం ద్వారా మూడో స్థానంలో ఉంది. హర్యానా (1,55,502 వాహనాలు), ఉత్తరప్రదేశ్ (1,49,180 వాహనాలు), మధ్యప్రదేశ్ (35,479 వాహనాలు) వరుసగా నాలుగు, ఐదు, ఆరు స్థానాలను ఆక్రమించాయి. కాగా, ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఈ జాబితాలో ఏడు, ఎనిమిది స్థానాలు దక్కాయి. తెలంగాణ 24,630 వాహనాలతో ఆంధ్రప్రదేశ్ కంటే ఒక అడుగు ముందుంది. ఏపీలో 19,572 సీఎన్‌జీ వాహనాలు ఉన్నాయి. 'టాప్-10' జాబితాలో త్రిపుర (11,263 వాహనాలు), రాజస్థాన్ (8,108 వాహనాలు) తొమ్మిది, పది స్థానాలను సంపాదించాయి.

సీఎన్‌జీ 'టాప్-10' రాష్ట్రాలివే..

1. ఢిల్లీ, 2. మహారాష్ట్ర, 3. గుజరాత్, 4. హర్యానా, 5. ఉత్తర ప్రదేశ్, 6. మధ్యప్రదేశ్, 7. తెలంగాణ, 8. ఆంధ్రప్రదేశ్, 9. త్రిపుర, 10. రాజస్థాన్.

సేంద్రియ రసాయనాల ఎగుమతుల జోరు!



న్యూఢిల్లీ, జనవరి 27: దేశం నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో సేంద్రియ రసాయనాలు ఉనికిని చాటుకుంటున్నాయి. 2009-10 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఈ రసాయనాల ఎగుమతుల విలువ పెరుగుతునే ఉంది. 2009-10 ఆర్థిక సంవత్సరంలో రూ.35,241.28 కోట్ల విలువైన రసాయనాలను ఎగుమతి చేయడం జరిగింది. 2010-11లో ఈ మొత్తం 41,051.75 కోట్ల రూపాయలకు పెరిగింది. 2011-12లో రూ.56,179.25 కోట్లు, 2012-13లో రూ.65,874.42 కోట్లు, 2013-14లో 72,860.47 కోట్ల రూపాయలుగా ఆర్గానిక్ కెమికల్స్ ఎగుమతుల విలువ నమోదైంది. 2014-15లో 73,068.90 కోట్ల రూపాయలు, 2015-16లో 75,294.55 కోట్ల రూపాయల విలువైన సేంద్రియ రసాయనాలు ఎగుమతయ్యాయి. 2016-17లో 78,385.58 కోట్ల రూపాయలుకాగా, 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఒక్కసారిగా భారీ స్థాయి ఎగుమతులను భారత్ సాధించగలిగింది. 95,380.62 కోట్ల రూపాయల విలువైన సేంద్రియ రసాయనాలు ఎగుమతికాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో అంతకంటే ఎక్కువ మొత్తం సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 82,842.59 కోట్ల రూపాయల విలువైన ఆర్గానిక్ కెమికల్స్ ఎగుమతయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి, ఈ అంకె గత ఏడాదిలో నమోదైన ఎగుమతులను అధిగమించడం ఖాయంగా కనిపిస్తున్నది.

లక్ష్యానికి చేరువగా పత్తి ఉత్పత్తి



న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలో పత్తి ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే దిశగా వెళుతున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 355 లక్షల బేళ్లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. ఒకొక్కటీ 170 కిలోలతో బేళ్లను సిద్ధం చేస్తారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఎంచుకున్న లక్ష్యంలో ఇప్పటికే 324.83 లక్షల బేళ్ల ఉత్పత్తి జరిగినట్టు ప్రాథమిక అంచనా నివేదిక స్పష్టం చేస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంలో 348.88 బేళ్లు ఉత్పత్తి జరిగింది. ఈసారి మెరుగైన ఫలితాలను రాబట్టే ప్రయత్నం సఫలమవుతుందని నిపుణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని మినహాయిస్తే (300.05 లక్షల బేళ్లు) మిగతా 2012-13 ఆర్థిక సంవత్సరం నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకూ ఉత్పత్తి నిలకడగా కొనసాగుతున్నది. 2012-13 లో 342.20 లక్షల బేళ్లు ఉత్పత్తికాగా, 2013-14 లో 359.02 లక్షల బేళ్లకు పెరిగింది. 2014-15లో 348.05 లక్షల బేళ్ల ఉత్పత్తి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి దాదాపుగా 2014-15 ఆర్థిక సంవత్సర ఫలితానికి దగ్గర్లో ఉండగా, ఈసారి లక్ష్యాన్ని మించే అవకాశముంది.

పారదీప్ ఓడరేవు ద్వారా

110 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా

- గతేడాది కంటే 11.56 శాతం అధికం

భువనేశ్వర్, జనవరి 27: ఒడిశాలోని పారదీప్ ఓడరేవునుంచి ఈయేడాది 110 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయాలన్న లక్ష్యం ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ ఓడరేవు నుంచి 102 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరిగింది. దీన్ని మరో 11.56 శాతం పెంచాలన్న లక్ష్యం ఉందని రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా జరిగిన సభలో మాట్లాడుతూ పారదీప్ పోర్టు ట్రస్ట్ చైర్మన్ రింకేష్ రాయ్ తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా వంద మిలియన్ మెట్రిక్ టన్నులను రవాణాను అధిగమించి అలాంటి ప్రధాన ఓడరేవుల క్లబ్‌లో చేరినట్టు ఆయన వివరించారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన ఓడరేవుల్లో ఇది రెండవ అతిపెద్ద రికార్డు అని, భారత్‌లోని ఓడరేవుల రవాణాలో ఇదే అత్యధిక సరుకు రవాణా రికార్డు అని ఆయన తెలిపారు. ఈ ఓడరేవు సామర్థ్యం 277 మిలియన్ మెట్రిక్ టన్నులుగా రేటింగ్ ఉందని, ఇదే అతివిశాలమైన ఓడరేవు అని ఆయన చెప్పారు. సరికొత్త విధానాల రూపకల్పనతోబాటు, నిపుణతను పాదుకొల్పి రవాణాలో సరికొత్త ప్రమాణాలను అందుకున్నామన్నారు. యాంత్రిక బొగ్గు నిర్వహణ ప్లాంట్ (ఎంసీహెచ్‌పీ)లో సైతం పనితీరులో 65 శాతం అధికంగా నిపుణత సాధించిందన్నారు. ఈ ప్లాంట్ ద్వారా 1.32 లక్షల మెట్రిక్ టన్నుల సరుకు కేవలం ఒక్క రోజులో లోడింగ్ జరుగుతుందన్నారు. 2014-15లో ఈ లోడింగ్ 1.01 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండేదన్నారు. అలాగే ఇనుప ఖనిజ నిర్వహణ ప్లాంట్ సైతం 141 శాతం అధికంగా లోడింగ్ సమర్థతను పెంచుకుందన్నారు. 2014-15లో గంటకు 414 టన్నుల లోడింగ్ జరిగే ఈ ప్లాంటు ప్రస్తుతం గంటకు వెయ్యి టన్నులు లోడింగ్ జరిగే స్థాయికి పెరిగిందన్నారు. సముద్ర ఖనిజ విభాగం సైతం 27 శాతం అధిక సామర్థ్యంతో పనిచేస్తోందన్నారు. గత యేడాది (2018) అక్టోబర్‌లో రికార్డు స్థాయి నెలవారీ సరుకు రవాణా 1018 మిలియన్ మెట్రిక్ టన్నులు జరిగిందని చైర్మన్ రాయ్ తెలిపారు.

వాణిజ్యభూమి


త్రైమాసిక ఫలితాలతో

స్టాక్ మార్కెట్‌కు ఊపు!



న్యూఢిల్లీ, జనవరి 27: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్), ఇన్ఫోసిస్ వంటి బడా సంస్థలు ఇప్పటికే త్రైమాసిక ఫలితాలను ప్రకటించగా, భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగల మరి కొన్ని కంపెనీల ప్రకటనలతో స్టాక్ మార్కెట్‌కు మరింత ఊపు ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితి కూడా ఆ వాదనకు బలాన్నిస్తోంది. మూడో త్రైమాసికంలో 10,000 కోట్ల రూపాయలకు మించిన ఆదాయాన్ని రిల్ ప్రకటించిన వెంటనే ఆ కంపెనీ షేర్లకు ఎక్కడలేని డిమాండ్ ఏర్పడిన విషయం తెలిసిందే. అదే విధంగా ఇన్ఫోసిస్ త్రైమాసిక ఫలితాలను వెల్లడిస్తూనే, మరోవైపు సుమారు 8,200 కోట్ల రూపాయల విలువైన తమ ఈక్విటీ షేర్లను తిరిగి కొంటున్నది. ఈ నిర్ణయం కూడా బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బీఎస్ఈ)పై ప్రభావం చూపింది. అమెరికా, చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధానికి ఇంకా తెరపడపోవడం, ఇరు దేశాల ప్రతినిధుల సమావేశం అనుకున్న సమయానికి జరగకపోవడం వంటి అంశాలు సహజంగానే అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీనికితోడు ముడి చమురు ధర పెరుగుదల, రూపాయి మారకం విలువ నిలకడగా లేకపోవడం తదితర అంశాలు స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ సమయంలో వివిధ కంపెనీలు ప్రకటిస్తున్న త్రైమాసిక ఫలితాలే మార్కెట్‌ను ఆదుకుంటున్నాయి.

లార్జ్ క్యాప్‌లోనేగాక, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు కూడా భారత స్టాక్ మార్కెట్ లావాదేవీలను ప్రభావితం చేస్తాయని గతంలో ఎన్నో సందర్భాల్లో రుజువైంది. బులియన్ మార్కెట్ సైతం తనదైన ప్రభావం చూపుతున్నది. 10 గ్రాముల బంగారం ధరలో వరుగా రెండు రోజులు ఏమాత్రం మార్పు లేకపోకుండా, 33,210 రూపాయల వద్ద ముగిసింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్ బలహీన పడడం, దేశీయ మదుపరుల నుంచి డిమాండ్ లేకపోవడం వంటి అంశాలు బంగారం ధర పెరకపోవడానికి ప్రధాన కారణాలుగా చెప్పాలి. కాగా, కిలో వెండి ధర 210 రూపాయలు తగ్గింది. మార్కెట్‌లో లావాదేవీలు ముగిసే సమయానికి 39,950 రూపాయలుగా నమోదైంది. గత శనివారం గణతంత్ర దినోత్సవం కావడంతో బులియన్ మార్కెట్ మూతపడింది. అంతకు ముందు రోజు, శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర 90 రూపాయలు పెరిగి, 33,300 రూపాయల వద్ద ముగిసింది. ఇది మార్కెట్‌కు ఊరటేగానీ ఆశించిన స్థాయిలో నమోదైన ధర కాదు. నిజానికి బంగారం ధర బాగా పెరుగుతుందని, స్టాక్ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చితి బులియన్ మార్కెట్‌కు కలిసి వస్తుందని అంతా అనుకున్నారు. కానీ, లావాదేవీలు అందుకు భిన్నంగా జరిగాయి. కాగా, సహజంగా స్టాక్ మార్కెట్ నీరసించినప్పుడు బులియన్ మార్కెట్ లాభాలను ఆర్జిస్తుంది. స్టాక్ మార్కెట్‌లో బుల్ రన్ కొనసాగితే, బులియన్ మార్కెట్‌కు నష్టాలు తప్పవు. మదుపరులు, బ్రోకర్లు ఎక్కువగా వాటాల అమ్మకాలు, కొనుగోళ్లపై దృష్టి పెడతారు. స్టాక్ మార్కెట్‌లో బుల్‌రన్‌కు బ్రేక్ పడి, బేర్ ఆధిపత్యం కొనసాగుతుంటే, వారి దృష్టి బంగారంపై పడుతుంది. రాబోయే రోజుల్లో త్రైమాసిక ఫలితాల తోపాటు బంగారం ధర కూడా స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. మొత్తానికి స్థూలంగా చూస్తే, బులియన్ మార్కెట్ కంటే, త్రైమాసిక ఫలితాలే రాబోయే వారంలోనేగాక, రాబోయే కాలంలోనూ స్టాట్ మార్కెట్‌ను శాసిస్తాయన్నది స్పష్టమవుతున్నది.



న్యూఢిల్లీలో చలి తీవ్రత మనుషులనేకాదు.. పశువులను కూడా వణికిస్తున్నది. ఆదివారం మధ్యాహ్నం కూడా చల్లగాలులు వీస్తుండడంతో, పశువులు వాటి బారిన పడకుండా ఓ యజమాని చేసిన ప్రయత్నమిది.



ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతంలోని సలూ ప్రావీన్స్, జొలో నగరంలో రెండు జంట బాంబులు పేలిన ప్రాంతం. రోమన్ కాథలిక్ చర్చిలోపల రెండు బాంబులు పేలిన సంఘటనలో కనీసం పదిహేను మంది మృతి చెందారని, భారీ సంఖ్యలో గాయపడ్డారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తున్నదని పేర్కొంది. దాడి సంఘటనపై విచారణ జరిపిస్తామని, దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదని హెచ్చరించింది.

బ్రిటీష్ పాలనను కూలదోసింది కాంగ్రెస్సే

❖ యువతే పార్టీకున్న పటిష్ట శక్తి ❖ ఓపికున్నంత వరకూ కాంగ్రెస్‌లోనే ఉంటా ❖ మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య



తెనాలిలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రోశయ్య

తెనాలి, జనవరి 27: నాడు సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనను కూలదోసి స్వాతంత్య్రం సాధించి, దేశంలో పటిష్టమైన పాలనను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అన్నారు. పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి నేటివరకు యువశక్తే బలం చేకూర్చిందని చెప్పారు. ఓపిక ఉన్నంతవరకు తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని తెలిపారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు సారథ్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రోశయ్య ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకత్వంలోనే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, ఈ విషయం కాదనగలవారెవరో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. నేడు సంకీర్ణ ప్రభుత్వాలను దూరం పెట్టి జాతీయ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం అప్పగించాల్సిన సమయం మరోసారి ఆసన్నమైందన్నారు. గ్రామాల నుండి పట్టణాల వరకు యువశక్తి సహకారంతో నేతలు కొత్తతరానికి అవకాశం కల్పిస్తూ పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. కేవలం అధికారమే పరమావధిగా కాకుండా దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తొలి నుండి పనిచేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రోశయ్య సూచించారు.

ప్రపంచానికే ఆదర్శం

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిందని, అలాంటి దేశంలో నేడు కులం, మతం, వర్గం, ప్రాంతం అంటూ విభేదాలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చు రేపుతున్న నేతలకు, పార్టీలకు తగిన బుద్ధి చెప్పే అవకాశం మన ముందుందన్నారు. ఇలాంటి పరిస్థితి స్వాతంత్య్రానంతర భారతదేశంలో వస్తుందని నాటి బ్రిటీష్ పాలకులు ముందుగానే హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఐకమత్యమే దేశానికి బలమనే విషయం గుర్తించాలన్నారు. కులం, మతం, ప్రాంతీయతకు అతీతంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఆంధ్రులను హామీలు, ప్యాకేజీలు, అలవికాని వాగ్దానాలు ఇచ్చి మోసం చేసిన పార్టీలకు 2019 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో ఉంటున్న ఏపీ వాసులను మాటలతో చిత్రహింసలు పెట్టి ఆత్మహత్యలు చేసుకునేలా కేసీఆర్ వేధించారని ఆయన ఆరోపించారు. ఆత్మహత్యలు చేసుకున్నవారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎక్కువగా ఉన్నారని, వారంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారేనని చెప్పారు. ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో వాగ్దానాలు చేసి మోసం చేసిన ప్రధాని, కేంద్ర మంత్రులపై ఇప్పటికే కేసులు పెట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగి, తుదివరకు అందులోనే ఉంటూ కనుమూసిన రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ వాడేనన్న విషయాన్ని వైసీపీ నేతలు గుర్తించాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించి మోసగించిన నేతలను ప్రజలు క్షమించరని జేడీ శీలం హెచ్చరించారు. ఏఐసీసీ కార్యదర్శి ఎస్కే మస్తాన్ వలీ, డీసీసీ అధ్యక్షుడు మక్కెన మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



ఓటేయకుంటే బాధపడాలి

'మన్ కీ బాత్'లో యువతకు ప్రధాని నరేంద్ర మోదీ హితవు

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా మరువరాదని, ఎన్నికల్లో ఓటు వేయడాన్ని పవిత్ర విధి, కర్తవ్యంగా భావించాలని, ఓటేయకుంటే తప్పు చేశామనే భావన మనసులో కలగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రతి నెలా నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలను ఖచ్చితమైన, నిర్వహణా సామర్థ్యంతో నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పాత్రను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న యువత తమ ఓటును తొలిసారిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన అభిలషించారు. 'దేశ భవిష్యత్తును నిర్దేశించేందుకు వచ్చిన సదవకాశం తమ భుజస్కంధాలపై ఉందన్న విషయాన్ని బాధ్యతగా గుర్తెరగాలి. దేశ పునర్నిర్మాణంలో జరిగే ప్రయాణంలో తాము కూడా భాగస్వాములు కావాలి. దేశానికి మేలు చేకూర్చేందుకు వ్యక్తిగతంగా కంటున్న కలలను సాకారం చేసుకోవాలి' అని యువతను ఉద్దేశించి ప్రధాని తన ప్రసంగంలో పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతిఒక్క యువతీయువకులు తప్పనిసరిగా ఓటరుగా తమ పేర్లను రిజిస్టరులో నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరూ తమ జీవితంలో లభించే ఇలాంటి అరుదైన ఘట్టాలను ప్రతిఒక్కరితో పంచుకునేందుకు వచ్చిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'ఏ కారణం వల్లనైనా ఎవరైనా ఓటేయలేకపోతే దానిని తనకు స్వయంగా కలిగిన నొప్పి లేదా బాధగా భావించాలి' అని ఆయన నొక్కిచెప్పారు. ఓటు వేసే విషయంలో ప్రతిఒక్కరూ దీని ప్రాధాన్యతను బాధ్యతగా గుర్తెరగాలని ఆయన అన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రముఖ వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ప్రధాని పిలుపునిచ్చారు. 'ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచేందుకు అర్హత కలిగిన యువతీ యువకులు ఓటర్లుగా స్వచ్ఛందంగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ముందుకు వస్తారని తాను విశ్వసిస్తున్నానని' ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా, దేశంలో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు, భద్రతా సిబ్బంది వంటివారు తీసుకుంటున్న చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, 'అంతరిక్షంలో పరిశోధనలు చేసే స్థాయికి మన దేశ యువత చేరుకుంది. ఇది గర్వించదగ్గ విషయం. మన యువత ఉపగ్రహాలను తయారు చేసే దిశగా ఎదిగారు. అలాంటివారిని మనం మరింత ప్రోత్సహించాలి. దేశం గర్వించదగ్గ 'కలాం శాట్'ను మన విద్యార్థులే ఈనెల 24న తయారు చేసి ప్రారంభించారు. ఇలాంటి యువత మరిన్ని రికార్డులు సాధించే దిశగా ముందుకు సాగాలి' అని ప్రధాని అభిలషించారు. 2014 నుం చి గత నాలుగేళ్లుగా మన దేశం ఎన్నో అంతరిక్ష ఉపగ్రహాలను ప్రయోగించిందని ఆయన అన్నారు.





పుస్తకావిష్కరణ

హైదరాబాద్‌లోని కొండాపూర్ హైటెక్స్ బుక్ మీనాక్షి స్కై లాంజ్‌లో ఆదివారం ఎన్టీఆర్ బయోగ్రఫీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు తదితరులు

ట్రంప్ లొంగిపోయారు

అయినా గోడ నిర్మిస్తారు ❖ సంప్రదాయవాదుల ధీమా



వాషింగ్టన్, జనవరి 27: అమెరికా దక్షిణ సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి సంబంధించి కాంగ్రెస్‌తో ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాన్ని తిరిగి తెరవడంపై సంప్రదాయవాదులు పెదవి విరుస్తున్నారు. ట్రంప్ ఒత్తిళ్లకు లొంగిపోయారని పేర్కొంటూనే, ఆయన గోడ నిర్మించి తీరుతారనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్‌ను బలపరుస్తున్న సంప్రదాయవాదుల్లో కొంత మంది మాత్రం ఆయన తీసుకున్న నిర్ణయాన్ని దయనీయమయినదిగా, పిరికితనంతో కూడినదిగా అభివర్ణిస్తున్నారు. మరికొంత మంది ట్రంప్ మద్దతుదారులు మాత్రం ఆయన తీసుకున్న నిర్ణయాన్ని అంతగా తప్పుపట్టడం లేదు. అయితే, సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసే అంశం ఉంటేనే ప్రభుత్వ సాయానికి సంబంధించిన ఒప్పందంపై ట్రంప్ సంతకం చేయాలని వారు నొక్కి చెబుతున్నారు. అమెరికా చరిత్రలోనే మొదటిసారి అత్యంత దీర్ఘకాలం 35 రోజుల పాటు ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. అయితే, ఈ మూసివేతకు ముగింపు పలుకుతూ తీసుకున్న నిర్ణయాన్ని సంప్రదాయవాదులు విమర్శిస్తున్న నేపథ్యంలో ట్రంప్ మాత్రం శనివారం తన నిర్ణయాన్ని గట్టిగా సమర్థించుకున్నారు. దక్షిణ సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని హామీ ఇచ్చిన ట్రంప్, ఇందుకు సంబంధించి ఎలాంటి నిధులు రాకుండానే ఆయన తిరిగి ప్రభుత్వాన్ని తెరవడంపై సంప్రదాయవాదులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే, కాంగ్రెస్ నుంచి నిష్పక్షపాతమయిన ఒప్పందం రాకుంటే ఫిబ్రవరి 15వ తేదీన ప్రభుత్వం తిరిగి మూతపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. లేదా అమెరికా దక్షిణ సరిహద్దులో తాను అభివర్ణించిన 'మానవతా, భద్రతా సంక్షోభాన్ని' పరిష్కరించడానికి తాను తన కార్యనిర్వాహక అధికారాలను వినియోగిస్తానని ట్రంప్ తెలిపారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy, PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

వివరం

పరమాణువంత
పనితనం లేకున్నా
పలకరింపుకో బదులు
పలికేవారు కరువైనా
తెడ్డున్నా చెయ్యి
కాల్చుకునే తీరు తప్పకున్నా

అవని తనదే
ఆకాశం తనదే
ఆ మాటకొస్తే
నింగీ నేలా
లోకమంతా
తనదనుకోవడం
పరిమితులెరుగని దురాశ

పరమానందాన్ని
దరిచేరనివ్వని దురాశ

వినే తీరు విచక్షణ
పెంచి తీరాలి
అనే తీరు ఆలోచన
పంచి తీరాలి
తినే తీరుని బట్టి కదా
ఎవరి ఆరోగ్యమైనా

వివరం వేయి తీరులుగా
వినయం లక్షదారులుగా
వెలుగొందే చోట
విలువలపైనే తగని మక్కువ
తనకోసం ఎవరో రావాలని కాక
ఎవరి కోసమైనా తానొక
అభయహస్తమవ్వాలన్న మమకారం



మనిషిని మనిషిగా మనిషి ప్రేమించడమైనా..
మనిషి మనిషిలో మనిషై జీవించడమైనా...
- డా. కొల్లు రంగారావు


వలయాలు పోవాలంటే..



కంటి చుట్టూ చాలామందికి నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఇవి చాలా ఇబ్బంది పెడుతుంటాయి. ఎన్ని రకాల సౌందర్య చికిత్సలు చేయించినా ప్రయోజనం ఉండడం లేదు అనుకుంటూ ఉంటారు. చాలా మంది నిపుణులు కూడా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదనే చెబుతుంటాయి. అయితే వీటిని అదుపులో ఉంచుకోవడం మాత్రం మీ చేతుల్లోనే ఉంది అని చెబుతారు ఆరోగ్య నిపుణులు. కళ్ల కింద నల్లటి వలయాలు రావడానికి కారణాలు తెలుసుకుంటే తగ్గించుకోవడం సులువవుతుంది. ఈ సమస్య ప్రధానంగా వంశపారంపర్యంగా వస్తుంది. అలాగే ఆలస్యంగా పడుకోవడం, కంటినిండా నిద్రలేకపోవడం, ఒత్తిడి, అలర్జీలు, కళ్లు నలిపినప్పుడు ఇలాంటి వలయాలు రావచ్చు. వీటితో పాటు సైనస్, ఎటోపిక్ డెర్మటైటిస్, ఎగ్జిమా, రక్తహీనత, ఆస్తమా, డీహైడ్రేషన్.. ఇలా చాలానే కారణాలున్నాయి. ఈ సమస్యను తగ్గించడానికి ప్రతిరోజూ ఏదో ఒక నూనెతో కళ్ల చుట్టూ మర్దన చేసుకోవాలి.

నిద్రపోయే ముందు మాయిశ్చరైజర్ రాసుకుని అండర్ ఐక్రీమ్‌ని పూతలా వేసుకోవాలి. ఈ క్రీములను వాడేముందు డాక్టరు సలహా తీసుకోవాలి. సమస్యను అనుసరించి వారే తగిన క్రీములను ఇస్తారు. అలాగే విటమిన్ సి, కె, కెఫీన్, లికోరిస్ ఉన్న క్రీములను వాడాలి. ప్రతి రోజూ సన్‌స్క్రీన్ లోషన్‌ను తప్పనిసరిగా రాసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే వలయాల సమస్య అదుపులో ఉంటుంది. దీనికి చికిత్స చేయించుకోవాలి అనుకుంటే కెమికల్ పీల్ చేయించుకుంటే ఫలితం ఉంటుంది.

వంటింటి పదార్థాలను ఉపయోగించి చిన్న చిన్న చిట్కాల ద్వారా వలయాలను తగ్గించుకోవడం సాధ్యమే..



- బంగాళాదుంప గుజ్జులో చెంచా నిమ్మరసం, రోజ్ వాటర్‌ను కలిపి కళ్ల కింద పూతలా వేయాలి. కాసేపు మర్దన చేసి తరువాత కడిగేసుకోవాలి. ఇలా రోజు విడిచి రోజు చేస్తుండాలి. నెమ్మదిగా వలయాలు తగ్గుముఖం పడతాయి.
- గ్రీన్ టీ బ్యాగులను ఫ్రిజ్‌లో ఉంచి కళ్లపై పెట్టుకోవాలి. ఇలా చేస్తుంటే కళ్లు తాజాగా ఉండటమే కాదు.. చుట్టూ ఉన్న వలయాలు కూడా తగ్గిపోతాయి.
- పుదీనా గుజ్జు ఒక చెంచా, నిమ్మరసం ఒక చెంచా, కొబ్బరినూనె ఒక చెంచా తీసుకుని బాగా కలిపి కళ్ల చుట్టూ పూతలా వేయాలి. పదిహేను నిముషాల తర్వాత కడిగేస్తే కళ్ల చుట్టూ ఉన్న నలుపు తగ్గిపోతుంది.
- పచ్చి కొబ్బరిని గుజ్జులా చేసి అందులో కీరా గుజ్జు, నిమ్మరసం కలిపి కళ్ల అడుగున రాసుకోవాలి. కాసేపయ్యాక చల్లటి నీటితో కడిగేసుకుంటే కళ్ల చుట్టూ ఉన్న నలుపుదనం పోతుంది.
- డార్క్ చాక్లెట్లు, వాల్‌నట్స్, చేపలు.. వంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో ఉన్న ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్లు రక్తప్రసరణను పెంచి నల్లటి వలయాలను తగ్గిస్తాయి.
- రోజూ ఎనిమిది గంటలపాటు నిద్రపోవాలి.
- కంప్యూటర్‌పై పనిచేసేవారు ప్రతి గంటకోసారి కళ్లకు విశ్రాంతిని ఇవ్వాలి.
- కీరదోస, బంగాళాదుంప ముక్కలను చక్రాల్లా తరిగి కళ్లపై పెట్టుకుంటూ ఉన్నా నలుపుదనం తగ్గిపోతుంది. కళ్లు తాజాగా ఉంటాయి.

స్ట్రెచ్‌మార్క్స్ పోతాయా?



గర్భం ధరించినప్పుడు బరువు పెరగడం, రంగు మారడం వల్ల గీతలు పడతాయి. వాటినే స్ట్రెచ్‌మార్క్స్ అంటారు. ఈ సమయంలో ఉన్నట్టుండి బరువు పెరగడం వల్ల చర్మం అడుగున ఉన్న ఫైబర్ విరిగి స్ట్రెచ్‌మార్క్స్ వస్తాయి. కొన్నిసార్లు వంశపారంపర్యంగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు గర్భంలో ఉన్నప్పుడు, బిడ్డ మరీ బరువుగా ఉన్నప్పుడు కార్టిజోన్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు, స్టెరాయిడ్ క్రీములు వాడినా, హార్మోనుల అసమతుల్యత ఉన్నా ఇలా స్రెచ్ మార్క్స్ రావచ్చు. ఈ సమస్య వచ్చిన తరువాత కాకుండా ముందునుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే స్ట్రెచ్‌మార్క్ మరీ ఎక్కువగా రాకుండా జాగ్రత్త పడవచ్చు.

- కడుపుతో ఉన్నప్పుడు ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలి.
- పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలి. జంక్‌ఫుడ్, మిఠాయిలు, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.
- యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, ఈ, ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్లు ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవాలి. అంటే నిమ్మపండ్లు, తోట కూర, క్యారెట్, చిలగడ దుంపలు, క్యాప్సికం, పుచ్చకాయ వంటివాటిని ఎక్కువగా తీసుకోవాలి.
- మంచినీళ్లు, పండ్లు, కూరగాయ రసాలు తీసుకోవాలి.
- నిపుణుల ఆధ్వర్యంలో యోగా, స్ట్రెచెస్ వేయడం చేయాలి. క్రమం తప్పకుండా నడవాలి. ఒకేసారి బరువు పెరగకుండా చూసుకోవాలి.
- సమస్య అదుపులో ఉండాలంటే రెటినాల్, కొలాజిన్, జోజోబా ఆయిల్, విటమిన్ ఈ, ట్రెటినాయిక్ క్రీములు వాడాలి.
- అలాగే డెలివరీ తరువాత స్ట్రెచ్‌మార్క్స్ మరీ అధికంగా ఉంటే మైక్రోడెర్మాబ్రేషన్, లేజర్ చికిత్సల వల్ల ప్రయోజనం ఉండవచ్చు. కాక పోతే ఈ చికిత్సల్ని విడతలు విడతలుగా తీసుకోవాల్సి ఉంటుంది. అదీ ఫలితం వస్తుందనే నమ్మకం లేదు.
- కలబంద గుజ్జులో చెంచా వీట్ జెర్మ్, ఆలివ్‌నూనె, కోకోబటర్ కలిపి పొట్టపై పూతలా వేసుకోవాలి. అరగంటయ్యాక చల్లని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచుగా చేస్తుంటే స్ట్రెచ్ మార్క్స్ కొద్దిగా తగ్గుతాయి.

★

నగలు పదిలమిలా..

ఎంతో ఖరీదు పెట్టి నగలని ఇష్టంగా కొంటాం. వాటిల్లో ముత్యాలు, విలువైన రాళ్లు, వజ్రాలు ఉంటాయి. ఇలా ఎన్నో రకాల విలువైన నగలు ఉంటాయి. చిన్న నిర్లక్ష్యం జరిగినా మరమ్మతులకి వేలల్లో ఖర్చవుతుంది. అలా కాకుండా వాటిని జాగ్రత్తగా కాపాడుకునేందుకు కొన్ని చిన్న చిట్కాలను పాటిస్తే సరి.



- ఏవైనా నగలే అన్నట్టుగా అన్నిరకాల నగలనీ ఒకేచోట కుప్పగా పెట్టకూడదు. రాళ్లనగలు, ముత్యాల నగలూ ఒకే చోట ఉండకూడదు. ఉంటే ఒకదానితో ఒకటి రాపిడికి గురై గీతలు పడి ఆభరణం అందమంతా పోతుంది.
- పెద్ద పెద్ద హారాలని విలువైన చెవి పోగులనీ ఒకేచోట కాకుండా వేర్వేరు వెల్వెట్ సంచులు కొని విడివిడిగా పెట్టాలి. అప్పుడు అన్నింటినీ కలిపి ఓ పెద్ద పెట్టెలో భద్రపరచుకోవచ్చు.
- పచ్చలు, కెంపులు, ముత్యాలతో చేసిన నగలని చాలా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఇవి రసాయనాల ప్రభావానికి గురయ్యే ఆస్కారం చాలా ఎక్కువ. ముఖ్యంగా తలకి వాడే స్ప్రేలు వీటి అందాన్ని తొందరగా దెబ్బ తీస్తాయి. అందుకని శిరోజాలంకరణ, దుస్తుల అలంకరణ పూర్తయి స్ప్రేలు, పరిమళాలు చల్లుకున్న తర్వాతే నగలు ధరించడం మంచిది.
- పగడాలు, దంతాల నగలని బ్రష్ పెట్టి శుభ్రం చేస్తే గీతలు పడతాయి. అందుకని మెత్తని వస్త్రంతో కానీ, దూదితో కానీ అద్దినట్టుగా శుభ్రం చేయాలి.
- కుళాయి నీటిలో క్లోరిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ నీటితో శుభ్రం చేస్తే వాటి అందం దెబ్బతింటుంది.
- నీలాల నగలని గోరువెచ్చని సబ్బు నీటితో శుభ్రం చేసి ఏమాత్రం ఆలస్యం చేయకుండా పొడిబట్టతో అద్ది తడిలేకుండా చేయాలి. పచ్చలు, జేడ్స్, కనకపుష్యరాగంతో చేసిన నగలని ఈ విధంగానే శుభ్రం చేసుకోవచ్చు.
- ముత్యాలని దారాలతో గుచ్చితే కనుక ఆ దారాన్ని రెండేళ్లకోసారి మార్చడం తప్పనిసరి. ముత్యాల నగలను కచ్చితంగా మెత్తని పాతవస్త్రంలో మాత్రమే చుట్టి భద్రపరచుకోవాలి. లేదంటే మెత్తని మఖ్‌మల్ వస్త్రమైనా ఉపయోగించాలి.



సమానత్వం కలేనా!?



మహిళలను ఆకాశంలో సగమన్నారు. స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని రాజ్యాంగమూ చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులు తరచూ చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం నివేదిక చెబుతోంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేళ్లు నిరీక్షించాలట. అంతేకాదు స్త్రీ, పురుష అసమానతలు గతంతో పోలిస్తే పెరుగుతున్నాయని కూడా డబ్ల్యూఈఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. 2006తో పోల్చి చూసుకుంటే ఈ ఏడాది స్త్రీ, పురుష అసమానతలు పెరిగాయని డబ్ల్యూఈఎఫ్ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య, వైద్య, రాజకీయ రంగాలతో పాటు ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అధ్యయనం చేసిన డబ్ల్యూఈఎఫ్ ఈ నివేదిక తయారుచేసింది.

మగవాళ్లకు ఉన్న అవకాశాల్లో స్త్రీలకు కేవలం 68 శాతం మాత్రమే ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. గతేడాది ఈ సంఖ్య 68.3 శాతంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మహిళలకు సమానత్వం రావాలంటే కనీసం 83 సంవత్సరాలు పడుతుందని 2016లో అంచనా వేశారు. కానీ ఇప్పుడా వ్యత్యాసం మరింతగా పెరిగింది. మహిళల సమానత్వానికి కాస్త అటూ ఇటూగా వందేళ్లు పడుతుందని డబ్ల్యూఈఎఫ్ నివేదిక చెబుతోంది.



స్త్రీ, పురుష సమానత్వంలో బంగ్లాదేశ్ పరిస్థితి కాస్త మెరుగుపడింది. ఈ దేశం 47వ స్థానంలో ఉంది. మహిళలు ఉద్యోగావకాశాలు కల్పించడంలో దక్షిణాసియాలో బంగ్లాదేశ్‌దే అగ్రస్థానం. స్లోవేనియాలో స్త్రీ, పురుష వేతనాల వ్యత్యాసం చాలా తక్కువగా ఉంది. అక్కడ 80.5 శాతం సమాన వేతనాలు, అవకాశాలు అందుకుంటున్నారు.

అయితే విద్య, ఆరోగ్యం విషయంలో మహిళల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంటుంది. కానీ ఆర్థిక, రాజకీయ విషయాలకు వచ్చేసరికి మహిళల భాగస్వామ్యం ఆశించినంతగా మెరుగుపడలేదని తన నివేదిక పేర్కొంది డబ్ల్యూఈఎఫ్. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని ఆందోళనను వ్యక్తం చేసింది. ఉద్యోగాల్లో సమానత్వం రావాలంటే మాత్రం మహిళలు 217 సంవత్సరాలు ఎదురుచూడాలట. అంటే మరో మూడు తరాలు మారాలన్నమాట. అప్పటికి కూడా పరిస్థితులు అనుకూలిస్తేనే.. అలాగే స్త్రీ, పురుష జీతాల విషయంలోనూ విపరీతమైన వ్యత్యాసం ఉందని నివేదిక చెబుతోంది.

ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్ వంటి స్కాండినేవియా దేశాలు స్త్రీ, పురుష సమానత్వంలో ముందంజలో ఉన్నాయి. ఐస్‌లాండ్‌లో స్త్రీ, పురుషులకు దాదాపు సమాన అవకాశాలు ఉన్నాయి. అక్కడ 12 శాతం వ్యత్యాసం మాత్రమే ఉంది. నార్వే, ఫిన్‌లాండ్, స్వీడన్ వంటివి టాప్ ఐదు దేశాల్లో నిలిచాయి. రువాండాలో ప్రతీ ఐదుగురు ఎంపీలో ముగ్గురు మహిళలే ఉన్నారు. నికరాగువా, స్లోవేనియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్ టాప్ 10 ర్యాంకుల్లో నిలిచాయి. మధ్య ప్రాచ్యం, ఉత్తరాఫ్రికాలోని మహిళలు ఎక్కువగా వివక్ష ఎదుర్కొంటున్నారు. సమానత్వం విషయానికి వచ్చేసరికి యెమన్ చాలా వెనుకబడి ఉంది. అక్కడ 52 శాతం మాత్రమే స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం ఉంది.

భారతదేశం స్థానం

- ఇక భారతదేశం విషయానికి వచ్చేసరికి స్త్రీ, పురుష సమానత్వం 21 పాయింట్లు దిగజారి 108వ స్థానానికి పడిపోయింది.
- పొరుగు దేశాలైన చైనా, బంగ్లాదేశ్‌లు కూడా భారతదేశం కంటే మెరుగ్గా ఉన్నాయి.
- మహిళలకు తక్కువ వేతనాలు, ఆర్థిక వ్యవహారాల్లో వారి భాగస్వామ్యం లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా డబ్ల్యూ ఈ ఎఫ్ అంచనా వేసింది. 170 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదికను తయారుచేశారు డబ్ల్యూఈఎఫ్ వారు.
- మహిళలకు గోవా సురక్షిత ప్రాంతమని, బీహార్‌లో స్త్రీలకు రక్షణ తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది.
- మహిళా ఆరోగ్యం విషయంలో కేరళ మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత తమిళనాడు, సిక్కిం, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవా, మహారాష్ట్రలు ఉన్నాయి. ఈ విషయంలో బీహార్ అట్టడుగు స్థానంలో ఉంది.
- విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో మొత్తంగా చూస్తే తెలంగాణ 11వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 12వ స్థానంలో నిలిచాయి.



వేతనాల వ్యత్యాసం

ఒకేపని చేసే స్త్రీ, పురుషుల వేతనాల్లోనూ వ్యత్యాసం ఉంటోందని డబ్ల్యూఈఎఫ్ నివేదిక చెబుతోంది. వేతనాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపిస్తున్నారని పేర్కొంది. మహిళలు చేసే ఇంటిపని, వంటపనికి జీతం ఇవ్వకపోవడం, ఆర్థిక విషయాల్లో వారి భాగస్వామ్యం తగ్గడానికి కారణమని అంచనా వేస్తున్నారు. ప్రజల ఆలోచన విధానం మారాలని, మహిళల పట్ల గౌరవం పెరిగేలా విద్యార్థి దశ నుంచే చర్యలు తీసుకోవాలి. దీనికోసం సామాజిక కార్యకర్తలు కృషి చేయాలి. ఇతర దేశాల్లో ఉన్న పద్ధతులను అధ్యయనం చేసి ఇక్కడ అమలుచేయాలి. అయితే కంపెనీల్లో అత్యున్నత స్థాయి ఉద్యోగాల్లో చాలా అరుదుగా మాత్రమే మహిళలు ఉంటారు. మగవాళ్ల ఆధిపత్యాన్ని ఎదిరించి, అవకాశాలు అందిపుచ్చుకోవడం వారికి కష్టంగా మారుతోందని డబ్ల్యూఈఎఫ్ చెబుతోంది. మరోవైపు మహిళలు అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకెళ్తున్నారని చెబుతున్నవాళ్లూ ఉన్నారు. సమానత్వం కోసం వందేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని ఉమెన్ బాడీ బిల్డర్ కిరణ్ దెంబ్లా అభిప్రాయపడ్డారు. అయితే కొన్ని చోట్ల అసమానతలు ఉండొచ్చని కూడా ఈమె చెబుతోంది.

స్త్రీ, పురుష సమానత్వంలో బంగ్లాదేశ్ పరిస్థితి కాస్త మెరుగుపడింది. ఈ దేశం 47వ స్థానంలో ఉంది. మహిళలు ఉద్యోగావకాశాలు కల్పించడంలో దక్షిణాసియాలో బంగ్లాదేశ్‌దే అగ్రస్థానం. స్లోవేనియాలో స్త్రీ, పురుష వేతనాల వ్యత్యాసం చాలా తక్కువగా ఉంది. అక్కడ 80.5 శాతం సమాన వేతనాలు, అవకాశాలు అందుకుంటున్నారు.

96వ స్థానంలో అమెరికా

రాజకీయాల్లో మహిళా భాగస్వామ్యం విషయంలో అమెరికా గతంలో కంటే కాస్త వెనుకబడింది. మహిళా రాజకీయ సాధికారిత విషయంలో అమెరికా పదేళ్ల కనిష్ట స్థాయికి చేరింది. ఈ విషయంలో అమెరికా 96వ స్థానంలో నిలిచింది. ట్రంప్ పాలనలో మహిళా ఉద్యోగుల సంఖ్య తగ్గిందని గణాంకాలు చెబుతున్నాయి. వారి సంఖ్య 27 శాతం మాత్రమేనని సమాచార హక్కు ద్వారా బయటపడింది. స్త్రీ, పురుష సమానత్వం విషయంలో బ్రిటన్ ఐదు స్థానాలు మెరుగుపడి 15వ స్థానం దక్కించుకుంది. అక్కడి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, స్త్రీ విద్యను ప్రోత్సహించడం వల్ల ఇది సాధ్యమైంది. మహిళా పార్లమెంట్ సభ్యులు కూడా రికార్డు స్థాయిలో ఎన్నికయ్యారు. అయితే ఆర్థిక రంగంలో మహిళల భాగస్వామ్యం విషయంలో మాత్రం బ్రిటన్ కాస్త వెనుకబడే ఉంది. ఆర్థిక అసమానత్వం విషయంలో బ్రిటన్ 95వ స్థానం దక్కించుకుంది. మగవాళ్లతో పోలిస్తే 45 శాతం తక్కువ మంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు. ★

శ్రీనరసింహ శతకము

సీ॥ కాయమెంత భయాన(గాపాడినను గాని
ధాత్రిలోనది చూడ(దక్క(బోదు
నీ వేళ నే రోగ మేమరించునో సత్త్వ
మొందంగ(జేయ నేచందమునను
ఔషధంబులు మంచి ననుభవించిన(గాని
కర్మక్షీణంబైన(గాకవిడదు.
కోటివైద్యులు గుంపుగూడి వచ్చిన(గాని
మరణమయ్యెడి వ్యాధి మాన్పలేరు.
తే॥ జీవుని ప్రయాణకాలంబు సిద్ధమైన
నిలుచునా దేహమిందొక్క నిముషమైన
భూషణవికాస! శ్రీ ధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ ప్రభూ! ఈ శరీరాన్ని ఎంత జాగ్రత్తగా కాపాడినా ఇది స్థిరంగా నిలువదు. ఎప్పుడేరోగం వచ్చి మోసగిస్తుందో? ఎన్నెన్ని మందులు తిన్నా కర్మ తొలగకుండ రోగం నయం కాదు. కోటి వైద్యులు కూడ మరణాంతకమైన వ్యాధిని మాన్పలేరు. ప్రాణం పోయే కాలంలో ఏమి చేసినా బొందిలో అది నిలువదు. ఒక్క క్షణమైనా శరీరం ఆగదు.



46 -గోపరాజు నాగేశ్వరరావు

ఆమె పరుగులంకించుకుంది.
వెంట పడి తరుముతూ పిలుస్తూనే ఉన్నాడు.
పిల్చినకొద్దీ వేగం పెంచి పరుగుతీస్తున్నది.
''శాందినీ...శాందినీ'' అంటూ తరుముతూనే ఉన్నాడు.
ముందు చాంద్నీ... ఆమె వెనుకే రాగ్యా..
ఇద్దరూ పరుగు పందెంలో జయించి తీరాలన్నట్టు పరుగులు తీస్తూనే ఉన్నారు!
అడవి పక్షులు కళ్ళువిప్పార్చి, వింతగా చూస్తున్నాయి.
ఉడుతలూ, కుందేళ్ళూ పొదల్లో నక్కి వాళ్ళనే చూస్తున్నాయి.
అది పరుగు పందెంకాదని, జీవన్మరణ పోరాటం అనీ వాటికి తెలియదు!
''శాందినీ'' అని పిలుస్తూ రాగ్యా క్షణక్షణానికీ దగ్గరికొస్తున్నాడు.
సర్వశక్తులూ కూడగట్టుకొని చాంద్నీ పరుగులు తీస్తూనే ఉంది.
రాగ్యా దగ్గరికొస్తున్నాడు!
ఇప్పుడేం చెయ్యాలి?
రాగ్యానెలా తప్పించుకోవాలి?
ఇంకా లోతట్టు అడవిలోకి వెళ్ళాలి. రాగ్యాకి చిక్కకండా పారిపోవాలి. అడవిలో అదృశ్యం కావాలి!
ఒకవేళ అడవిలో క్రూరమృగాలు తారసపడితే?
రాగ్యానుంచి వచ్చే ప్రమాదంకన్నా, క్రూరమృగాల ప్రమాదం పెద్దదేమీకాదు!
రాగ్యాకి చిక్కితే మానం, మర్యాద పోతాయి.
క్రూర మృగాలకు చిక్కితే కేవలం ప్రాణంపోతుంది!
ఇంకా పరుగువేగం పెంచింది చాంద్నీ..
బాణంలా దూసుకొని పోతోన్నది చాంద్నీ.
లాభం లేదు!
రాగ్యాదగ్గరికొస్తున్నాడు..
క్షణమో- అరక్షణమో!
దగ్గరికొచ్చాడు.. పట్టుకుంటాడు..
ఇక, అరక్షణం కూడా ఆలస్యం లేదు..
రాగ్యా చెయ్యి పట్టుకోపోతే, అతనికా అవకాశం ఇవ్వకుండా ప్రక్కకు దూకింది.
ఓ చెట్టుకొమ్మకి వ్రేలాడుతున్న తేనెపట్టును గాఢంగా కౌగిలించుకుంది!
ఆ హఠాత్సంఘటనకి రాగ్యా విస్తుపోయాడు!
అది అతను ఊహించని పరిణామం!
తేనెటీగలు చాంద్నీ శరీరమ్మీద మూగాయి అప్పటికే!
ములుకులతో ఆమె వొళ్ళంతా తూట్లు పొడుస్తున్నాయి!
శరీరం రక్తంతో తడిసిపోతోన్నది!
ఆమెకప్పుడు ఎంత హాయిగా ఉందో!?
జోగినిగా మారి, కాముకులైన మానవ మృగాలకు శరీరాన్ని అప్పగించి, రసికులకు సుఖాలు అందిస్తూ, నికృష్టంగా బ్రతికేకన్నా, - పవిత్రంగానే యీ భౌతిక దేహం తేనెటీగలకు ఆహుతి కావాలి!
మైల పడకూడదు.

అంతకన్నా హాయి, ఆనందం ఏముంటుంది?
రాగ్యా నిస్సహాయంగా నిలబడి పోయాడు!
అతని కళ్ళవెంట కన్నీళ్ళు ధారాపాతంగా కార్తున్నాయి. ఏమీచెయ్యలేక, చూస్తూ ఉండలేక కుమిలి పోతున్నాడు.
అప్పుడప్పుడూ తేనెటీగలు రాగ్యామీద కూడా దాడిచేస్తున్నాయి.. కసితీరా కుడుతున్నాయి!



చాంద్నీ దగ్గరికే వెళ్ళనివ్వటం లేదు.
చాంద్నీని రక్షించే మార్గమేదీ లేదు!
ప్రాణ సమానమైన చాంద్నీ కళ్ళముందే తేనెటీగల బారినపడి,- శరీరమంతా తూట్లుపడుతూ... రక్తం వోడుతూ.. మాంస ఖండాలు రాలిపడుతూ..
ఎంత దారుణంగా వుందో- ఆ దృశ్యం!

చాంద్నీ బాధతో కనీసం ఆర్తనాదాలు చెయ్యదేం?
రక్షించమని ప్రాధేయపడదేం?
ఒక్క మూలుగైనా మూలగదేం?
నీచం కన్నా మరణం మేలనుకున్నదా చాంద్నీ?
తేనెటీగలకు దూరంగా కూర్చొని, అశ్రునయనాలతో అటువైపే చూస్తూ హృదయ విదారకంగా రాగ్యా ఏడుస్తున్నాడు.
క్షణాలు దొర్లిపోతోన్నాయి. నిమిషాలు గడచిపోతోన్నాయి..
మంచివాడి మనసులా కాలం కరిగిపోతోన్నది!

⁂

ఎమ్మెల్లే, గరుడాచలం గుడారంలోనే ఉన్నారు.
వాళ్ళకి రక్షణగా కొంతమంది అక్కడే వుండి, మిగిలిన వాళ్ళంతా నల్లకొండ దగ్గరికి వెళ్ళారు.
అక్కడ ఏం జరుగుతున్నదో వార్తలు అందుతున్నా వాళ్ళకింకా తృప్తి తీరటం లేదు.
అక్కడికి వెళ్ళి స్వయంగా అన్నీ పరిశీలించాలని వుంది!
కానీ, సెక్యూరిటీ దృష్టిలో వుంచుకొని ఆగారు.
ఎమ్మెల్లే విషయం ఎలావున్నా, గరుడాచలం మనసంతా కొండ దగ్గరే వుంది! ఆలోచనలతో సతమతమౌతున్నాడు!!
కానిస్టేబులు కనకయ్య బాగా నటించాడా?
అతనికి దేవర పూనాడంటే జనం నమ్మారా?
చాందినీని జోగిన్ని చెయ్యటానికి ఒప్పుకున్నారా?
రాగ్యా ఏమంటున్నాడో?
అత్యాశకుపోయాడు! చాంద్నీ అతనికే స్వంతం కావాలనుకున్నాడు. అందుకోసం వెంపర్లాడాడు.
ఆ వెంపర్లాటలో స్థాయి మరచిపోయి పెద్దవాళ్ళతో చేతులు కలిపాడు. చెప్పిందిచేశాడు.. తనవంతు పాత్ర పోషించి సహకరించాడు.
చాంద్నీని జోగిన్ని చెయ్యాలంటే ఒద్దన్లేదు రాగ్యా!
అది వాడి తప్పేకదా!
ప్రణాళిక సిద్ధంచేసి, ఎమ్మెల్లే సహకారం పొంది, కర్చుకూ శ్రమకూ ఓర్చి, దాన్ని జోగిన్ని చెయ్యటం రాగ్యాకి అప్పగించటానికా?
కన్నెరికం వాడుపెట్టి, ఎంగిలిపడ్డ చాంద్నీని అనుభవించటానికి పిచ్చివాడ్నికాదు!
పైగా, దానికి ఇవ్వాల్సిన బంగారం, బట్టలు, డబ్బు- అంతాతనే ఇచ్చాడు!
ఇతరుల డబ్బుతో సుఖాలు పొందాలనుకోవటం రాగ్యా తప్పుకాదూ?
పాపం-
రాగ్యాగాడు ఖంగుతిని ఉంటాడు!
గరుడాచలం కన్నెరికం పెట్టాలని దేవర పూనకంలో వున్న కనకయ్య అడవి పుత్రులకు చెప్పగానే రగిలిపోయి ఉంటాడు!
జరిగిన మోసం తెలుసుకొని ఏమీచెయ్యలేక, చాందినీని వొదులుకోలేక, సతమతమయ్యుంటాడు!
ఏం చేస్తున్నాడో? ఎక్కడున్నాడో రాగ్యా?
జాలివేస్తున్నది.
జాలి పడకూడదనీ అనిపిస్తున్నది!
గరుడాచలం ఉన్నట్టుండి పెద్దగా నవ్వాడు.
''ఎందుకలా నవ్వావు'' ఎమ్మెల్లే అడిగాడు.
''రాగ్యా గుర్తొచ్చి.''
''వాడొచ్చి, నాకు ఫిర్యాదుచేస్తే ఏంచేస్తానో తెలుసా?''
''తెలుసు''అన్నాడు గరుడాచలం నవ్వుతూ.
''ఏం తెలుసు.''
''తీవ్రంగా ఖండిస్తావు.''
''అంతేనా''.
''విచారణకి కమిటీ వేస్తావు.''

(ఇంకా ఉంది)

రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు.అన్ని విధాలా సుఖాన్ని పొందుతారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. వృధా ప్రయాణాలెక్కువవుతాయి. ధనవ్యయం తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుండును. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి వుంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. అన్ని విషయాల్లో విజయాన్ని సాధిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్ర్తీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. కొన్ని జటిలమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
అకాల భోజనాదులవల్ల అనారోగ్యమేర్పడుతుంది. పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. క్రొత్త పనులు ప్రారంభించరాదు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమవుతుంది. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్ర్తీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది. రహస్య శత్రువుల పట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. ఏ విషయంలోనూ నిరుత్సాహం పనికిరాదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

మాటాట — నిర్వహణ: సుధామ — 1856

1	■	■	2	3		4
5		6	■		■	
	■	7		■	■	
■	8		■	9		
10		■	11			
	■	12			■	■
13			■	14		

ఆధారాలు

అడ్డం
2. ఇది కరువైన కనులెందుకు?
5. పర్యాయము, మాటు
7. హారము
8. చెండు
9. ఉప్పు
10. వేగము
11. రాట వంటిదే!
13. ఇంటి వాకిలి పసుపు కుంకుమలద్దే భాగం
14. అటుగా హిందీలో విందు

నిలువు
1. మెడల్
3. ప్రశంస
4. సైజ్, కొలత
6. పుకారు
8. శకటము
9. లాలా.. రాయ్!
10. పంక్తి, క్రమము
11. పొడివంటిది
12. నడక

మాటాట-1855 సమాధానాలు

అడ్డం	అడ్డం	నిలువు	నిలువు
1. వివాహం	9. గుంటూరు	1. వివాదం	8. ముబు
2. శుభము	10. బురఖా	3. మునుపు	9. గుండిగ
5. దంతి	13. గణతంత్రం	4. సమంత	11. ఖారచ
6. కైపు	14. అంచ	7. చూరు	12. పొత్రం
7. చూతము	★		

మూడు తరాల కాలానికి నిలిచిన కథలు

పఠనీయం

గీతోపదేశం కథలు- రచన: డి.కామేశ్వరి, వెల:రూ.150/-, ప్రతులకు: నవోదయ, నవచేతన విశాలాంధ్ర మరియు తెలుగు బుక్ హౌస్, హైదరాబాద్.

నిన్నటి తరం రచయిత్రులలో శ్రీమతి డి (దూర్వాసుల)కామేశ్వరి గారు ఒకరు. కాలపు వెల్లువలో కొట్టుకునిపోకుండా, కాలానికి అనుగుణంగా, తనను తాను మలుచుకుంటూ, 83 ఏళ్ళ వయసులో కూడా, ఇంకను ప్రజ్ఞాపూరితమైన కథలను రాస్తున్నారు.

'గీతోపదేశం' అనే ఈ కథల సంచికలో 17 కథలున్నాయి. వీటిలో కొన్ని అర్ధ శతాబ్దపు పాతవి కాగా, మరికొన్ని ఇటీవలే రాసినవి ఉన్నాయి. బి.ఏ పాసయ్యి, ఆనాటి బెల్‌బాటం పేంట్లు ధరించి, తండ్రి తెబోయే ఆరడుగుల ఆరపాదదళాయతాక్షుడి సంబంధం గురించి కలలుకంటూ కాలం వెళ్ళబుచ్చే రుక్మిణులున్నారు ఈ కథల్లో (ఇది జీవితం!). నిన్న మొన్న వచ్చిన సెల్‌ఫోనులు (ఆదిశక్తి) కనిపిస్తాయి. ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న ఓల్డ్ ఏజ్ హోంలు ఉన్నాయి (విలువలు మారాయి). ఆనాడే స్ర్తీకి ఆర్థిక స్వాతంత్ర్యం అమూల్యం అని చెప్పటం (ఇదీ జీవితం), నేడు మన ప్రధానమంత్రి మోదీగారు ప్రబోధించే స్వచ్ఛభారత్ ఆవశ్యకతను 25 ఏళ్ళ క్రిందటే ఈ రచయిత్రి కలలు కనటం (ఈ దేశమే గతి బాగుపడునోయ్) గమనించిన పాఠకుడు అబ్బురపడకుండా ఉండలేడు.

కథల్లో కనిపించే పాత్రలు, జీవితాలు-చాలామటుకు మధ్య తరగతి మనుషులవే అయివుంటాయి. సీతమ్మ లాంటి (తానొకటి తలచిన...) నుంచి మనసు గలవారే అయి ఉంటారు. ఇంతేకాదు- 'విలువలు మారాయి' కథలో కనిపించే రాజేశ్వరమ్మ లాంటివారు అయి ఉంటారు. భార్యాభర్తలు ఉద్యోగం చేస్తే తప్ప గడవని ప్రస్తుత సమాజంలో అగ్గిపెట్టెల్లాంటి ఇరుకు ఫ్లాట్ల జీవితం అయ్యాక రాజేశ్వరమ్మ గారి లాంటి సీనియర్ సిటిజన్‌లకు 'హాయిగా విశాలంగా శుభ్రమైన గాలి వెలుతురు, అన్ని సదుపాయాలుండే' వృద్ధాశ్రమాలే మెరుగు (విలువలు మారాయి) అని చెప్పించటం రచయిత్రి సమకాలీన దృక్పథానికి అద్దంపడుతుంది. కాలానికి ఎదురీదకుండా, కాలం పాటు నడవమని ఉద్బోధించే రచయిత్రి కామేశ్వరిగారు ఎంతో అభినందనీయులు.

నేటి పాఠకుడికి, ఆనాటి జీవితం తాత్త్వికత, ఆలోచనా సరళిని, ఈనాటి ఉరుకుల పరుగుల జీవితాలతో పోల్చి చూపుతూ, పాఠకుడినే కంపేర్ చేసుకొమ్మనటం- ఇంకా మారని పోలీసు వ్యవస్థ, రాజకీయాలపై (దుష్టరక్షణ) తన నిరసనను ప్రకటించటంవల్ల రచయిత్రికి మానవ జాతిమీదున్న ప్రేమ, అసహాయులపట్ల సానుభూతి ద్యోతకమవుతుంది. స్ర్తీ కేంద్రకంగా రాయబడ్డ కథల వెనుక రచయిత్రికిగల సామాజిక బాధ్యతను పాఠకుడికి తెలియజేస్తాయి. వందే ఏళ్ళు గడిచినా, స్ర్తీ ఎంత ఎదిగినా పురుషుడితో సమానం కాలేదని- ఇందుకు కారణం 'స్ర్తీ పురుష శరీర నిర్మాణాలు, శారీరక ధర్మాలు వేరువేరు కావటంవల్ల' అంటూ, 'అరిటాకు ముల్లు సామెత ఎప్పటికీమారదు' అని కంక్లూడ్ చేస్తూ 'గీతోపదేశం వింటే బాగుపడేవారే కాని చెడిపోయేవారుండరు' (గీతోపదేశం) అనటం బావుంది.

సుమారు అరవయియేళ్ళ తన రచనా కాలంలోని కథల్లోంచి ఏర్చి కూర్చిన కథలు. ఒకరకంగా చెప్పాలంటే కామేశ్వరిగారి మొత్తం రచనల సారాంశం ఇది.

'ప్రవాహం వెంట సాగిపోవాలి' - చేసే పనిలో నిజాయితీ వుంటే ఎవరేమన్నా పట్టించుకోనక్కరలేదు, 'ఆడపిల్లలకి తల్లి ఉన్నన్ని రోజులే పుట్టిల్లు', 'వివాహబంధం లేని ఆడదాన్ని ఏ మగాడూ శాశ్వతంగా భరించడు', 'ఆడది కోరుకునేది ఇంట్లో చోటు కాదు గుండెల్లో స్థానం' లాంటి వాక్యాలు నేటి తరానికి కొంచెం కొరుకుడు పడకున్నా, కాచివడపోసిన కాలానికి తట్టుకుని నిలిచిన సత్యాలు. 30ఏళ్ళకు 'ఒకే తరం'గా లెక్కిస్తారు. మూడు తరాలకు ప్రాతినిధ్య కథలివి.

-కూర చిదంబరం
8639338675

శ్రీపాద సుబ్రహ్మణ్యా శాస్త్రి కథలు

వినమరుగైన..

శ్రీపాద సుబ్రహ్మణ్యాశాస్త్రి

వీరాజీ

"ఆ వూరు రైతాంగం అంతా కమ్మవారు. రెండొందలు పైగా వుంటుంది గడప. ఊరిపెత్తనం వారిదే". తతిమ్మా కులాల వాళ్లు శెట్టి బలిజలు, కలారీలు కొప్పు వెలమలు, చాకళ్లూ, మంగళ్లూ.. బాగా తక్కువేగాని మాదిగపల్లెలో యాభైదాకా వున్నాయి కొంపలు.

అది ఎప్పుడు, ఎందుకు అలా తటస్థించిందో కాని ముప్ఫయి తొమ్మిదిమంది 'మహమ్మదీయులు' కూడా వున్నారా వూళ్లో. కానీ క్రైస్తవులుగా మతం మార్చుకున్నా దళితులైనవారికి వేర్పాటు తప్పలేదు. అయితే హిందువులు, ముస్లిం మతం తీసుకుంటే వాళ్లు సవర్ణులతో అలాగే బ్రాహ్మల మధ్య భుజం భుజం రాసుకుంటూ తిరుగుతున్నారు వూళ్లో. " హిందువులుగా వున్నపుడూ బ్రాహ్మణుడూ, క్షత్రియుడూ, వైశ్యుడూ, శూద్రుడు, చాకలి, మంగలి, మాల మాదిగ యిలా వేరే వేరయి పోయి వుండిన వారందరూ ఇస్లాం మతం పుచ్చుకోగానే ఒక్కటే అయిపోయారు.

నవాబూ -గరీబూ, పాచ్చా -ఫకీరూ- భేదాల టుంచి బతుకంతా వాళ్లది ఒకటే, జాతి ఒకటే-ఎందుకనీ? ఇలా అడుగుతూ అంచేత హిందువులలో వర్ణభేదం, దళిత భేదం వుండరాదు అంటాడు శాస్త్రిగారు. ఆ కథలో యిదంతా అరటి పండు వొలిచి చేతబెట్టినట్లుచెప్పుకొస్తాడు. ప్రతి పాత్ర సానబెట్టిన రత్నం. సవర్ణులు, దళితులు అంతా ఏకం అయిననాడే మనకి జాతీయత - "జాతి ప్రతిపత్తి అన్న ప్రతిపాదనను తన కథల్లో పాలల్లో చక్కెర కలిపినంత తియ్యగా, మందుమాత్ర చుట్టూ చక్కెరపొర వేసినంతగా చక్కగా చెప్పుతాడు. ఆ తీరు, మహానుభావుడుగాన, ఆయనకే చెల్లు. ఆయన కథల్లో నాకు అపారంగా నచ్చిన మరొక కథ-1948లో వారు రాసిన కొత్త చూపు. అది నేటికీ, రేపటికీ కూడా మనకు కొత్తచూపు. కొత్త మాట ప్రసాదించే అద్భుతమైన కథ. అందులో కట్నంతో చేసుకునే పెళ్లికి నిరాకరించిన ఒక విద్యావతి 'అన్నపూర్ణ'కి తండ్రి యిచ్చే ప్రోత్సాహం రచయిత ఆవిష్కరించిన తీరు మన నరాల్లో కొత్త నెత్తురై ప్రవహిస్తుంది. అందులోనుంచి కొన్ని వాక్యాలుటంకించి మహామేరువు అయిన శాస్త్రిగారిని యీ కొద్ది సమయంలో కొలవలేకపోయినా ఆయన్ని గొప్ప కథకునిగా కొలుస్తూ శలవు తీసుకుంటాను.

'బ్రతికున్నంతకాలమూ జీవితంలో స్ర్తీలు తమతో సహకరించుకోవాలంటే యువకులిప్పుడు గడించుకోవలసిన యోగ్యతలు. శౌర్య, బల పరాక్రమాలు, తెగబడి యుద్ధం చేసే ధైర్యం. ఆడపిల్ల తండ్రి అయిన రామశాస్త్రిగారి మాటలే యివి కూడా. ఏదైనా విద్యలో ప్రజ్ఞకలవాళ్లు ఏమన్నా అదో అందం కానీ, పప్పుభొట్లు పండితులు ధర్మశాస్త్రాలు విడగొడితే ఎలాగ భరించడం? ఇంతకీ అగ్రహారం అంతటిలోనూ ఆడపిల్లని యింగ్లీషు చదువులో పెట్టింది నేను. రజస్వల అయితేగాని పెళ్లి చెయ్యనని అట్టేపెట్టేసిన మొదటివాణ్ని నేనే అంటాటా రామశాస్త్రి.

ఇక శాస్త్రిగారి అమ్మాయి అన్నపూర్ణ గురించి ఆయన మాటల్లోనే ఇంగ్లీషు ఉద్గ్రంధాలు అనేకం చదవటంవల్లా, ఖండాంతర ప్రఖ్యాత పత్రికలు ఎప్పుడూ చూస్తుండటంవల్లా మా అమ్మాయికి కొత్త దృక్పథం ఏర్పడింది. ఖండాంతర ఫిలిములు దాన్ని పోషించాయి.

ఇలా అటు సంప్రదాయ, వేదాల సారాన్నీ యిటు ఆధునిక పోకడల రీతిని రెండింటిని సమన్వయిస్తూ నవీన దృక్పథానికి పరమావధిని యీ కొత్త చూపు పెద్ద కథలో చూపెట్టారు శ్రీపాదవారు! స్వతంత్రంవచ్చిన మరుసటి సంవత్సరంలో 1948లో రాసిన యీ కథలో కొంత నాటకీయంగాను, మరికొంత సినిమా ఫక్కీలోనూ విశదీకరిస్తారు వారు.

చివరగా గుర్రప్పందాలు అన్న కథ కూడా నేటికీ సరిపడేలాగా ఉద్యోగాలను, ఇంటర్వ్యూలను ఒక ఫార్సు రూపంలో ఎండగడుతుంది. శాస్త్రిగారి కథలు చిన్న కథలా? కథానికలా? పెద్ద కథలా? నవలికలా? లాంటి మీమాంస వదలిపెట్టి వారి కథల ద్వారా నాటి సమాజ పరిణితిని విశ్లేషించి, పరిశోధించినట్లయితే ఒక్కో కథ మీద ఒక్కో థీసిస్సు తయారయిముందు తరాలకు కరదీపికా, కార్యప్రణాళికా కూడా కాగలవు.

శిథిలం కాని అక్షరం శిల్పాలయినవి. అందులోనూ సజీవమయిన శిల్పాలవి! శాశ్వతాలవి! కథలలో కొత్త చూపు కథనంలో ఒక కొత్త వూపూ- తెనుగు జాతి గర్వించదగ్గ తెనుగు కథామూర్తి ఆయన!

- సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

పరమాత్మునికి 'జ్ఞాని' అంటే ప్రీతా?

హిందూ ధర్మ శాస్త్రాలు

హిందూ ధర్మశాస్త్రాల గురించి ఉన్న కొన్ని దురభిప్రాయాలను, అపార్థాలను పరీక్షిద్దాం. వాటి సమస్యలపై కేంద్రీకరించడానికి వాటిని గురించి ప్రశ్నలు - జవాబులు రూపంలో దృష్టిసారిద్దాం.

ప్రశ్న : అర్జునుడు యుద్ధానికి సిద్ధంగా లేనని వ్యక్తం చేసినప్పుడు శ్రీ కృష్ణుడు అర్జునుని యుద్ధం చేయమని ఎందుకు ప్రోత్సహించాడు?

ప్రొఫెసర్ డి.నికొలస్ ఎంతో సొంపుగా వివరించినట్లు యుద్ధం చేయడమా లేక మానడమా అనేది ఇక్కడ ప్రశ్న కాదు. ఒక వేళ అర్జునుడు యుద్ధ భూమిని పరిత్యజిస్తే, అతడు ఆధ్యాత్మికంగానే కాక ప్రాపంచిక దృష్టికోణం నుంచి అనగా సామాజిక మరియు వ్యక్తిగత దృష్టికోణంలో కూడా విఫలమయ్యేవాడు. అతడు

హిందూమత దివ్యత్వం



డా॥ గరికపాటి ఆనంద్
9966059562

4

తన క్షత్రియ ధర్మం అనగా ఫలాపేక్ష రహితంగా ప్రవర్తించకపోవడము మరియు యుద్ధానికి భయపడకుండా ఉండటం నిరూపించుకోవడంలో విఫలమయ్యేవాడు.

ప్రశ్న: కర్మ చేయకుండా ఉండటం కన్నా కర్మ చేయడము మేలా ?

ప్రత్యర్థి పక్షం యుద్ధం గెలిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో వివరించి శ్రీకృష్ణుడు అర్జునున్ని కర్మ చేయటం యుక్తమని నమ్మిస్తాడు. ప్రొఫెసర్ డి.నికొలస్ మాటల్లో "మనల్ని మనం విధి, యాదృచ్ఛిక నిరాశలపాలు చేసుకుంటున్న మనం ఎటువంటి మనుష్యులం?"

ప్రశ్న: పరమాత్మునికి అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తి ఎవరు?

"వేదాలను వల్లించే బ్రాహ్మణుని కంటే ప్రతి ప్రాణిని సమానంగా చూచే 'జ్ఞాని' పరమాత్మునికి అత్యంత ప్రీతి" అని కృష్ణ భగవానుడి ఉవాచ. జగద్గురు శంకరాచార్య పైన చెప్పిన విషక్ష్మి సారాన్ని ఆయన రచించిన భజగోవిందం అని పిలవబడే కీర్తనల ద్వారా తెలిపారు. మొదటి కీర్తనని అనువదిస్తే ఈ క్రింది విధముగా ఉంటుంది.

"భజ గోవిందం భజ గోవిందం భజ మూఢమతే,
సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృన్ కరణే" !

గోవిందుడిని భజించు, గోవిందుడిని భజించు, గోవిందుడిని భజించుము ఓ మూర్ఖుడా. మరణమాసన్నమైనప్పుడు నిన్ను ఏ వ్యాకరణ పాఠం రక్షించదు. భక్త ప్రహ్లాదుడు జ్ఞానికి నిదర్శనముగా నిలిచాడు. నిర్జీవమైన స్తంభంలో శ్రీ మహా విష్ణువును చూపమని అతని తండ్రి సవాలు చేసినప్పుడు ప్రహ్లాదుడు వెంటనే ఒప్పుకుంటాడు. అతని తండ్రి రాక్షసరాజైన హిరణ్యకశిపుడు ఆగ్రహంతో స్తంభాన్ని పగులగొట్టినప్పుడు నరసింహుని రూపంలో శ్రీ మహా విష్ణువు స్తంభం నుంచి వెలువడటం చూస్తాడు.

ప్రశ్న: జ్ఞాని శ్రీ కృష్ణునికి అంత ప్రియమైతే అతను ఎలా ప్రార్థిస్తాడు ?

అన్ని ప్రాణులు తన నుంచి ఎలా ఉద్భవించాయో శ్రీ కృష్ణుడు అర్జునునికి వివరంగా చెప్తాడు. జ్ఞాని భగవంతుడిని అన్ని ప్రాణులలోనూ అన్ని చోట్లా చూడగలడు. కనుక భగవంతుని దర్శించడానికి అతను దేవాలయానికి వెళ్ళవలసిన అవసరం లేదు. అదే విధముగా జ్ఞాని ఎల్లప్పుడూ భగవంతుని ఆలోచనల్లో ఉంటాడు. జగద్గురు శంకరాచార్యులు నిజమైన ఆధ్యాత్మికత గురించి భజ గోవిందంలోని ఒక అద్భుతమైన శ్లోకంలో విస్తారముగా చెప్పారు.

యోగరతోవ భోగరతోవ
సంగరతోవ, సంగవిహీన:
యస్య బ్రహ్మణి రమతే చిత్తం
నందతి నందతి నందత్యేవ !

ఆధ్యాత్మిక ఉద్ధారణకై యోగాలో లీనమయినప్పుడు లేక భౌతిక కార్యకలాపాలలో గానీ సౌఖ్యాలలో గానీ మునిగి తేలుతున్నప్పుడు లేక నీవు ఒంటరిగా ఉన్నా లేక స్నేహితులు చుట్టూ ఉన్నాగాని, ఎప్పుడైతే నీ మనస్సు భగవంతుని ఉనికి యొక్క ఆధ్యాత్మిక భావంపై కేంద్రీకృతం చేస్తావో, అప్పుడు నిన్ను నీవు సంతోషంగా మరియు పరమానందంతో ఉన్నట్లు కనుగొంటావు. నిజమైన ఆధ్యాత్మికతకి మరియు రాజకీయాల మధ్య తేడాని మొత్తం విస్తృత ప్రపంచానికి తెలియజేస్తోంది.

అందుకే శంకరాచార్యులు "జగద్గురు" లేక "సార్వత్రికోత్తమ ఆధ్యాత్మిక మహా గురువు" అని పిలువబడ్డారు.

జగద్గురు శంకరాచార్య "అహం బ్రమ్మాస్మి" అని ప్రకటించినప్పుడు, శ్రీ కృష్ణుడు అర్జునుడికి వివరించి చెప్పినట్లుగా, అతను తన నిజమైన స్వభావమును, శారీరకంగా మరియు ఆత్మలోనూ ప్రపంచానికి చూపించాడు. శ్రీ కృష్ణుడు తనను తాను సృష్టికర్తగా ప్రకటించాడు.

ఆధ్యాత్మికత మరియు మత యుద్ధాల నినాదాల మధ్య వైరుధ్యం అర్థం చేసుకోవడానికి తోడ్పడేటందుకు, ఒక విలువైన వజ్రాన్ని తన శిఖరం పైన కలిగిన ఒక ఎత్తైన చెట్టును లేదా ఒక నిటారుగా ఉన్న పర్వతాన్ని ఊహించుకోండి.

ఎక్కడానికి మద్దతునిచ్చే చెట్టు కొమ్మలు లేదా రాళ్ళు చాలా బలంగా ఉండాలి. లేదా మనం పడిపోవడం తథ్యం.

అటువంటి మెట్లు లేకపోవటం, చాలా ప్రధాన విశ్వాసాలలో ఉన్న దురదృష్టకరమైన నిజం.

ప్రశ్న : అతి క్లిష్ట సమయాలలో స్థితప్రజ్ఞత కలిగియుండటం సాధ్యమా?

దుర్యోధనుడు మరియు అర్జునుడు యుద్ధంలో సహాయాన్ని అపేక్షిస్తూ ఇద్దరు కృష్ణుని దగ్గరికి వెళ్తారు. కానీ దుర్యోధనుడు మొదట చేరుతాడు. అప్పుడు కృష్ణుడు నిద్రిస్తున్నాడు. కృష్ణుని మేల్కొలపకూడదని దుర్యోధనుడు కృష్ణుని పడకకు తల వైపున కూర్చుంటాడు. ఎందుకనగా అతని దృష్టిలో రాజు గొప్పతనానికి తగినట్లుండాలి కదా! కొంత సేపు తరువాత అర్జునుడు అక్కడికి వచ్చి కృష్ణుని కాళ్ళకు దగ్గరగా కూర్చుంటాడు.

నిద్ర లేవగానే కృష్ణుడు మొదట అర్జునుని చూచి పలకరించిన తరువాత దుర్యోధనుని చూచి పలకరిస్తాడు. అర్జునుని కన్నా తానే ముందు వచ్చాడు. కాబట్టి సహాయాన్ని అపేక్షించే అవకాశం తనకే ముందర యివ్వాలని దుర్యోధనుడు అంటాడు. కృష్ణుడు ఆయుధం ధరించని తానొక వైపు మరియు సశక్తమైన తన సేన మరొక వైపు ఉండేలా భాగించి దుర్యోధనుడుని రెండింటిలో ఒకవైపు ఎంచుకోమంటాడు. దుర్యోధనుడు ఆనందంగా సేననే కోరుకోగా అర్జునుడు తన కొరకు తన ప్రమేయం లేకుండా చేయబడిన ఎంపికకి సంతోషిస్తాడు.

అసలు దుర్యోధనునికి కృష్ణుడు సహాయం ఎందుకు చేయాలి? అధర్మవర్తనునికి సహాయ పడటం ధర్మం కాదని నిరాకరించి యుండవచ్చు. ఇది అర్థం చేసుకోవాలంటే న్యాయ స్థానాన్ని ఊహించుకోవాలి. నిందితునికి సైతం తనను పరిరక్షించుకోవాలంటే తన వైపు సాక్ష్యులను న్యాయ స్థానంలో హాజరుపరచేందుకు అనుమతి ఉంటుంది. తుది తీర్పు వచ్చే వరకు అతనికి కావలసినది మరియు అవసరమైన సహాయ సదుపాయాలు అందివ్వాలి. కృష్ణుడు అదే చేశాడు.

న్యాయ స్థాన సంఘ పద్ధతిలో న్యాయాధీశుడు జరిగే విచారణను పర్యవేక్షిస్తారు. కానీ తీర్పు మాత్రం న్యాయ స్థాన సంఘ సభ్యులు ప్రకటిస్తారు. అది సామాన్య పౌరులతో కూడి నిందితునికిగాని, బాధితునికి గాని ఎటువంటి సంబంధం లేని నిష్పక్షపాత ధర్మ నిర్ణయం చేయడానికి ప్రమాణం చేసి నియమింపబడిన పౌర సముదాయము. బాధితుడైన అర్జునుని ఫలాపేక్ష లేకుండా వ్యవహరించమని అడగడం బాధితుడు లాగా లేక భావావేశం కలిగిన వ్యక్తి లాగా కాకుండా న్యాయ స్థాన సంఘంలా వ్యవహరించమనడంతో సమానం.

ఇంకావుంది...

మార్జాల మూషిక సంవాదము



110 మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

ఇక ఇతరులను ఏమి ఉపయోగపడతాడు? కనుక చపలుడు ఇతరుల పనులు చెడగొడతాడు.

కారణం లేని ప్రీతి కనబడదు. కారణం వల్లనే ప్రీతి ఏర్పడుతుంది. మన ఇద్దరి మధ్య కూడా అలాంటి ప్రీతి ఏర్పడింది. మరో కారణంతో మొదటి కారణం



నీకు సహాయం చేశాను కనుక ఆప్తుడను అయ్యాను. ప్రతీదానికి ఏదో కారణముంటుంది. దానివలన హితులు కాని అహితులు కాని అవుతారు.

ఈ లోకమంతా ప్రయోజనాన్ని కోరుతుంది. ఎవరూ ఎవరికీ సహజంగా ఇష్టులు కారు. అన్నదమ్ముల మధ్య, దంపతుల మధ్య ఉండే స్నేహభావం ఇలాంటిదే. ఈ లోకంలో ఎక్కడా పోతుంది. అందులోను నేను నీకు ఆహారాన్ని. నీవు సమర్థుడివి. కాని కాలం కలిసిరాక నాతో స్నేహం చేశావు. కనుక నా హితం నేను కోరుతాను. ఇంతకు ముందు నీవు నాకు శత్రువువు. ఇప్పుడు స్నేహితుడివి అయ్యావు. మళ్లీ కొంతకాలానికి శత్రువువు. నేను కూడా అంతే. మన మధ్య సహజ శత్రుత్వమే శాశ్వతం. అన్యోన్య సహాయం అయిపోయింది కనుక మన కలయిక ఉండదు".

ఎలుక ఇంకా ఇలా అంది "నీ ప్రయోజనం నీవు పొందావు. నాది నేను పొందాను. ఇక నాతో నీకు ఏమి పని? నన్ను మ్రింగడం తప్పు! మనం ఇద్దరం సమాన బలవంతులం కానప్పుడు మన మధ్య సంధి ఎలా పొసగుతుంది? నీవు ఉపాయంతో నన్ను తినాలని చూస్తున్నావు. కనుక నాతో సంధి కుదరదు. నీవు తినకపోయినా, నీతో కలిసి ఉంటే నీవారు నన్ను తినకుండా ఎలా ఉంటారు? దుష్టుడయిన శత్రువు ఆకలిగా ఉండి ఆహారం వెతుకుతూ ఉంటే తెలివైనవాడు వానిదగ్గరకు వెళతాడా? లోమశా! నేను నీతో కలవను. నా ధనం అంతా కావాలంటే ఇస్తాను. కాని నన్ను నేను అర్పించను. భార్యా, సంపదా ఇచ్చి అయినా తన్ను తాను రక్షించుకోవాలి. ఆలోచించి పనులు చేసేవారికి ఆపదలు కలుగవు" ఇలా ఎలుక గట్టిగా మాట్లాడగా పిల్లి సిగ్గుపడి ఇలా అంది.

"నేను ఒట్టువేసి చెప్తున్నాను. నీవు నన్ను మిత్రద్రోహి అని నిందించావు. నా గురించి ఇంకో విధంగా ఆలోచించకు. నువ్వు నాకు ప్రాణదానాన్ని చేశావు. కనుక నాకు నీ పట్ల కృతజ్ఞత. నాకు మిత్రులపై ప్రేమ కలదు. నీవు కూడా నాపట్ల అదే భావంతో ఉండు. నువ్వు నన్ను అనుమానించకు".

ఎలుక చాలా గంభీరంగా ఇలా అంది. "నీ మాట విన్నాను. నీ మీద నాకు ప్రేమ ఉంది. కాని కార్యం ముగిసిన తర్వాత బలవంతుడైన శత్రువుతో సంధి చేసుకుంటే ఉపాయంతో మెలగాలి. ఇతరులకు నమ్మకం కలిగించాలి. కాని ఇతరులను నమ్మకూడదు. అందువల్ల తన జీవితాన్ని తానే స్వయంగా రక్షించుకోవాలి. బ్రతికి ఉంటే ఏ సంపదలనైనా సమకూర్చుకోవచ్చు. ఓ మార్జాలమా! నన్ను నేను సర్వదా నీవంటి వారి నుండి రక్షించుకోవాలి. అలాగే నువ్వు కూడా పాపాలు చేసే ఛండాలుని నుండి కాపాడుకో" ఇలా చెప్పి ఎలుక కన్నంలోకి దూరిపోయింది. పిల్లి కొమ్మ మీద నుంచి పారిపోయింది. ఎలుక, పిల్లి ఈ విధంగా ఒకదానినొకటి ఆశ్రయించుకొని ఆపద నుండి బయటపడ్డాయి. కనుక కాలానుగుణంగా శత్రువుతో సంధిని మిత్రునితో వైరమూ చెయ్యాలి. ఇదే నీతిశాస్త్రజ్ఞులు చెప్పిన ధర్మము.

-ఇంకావుంది

పరమహంస బోధామృతము



ఎంతవఱకు అట్టియుత్తరముయొక్క అవసరము? దానిలోని సంగతులను తెలిసికొనువఱకే గదా! సంగతులు తెలిసినతోడనే కావలసిన వస్తువులను గొనుటకై ప్రయత్నించుటయే అతడు చేయవలసిన పని. అదే తీరున భగవత్ప్రాప్తిని బొందు మార్గమును, అనగా సాక్షాత్కారమునకు వలయు సాధనలను శాస్త్రములు మనకు దెలుపును. అంతే వాని పని. మార్గము తెలిసిన పిమ్మట మనము చేయవలసిన పని గమ్యమును జేరుటకు వలయు సాధనయే. సాక్షాత్కారమే మన గమ్యము.

160. దేనిసాయమున మనము భగవంతుని దెలిసి కొందుమో అదియే బ్రహ్మవిద్య. కేవల శాస్త్రములు, వేదాంతము, తర్కము, వ్యాకరణము మొదలగునవన్నియు మనస్సును కలవరపఱుచునట్టివి. గ్రంథములు ప్రాయికముగా గ్రంథులు (ముడులు). బ్రహ్మజ్ఞానమునకు సాధనభూతమైనంతవఱకే వానియొక్క ప్రయోజనము.

161. పుస్తకములు చదివిననేకాని బ్రహ్మజ్ఞానము కలుగదని భావింపరాదు. చదువుటకంటె వినుట మేలు, వినుటకంటె విశేషము సాక్షాత్కారము. గ్రంథములను ఊరక చదువుటకంటె గురుముఖమున తత్త్వమును వినుటచే మనస్సున బాగుగా నాటుకొనుచు; సాక్షాత్కారము చేతనో, తత్త్వజ్ఞానము స్థిరపడును. కాశీనగరమును గుఱించి పుస్తకములలో జదువుటకంటె దానిని స్వయముగా జూచిన వానినోట వినుట మేలు, కాని తనయంత తానే చూచుట సర్వోత్తమముగదా!

162. ఆత్మజ్ఞానము ఇరు తెఱగులవారికి అలవడును- ఎవరి మనస్సు పాండిత్యపు గందరగోళములోనికి దిగకుండునో లేక ఎరవు తెచ్చుకొనిన భావములతో పూడిపోకుండునో వారికిని, సమస్త వేద వేదాంగములను జదివినను ఎవ్వరు తమకేమియు తెలియలేదను సంగతిని తెలిసికొనియుందురో వారికిని (ఈ యిరు తెఱగులవారికి మాత్రమే) జ్ఞానలాభము గలుగును.

163. ఏవో దోషములనియు మూఢాచారములనియు బలుకుచు గొందఱు తమ పాండిత్యమును గుఱించి గర్వపడుచుందురు. కాని నిజమైన భక్తుడు తన కెప్పుడును దయామయుడగు భగవానుడే చేయూత నొసగ సిద్ధముగానున్నాడని తెలిసికొనును. కొంత కాలము ఆతడు తప్పుత్రోవను బోవుచుండినను బోవుగాక, మఱేమియు బాధ లేదు. వానికేది ఆవశ్యకమో భగవానుడెఱుగును. భగవానుడే భక్తుని యభీష్టమును సిద్ధింపజేయును.

164. ఇరువురు మిత్రులొక తోటలోనికి బోయిరి. వారిలో లౌకిక జ్ఞానదక్షుడగునాతడు వెంటనే తోటలోని మామిడి చెట్లను లెక్కింప నారంభించెను. మఱియు చెట్టుచెట్టునకు ఎన్ని కాయలు గలవో, మొత్తముమీద తోటయెంత కిమ్మతుచేయునో అంచనావేయసాగెను. వాని మిత్రుడు తోడ యజమానుని దగ్గఱకుబోయి వానితో మెల్లగా స్నేహము చేసికొని యొక చెట్టును సమీపించినాడు; యజమానుని సమ్మతిని బొంది పండ్లు కోసికొని తిననారంభించినాడు. వీరిరువురిలో బుద్ధిశాలి యెవడు? మామిడి పండ్లను తినిన నీయాకలి తీరును. అంతే కాని చెట్లను ఆకులను లెక్కించి అంచనావేయుటవలన నేమిలాభము? శుష్క పండితుడు సృష్టి యొక్క ఉత్పత్తి క్రమములను కనుగొనుయత్నమున వ్యర్థముగా కాలయాపన చేయును. కాని వినమ్రుడును విజ్ఞానియునగు నాతడు సృష్టికర్తతో చెలిమి సంపాదించి వాని ప్రసాదమున లభించు బ్రహ్మానందము ననుభవించును.

165. ప్రజ్ఞాన స్వరూపిణియగు నాజగజ్జనని యొక్క కటాక్షమొక్కటి ప్రసరించిన జాలును, మహాపండితాగ్రేసరుని సైతము పడగొట్టి నేలపై బ్రాకు నీచక్రిమితుల్యునిగా గాన్పింపజేయగలదు.

166. 'గీతా'యను పదమును వేగముగా 'గీ-తా-గీ-తా-గీ-తాగీ'యని పదిసార్లు ఉచ్చరింపుము. చూడగా అది'తాగీ, తాగీ'అని యుచ్చరింపబడును గదా? తాగి లేక త్యాగియనగా భగవంతుని బొందుటకై సర్వము త్యాగముచేసిన వాడని యర్థము. ఇటులొక్కమాటలో గీత యిట్లు బోధించుచున్నది. "ఓ సంసారులారా! త్యాగముచేయుడు! అన్నిటిని త్యజించి భగవానునిపైకి బుద్ధి మఱల్పుడు."

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల
శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము -
అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

సుందరకాండ

తెలిసోతెలియకో రావణుడామెను ఇక్కడే ఉంచేడు.

కాదు- ఆ భావాన్ని వానికి తల్లియే కలిగించి ఉంటుంది.

అమ్మవారు- చాంపేయ కుసుమ ప్రియః చందన ద్రవదిగ్ధాంగి. అందుకని. స్వామి వన సంచారం చేస్తున్నాడు. ఒకచోట-

ఇయంచ నళినీ రమ్య ద్విజ సంఘ నిషేవితా

సరస్సు అందులో అందమైన పద్మము. దానిని ద్విజ సంఘాలు అంటే నీటి పక్షులు సేవిస్తున్నాయి. స్వామి చూస్తున్నాడు. కాని స్వామి దృష్టిలో నళిన్యైనమః ద్విజ సంఘవిషేవితాయ్యైనమః అని స్తుతింపబడే అమ్మవారున్నది.

ఈ పద్మమునకు నాళమున్నది. అందుకని అది నళిని. ఈ నాళము జగదాధారం. జగదాధారమైన నాళమునుండి బ్రహ్మవేత్తలు ఆమెను సేవిస్తున్నారు. స్వామి దృష్టి అటువంటిది. కనుకనే

సారామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతి
వన సంచార కుశలా నూనమేష్యతి జానకీ.

అనుకొంటాడు. ఈ వనాలలో తిరుగటం అలవాటులో ఉన్నది కనుక ఇక్కడ కూడా తిరుగుతూ ఉంటుంది. కనుక ఆమెనిక్కడే పొందగలను అనుకొంటాడు. ఆ తల్లి ఉపనిసద్వన సంచారకుశల కనుక ఆమె నీ సమయంలో చూడగలను. ఎందుకంటే-

సంధ్యాకాలమనాశ్యామా ధ్రువమేష్యతి జానకీ
నదీ చేమాం శివజాలం సంధ్యార్థే వరవర్ణినీ.

ఆవిడ సంధ్యాకాలమందు మనస్సు కలదట. అందుకని సంధ్యోపాసనకు ఈ పవిత్ర జల సన్నిధికి వస్తుందట. అదీ ఊహ. ఇది బాహ్యం. ఆ తల్లికి కల్యా అని పేరు. ఋషులు అలాగ కీర్తిస్తారు. కల్యా అంటే ఉషః కాలరూపమైనదని అర్థం. అందుకనే ఉషః కాలంలో ఉషః కాలరూపముగా దేవీ దర్శనాన్ని చేయాలి. ఇలా అనుకొనిన స్వామి ఆ సీతకై ఎదురుచూస్తూ.

ఏవంతు మత్వా హనుమాన్ మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేంద్ర పత్నీం
అవేక్ష మాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః

ఆశింశుపా వృక్ష పర్ణాలలో ఒదిగి ఉండిపోయేడు.

సమాధి కాలా త్పూర్వంతు భావయిత్త్వైవ మాదృతా
తతో ధ్యాయే నిలీనాక్షోదేవీం మాం జగదీశ్వరీం- (దే.భాగ)

అనినట్లు స్వామి ధ్యానములో ఉండిపోయేడు.

అలా ఉండి అశోకవన సర్వదర్శనమూ చేస్తున్నాడు. అక్కడున్న సర్వప్రకృతి ఆ పరాశక్తికి ఉపాసించే తోటి బంధువులా ఉంది. మహర్షి శ్లోకాలన్నీ ఈ ఆంతర్యాన్నే చెబుతాయి. అక్కడి వృక్షాలు-

శాత కుంభనిభాః కేచిత్ కేచిదగ్ని శిఖోపమాః
నీలాంజన నిభాః కేచిత్ తత్రా శఠకాస్సహస్రశః

కొన్ని వెండిలా తెల్లగా ఉన్నాయి. అది శివతత్వం. కొన్ని అగ్ని శిఖలా ఎఱ్ఱగా ఉన్నాయట. ఇది బ్రహ తత్వం. కొన్ని నీలాంజనంలా నల్లగా ఉన్నాయట. ఇది విష్ణుతత్వం. ఇలా త్రిమూర్తులు ఆమెకై నిరీక్షిస్తున్నారన్నమాట. పైగా ఇది సంధ్యాతత్వంగా చెప్పిన మాట. చివరి నుండి పైకి వెడితే బ్రహ్మచారి సంధ్యా వందన క్రమం అవుతుంది.

అంతేకాదు-

నందనవనంలా ఉంది. చైత్ర రథంలా ఉంది.

ఇంద్ర కుబేర స్వరూపంగా ఉంది. వీళ్ళిద్దరూ శ్రీవిద్యోపాసకులు. లలితా భక్తులు. అంతెందుకు-

పుష్పరత్న శతైశ్చిత్రం పంచమం సాగరం యథా

అంటారు మహర్షి. ఆ తల్లికి ఇష్ట సంఖ్య అయిన ఐదవ సముద్రంలా ఉందట. అలాగే

పృథివ్యప్ తేజో వాయు ఆకాశాలలో ఐదవది ఆకాశం కదాః

ఆ సంఖ్య ఆ తల్లిని సేవిస్తుంది కదా!

పూలతో నిండిన ఆ స్థలం

ద్వితీయవమివ చా కాశం పుష్పజ్యోతిర్గణాయుతం

రెండవ ఆకాశంలా ఉందట. అందువలన సర్వప్రకృతి తల్లిరూపంగా ఆమె సాధకుల రూపంగా స్వామికి కనిపిస్తున్నది. ఇటువంటి సాధనలో ఆంజనేయస్వామికి సీతా దర్శనమైంది. చూసేడు. -బాహ్యంగా ఆ స్వరూపం.

తతో మలిన సంవీతాం రాక్షసీభిస్సమా వృతాం
ఉపవాస కృశాం దీనాం నిశ్వసంతీం పునః పునః
దదర్శ శుక్ల పక్షాదౌ చంద్రరేఖామి వామలాం

ఇంకావుంది...

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

అది ఇతరులకు సాధ్యపడేది కూడా కాదు. నిర్ధారించుకొన్న లక్ష్యాలను సాధించేందుకు యోగ్యమైన సాధనాలను ఆ మనిషికి సమర్థులైన వారు కొందరు సూచించవచ్చునేమోగాని నిర్ధారించుకొన్న జీవన లక్ష్యాల సాధనకై చేసే కార్యాలలో నిమగ్నుడు కావడం స్వేచ్ఛగా జరగాలని వేదం మంత్రంలో 'స్వయమ్' శబ్దాన్ని ప్రయోగించింది.

శుక్లయజుర్వేదం ఈ భావాన్నే **'స్వయం యజస్వ స్వయం జుషస్వ'-**

స్వయంగా నీ పనిని చేసుకో. దాని ఫలితాన్ని నీవే అనుభవించు" అని చాలా సూటిగా చెప్పింది. గుఱ్ఱం రథపు కాడిని ధరించినట్లుగా జీవితంలో లక్ష్యసాధన అనే కార్య 'ప్రతరణీ' కాడిని ధరించడం కష్టమే. అయినా 'అవస్యువమ్' లక్ష్యాన్ని చేర్చేది ఆ మార్గంలో రక్షణ కలిగించేది అయిన ఆ జీవనపు కాడిని ధరించడం చాలా ముఖ్యం. ఎవరైనా ఆ జీవన లక్ష్యపు కాడిని విడిచిపెడదామనుకొంటే వారు లక్ష్యాన్ని కూడా చేరుకోలేరు.

శ్రేయాంసి బహు విఘ్నాని 'శుభకార్యాలకు విఘ్నాలెక్కువ' అన్న సూక్తి అందరకు తెలిసినదే. అయినా విఘ్నాలకు భయపడి అధములు అసలు పనులనే ఆరంభించరు. మధ్యమ జాతి మనుష్యులు 'విరమంతి మధ్యే' మధ్యలోనేవిడిచిపెడతారు. కాని ధీరులు మాత్రం విఘ్నాలెన్ని వచ్చినా భీతి చెందక ఆరంభించిన పనులను పరిసమాప్తి చేస్తారు. భర్తృహరి చెప్పిన ఈ జీవన సూత్రాన్ని ఋగ్వేదం వేల ఏండ్ల క్రితమే నాస్యావశ్మి విముచం నావృతం పునః 'జీవన లక్ష్యపు కాడి నుండి విడుదల పొందేందుకు కోరుకోను. అట్లే ఆ కాడి నుండి శాశ్వతంగా వెనుదిరిగిపోయేందుకు కూడ ఇష్టపడను' అని చెప్పింది. ఇదే కార్యసాధకుని 'న్యయ్యాత్పథః ప్రవిచలంతి పదం న ధీరాః'-"ధీరులు న్యాయమార్గం నుండి ఒక్క అడుగు కూడా వెనుకకు వేయరు" అని శ్లాఘించాడు. బహుశా భర్తృహరి కూడా ఈ మంత్రంలోని 'విద్వాన్ పథః పుర ఏత ఋజునేషతి"- "మార్గం మరియు జీవన లక్ష్యం తెలిసిన విద్వాంసుడు నేరుగా అచటకే తీసుకొనిపోగలడు" అన్న వాక్యానికి ముగ్ధుడయ్యే ఆ మాట అన్నాడేమో".

202

వరుణదేవా! పాపచింతన అనే త్రాటిని త్రెంచివేయుము

వి మచ్ఛ్రథాయ రశనామివాగ బుధ్యామ తే వరుణ ఖామృతస్య।

మా తంతు శ్ఛేది వయతో ధియం మే మా మాత్రా శార్యాపసః పుర ఋతోః

భావం:- ఓ వరుణ భగవాన్! నాలోని పాపచింతన అనే త్రాటిని తెంపి వేయుము. నీ ఋతాన్ని అనగా శాసనాలను, ధర్మాలను కొనసాగిస్తాను. బుద్ధి, కర్మ, జ్ఞానమనే వానిని పడుగుపేకలుగా చేసి జమిలి (కలిపి) నేసిన నా జీవన తంతువు తెగిపోకుండ కాపాడుము. నా జీవిత లక్ష్యం నెరవేరక క్షణ కాలం ముందుకూడ తెగిపోకుండుగాక!

వివరణ:- పాపతాపనాశక వరుణదేవా! నిన్ను శరణువేడుకొంటున్నాను. పాప వాసన (చింతన) అనే అగ్నిజ్వాలల్లో మాడిపోతున్నాను. దానిని శాంతింపచేయి. నా పాపమనే త్రాడు చాలా పొడవైనది. అది నన్ను చిక్కుముడులలో బంధించేస్తున్నది. నా వినతి ఏమంటే- 'వి మచ్ఛ్రథాయ రశనా వమివాగః' "త్రాడులా నన్ను బంధించిన పాపవాసననుండి విముక్తుణ్ణి చేయి" ఓ ప్రభూ! నేను పాపం నుండి విముక్తిని అర్థించడం లేదు. దానికి మూలకారణమైన పాపచింతన నుండి మాత్రమే విముక్తిని కోరుతున్నాను. 'సునీతిభిర్నయసి త్రాయసే జనం యస్తుభ్యం దాశాన్న తమంహో అశ్నవత్' "తమనుతామే నీకర్పణ చేసుకొన్న వారిని సన్మార్గంలో నడిపించి రక్షిస్తూ వారికి పాపమే అంటకుండా చేస్తావు"అని నేను విన్నాను. మరియు-

న తమంహో న దురితం కుతశ్చ్న నారాతయస్తితిరుర్న ద్వయావినః।

విశ్వా ఇదస్మాద్ధ్వరసో వి బాధసే యం సుగోపా రక్షసి బ్రహ్మణస్పతే॥

ఓ సర్వచరాచర మహాసంరక్షకా! నీవే సర్వజగత్తుకు సంరక్షకుడవు. నీవు చేపట్టి రక్షించిన వానికి పాపం మరియు దుర్గతుల స్పర్శకూడ ఉండదు. వారిని సమాజ శత్రువులుగాని, సర్పాది విష జంతువులు గాని దుఃఖం కలిగించజాలవు. దుఃఖమూ, పీడ మరియు బాధలు అట్టివానినుండి దూరంగా పారిపోతాయి.

కాబట్టి నేను నీకే సమర్పించుకొంటున్నాను. ఓ వరుణదేవా! దుఃఖాల నుండి విముక్తడనై నీ రక్షణకు పాత్రులమయ్యేందుకు 'బుధ్యామ తే వరుణ ఖామృతస్య' "నీ ఋత తంతువును మేము సదా కొనసాగిస్తాం. నీవు ఆదేశించిన ఆజ్ఞననుసరించి జీవిస్తాం." మరియు 'మా తంతుశ్ఛేది వయతో ధియం మే' "తదనుసారంగా జ్ఞాన, కర్మలనే పడుగుపేకల కలయికతో పేనబడిన జీవన తంతువు అర్థాంతరంగా తెగిపోకుండుగాక!" నా జీవితోద్దేశ్యాన్ని ఈ జన్మలోనే పరిపూర్ణం చేసుకొంటాను. అందుకొఱకై 'మా మాత్రా శార్యపసః పురః ఋతోః' "నే చేయు కర్మ పూర్తికావడానికి ఒక మాత్రకాలం ముందుగాకూడ నా జీవితం మరియు కర్మవిచ్ఛిన్నం కాకుండుగాక!" అని నిన్ను ప్రార్థిస్తున్నాను. ఈ ప్రార్థన సఫలం కావాలంటే - నేను పాపవాసన మరియు చింతననుండి విముక్తుణ్ణి కావాలి. కాబట్టి పాప విధ్వంసక! 'దామేవ వత్సాద్వి ముముగ్ధ్యంహః' "కట్టబడిన త్రాటిని విప్పి బాలుణ్ణి రక్షించినట్లుగా నన్ను పాపవాసనా రజ్జువు వుండి విడివడ చేయుము" ఎందుకంటే-


ఇంకావుంది...

ఆంధ్రభూమి
చిత్రభూమి


జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

సోమవారం 28, జనవరి 2019

రవితేజ డిస్కోరాజా



మాస్ మహారాజ రవితేజ మరో పవర్‌ఫుల్ మాస్ అండ్ క్లాస్ సినిమాతో అభిమానులు ముందుకి రాబోతున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌ని కథాంశాలుగా ఎంచుకుంటూ విమర్శకులు, ప్రేక్షకుల ఆదరణ అందుకుంటున్న క్రియేటివ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. మాస్ మహారాజా రవితేజ ఎనర్జీకి సరిపోయేలా సినిమాకు డిస్కోరాజా టైటిల్ ఖరారు చేశారు. జనవరి 26 రిపబ్లిక్‌డేతోపాటు రవితేజ పుట్టినరోజు సందర్భంగా డిస్కోరాజా టైటిల్ లోగోని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత రామ్ తాళ్ళూరి మాట్లాడుతూ రవితేజతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం హ్యాపీగా ఉందన్నారు. వినూత్న కథల్ని ప్రేక్షకులకు అందించటంలో ఎప్పుడూ ముందుంటామని, అలా దర్శకుడు విఐ ఆనంద్ చెప్పిన కథ నచ్చి ఓకే చేశామన్నారు. రవితేజ ఇప్పటివరకు టచ్‌చేయని జానర్‌లో సినిమా తెరకెక్కనుందని, వినూత్నమైన అంశాన్ని సినిమా కథగా తీసుకున్నామన్నారు. హైదరాబాద్‌తోపాటు గోవా, చెన్నై, లడాఖ్, మనాలీ, నార్త్ ఇండియాలో కొన్నిచోట్ల సినిమాను చిత్రీకరణకు ప్లాన్ చేశామన్నారు. ప్రీప్రొడక్షన్ మొదలుపెట్టిన రోజునుంచే చిత్రానికి కొన్ని క్రేజీ టైటిల్స్ అనుకుంటూ వచ్చాం. అన్నివర్గాలను ఎంటర్‌టైన్ చేసేలా సినిమా రూపొందించేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తుందన్నారు. అందుకే మాస్, క్లాస్‌ని ఆకట్టుకునే రీతిలో 'డిస్కోరాజా' టైటిల్‌ని ఖరారు చేశామన్నారు. దర్శకుడు విఐ ఆనంద్‌తోపాటు టాలీవుడ్‌లోని బెస్ట్ టెక్నీషియన్స్ సినిమాకు పనిచేస్తున్నారు. క్రేజీ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ స్వరాలు అందిస్తారని, సినిమాటోగ్రఫీ సాయిశ్రీరామ్ అందిస్తారన్నారు. రవితేజ సరసన ముగ్గురు హీరోయిన్లు ఉంటారని, ప్రముఖ నటుడు బాబీసింహా ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడన్నారు.



మిస్టర్ మజ్ను నచ్చేశాడు

అఖిల్ అక్కినేని హీరోగా బీవీఎస్‌ఎన్ ప్రసాద్ సారథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం -మిస్టర్ మజ్ను. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ సక్సెస్‌ఫుల్‌గా రన్నవుతోన్న నేపథ్యంలో చిత్రం యూనిట్ కేక్ కటింగ్‌తో సెలబ్రేషన్స్ చేసింది. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ ఆడియన్స్‌తో కలిసి థియేటర్‌లో సినిమా చూస్తున్నపుడు వచ్చిన రెస్పాన్స్‌కు హ్యాపీ అనిపించింది. పూర్తిస్థాయి కుటుంబ కథాచిత్రం చేయాలనే మిస్టర్ మజ్ను చేశా. తమన్ మ్యూజిక్, వెంకీ కంటెంట్, నవీన్ నూలి ఎడిటింగ్ అన్నీ కలిసొచ్చాయి. నిర్మాత బీవీఎస్‌ఎన్ గాడ్‌ఫాదర్‌లా ముందుండి సినిమా నడిపించారు. నిధి పెర్ఫార్మెన్స్ చెప్పాల్సిన పని లేదు. ఏడెనిమిది నెలల కష్టానికి తగిన ఫలితం అందినందుకు ఆనందంగా ఉంది అన్నాడు. నిర్మాత బీవీఎస్‌ఎన్ మాట్లాడుతూ సినిమాను సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఏయన్నార్, నాగార్జున, ఇప్పుడు అఖిల్‌కు మజ్ను టైటిల్ పెద్ద మైలురాయిలా నిలుస్తోంది. వీలైనంత త్వరలో అఖిల్‌తో మరో సినిమా చేస్తానని ప్రకటించారు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ అఖిల్ పెర్ఫార్మెన్స్ అద్భుతం. మా కెమిస్ట్రీ అద్భుతంగా వర్కౌటైంది. మంచి పాత్రనిచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు అంది.



కోలీవుడ్‌పై ఫోకస్


సెన్సేషన్ హీరో విజయ్ దేవరకొండ ఇప్పటికే తమిళ మార్కెట్‌పై ఫోకస్‌పెట్టాడు. ఆనంద్ శంకర్ దర్శకత్వంలో తెలుగు తమిళ చిత్రం 'నోటా'తో తన లక్కును టెస్టు చేసుకున్నాడు కానీ సినిమా నిరాశపర్చింది. అలాగని విజయ్ ప్రయత్నాలు ఆపడంలేదు. ప్రస్తుతానికి లైన్లోవున్న రెండు సినిమాలు 'డియర్ కామ్రేడ్', క్రాంతిమాధవ్ ప్రాజెక్ట్ మాత్రం తెలుగు మార్కెట్ కోసమే చేస్తున్నాడు. కానీ, తర్వాత చేయబోయే ప్రాజెక్టు మాత్రం తమిళ తెలుగు చిత్రమేనని తెలుస్తుంది. ఈమధ్యే కొత్త దర్శకుడు ఒకరు యూనివర్సల్ అప్పీల్ కథ చెప్పి విజయ్‌ను మెప్పించాడట. కథ నచ్చడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న ప్రచారం జరుగుతోంది. లైన్లోవున్న రెండు సినిమాలు పూర్తికాగానే ఆ చిత్రం సెట్స్‌పైకి రానుందట. 'నోటా' కోసం తమిళం నేర్చుకొని మరీ స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్న విజయ్, ఈసారి తమిళ భాషపై మరింతగా పట్టుసాధించేందుకు ప్లాన్ చేస్తున్నాడని టాక్.



ఎవరికోసం ఎదురు చూపు

రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, చరణ్ చేస్తున్న మల్టీస్టారర్ -ట్రిపుల్ ఆర్. రెండో షెడ్యూల్ మొదలైంది. ఫస్ట్ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్లు చిత్రీకరించిన దర్శకుడు రాజమౌళి, రెండో షెడ్యూల్‌లోనూ చరణ్, ఎన్టీఆర్‌ల కాంబోలో కొన్ని యాక్షన్ సీన్లు చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఇదే టైంలో ఈ చిత్రంలో హీరోయిన్ ఎంపిక విషయంపై స్పీడ్‌గా చర్చలు జరుపుతున్నారట. వచ్చేనెల నుంచి హీరోయిన్లతో చిత్రీకరణకు దర్శకుడు రాజమౌళి ప్లాన్ చేశాడని టాక్. ఇప్పటికే చాలామంది హీరోయిన్ల పేర్లు పరిశీలించిన జక్కన్న -బాలీవుడ్ బ్యూటీ పరిణితి చోప్రా వద్ద ఆగాడని అంటున్నారు. పరిణితిని సంప్రదించడం, ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం జరిగిందనీ వినిపిస్తోంది. బాలీవుడ్‌లో పలు సూపర్‌హిట్ చిత్రాల్లో నటించిన పరిణితి చోప్రా ఈమధ్య కాస్త సందడి తగ్గించింది. ఇక ట్రిపుల్ ఆర్ కోసం మరో బాలీవుడ్ భామనే ఎంపిక చేస్తారని వినిపిస్తోంది. ఇదిలావుంటే, కొద్దిరోజుల క్రితం ప్రాజెక్టులోకి కోలీవుడ్ ఆర్టిస్ట్ కమ్ డైరెక్టర్ సముద్రఖని యాడ్ అవుతున్నాడంటూ వచ్చిన వార్తలు నిజమయ్యాయి. సినిమాలో ఆయన ఓ ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. ఇది సముద్రఖని చేస్తున్న స్ట్రెయిట్ తెలుగు మూవీ. సుమారు 300 కోట్ల బడ్జెట్‌తో పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మిస్తున్న చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. కీరవాణి సంగీతం అందిస్తున్న చిత్రానికి సెంథిల్‌కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు.

రొటీన్‌కి భిన్నం కల్కి



గరుడవేగ సినిమాతో సూపర్‌హిట్‌కొట్టిన సీనియర్ హీరో రాజశేఖర్ ప్రస్తుతం యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'కల్కి' అనే చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. కాగా ఈచిత్రం నుండి ఇటీవలే ఫస్ట్ అవతార్ టీజర్ విడుదలై నెటిజన్లను బాగా ఆకట్టుకుంది.కాగాఈ నెల మూడో వారంనండి చిత్ర బృందం లాంగ్ షెడ్యూల్‌ను జరుపుకోనుంది. ఈ షెడ్యూల్‌లో రాజశేఖర్‌కి సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేయనున్నారట. ప్రశాంత్ వర్మ తన మొదటి సినిమా 'అ!'తో మంచి పేరు తెచ్చుకోవటం.. రాజశేఖర్ కూడా గరుడవేగ లాంటి సూపర్ హిట్ సినిమా తరువాత నటిస్తుండడంతో ఈ సినిమాపై సహజంగానే మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

సాహో దర్శకుడితో!!

'నా పేరు సూర్య' తరువాత కొత్త ప్రాజెక్టును ప్రారంభించలేదు అల్లు అర్జున్. చాలా గ్యాప్ తరువాత త్రివిక్రమ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ప్రాజెక్టు అయితే మొదలు పెట్టలేదు. ఇటీవల చేసిన సినిమాలు ప్రేక్షకులను సరిగా మెప్పించలేకపోవడంతో, ఫ్యూచర్ ప్రాజెక్టుల విషయంలో బన్నీ మరింత జాగ్రత్త పడుతున్నాడని అంటున్నారు. త్రివిక్రమ్ సినిమా ఫైనలైజ్ అయినా బన్నీ మాత్రం కథలు వింటున్నాడట. రీసెంట్‌గా యువ దర్శకుడు సుజిత్ స్టైలిష్ స్టార్‌కు ఒక ఇంట్రెస్టింగ్ కథ వినిపించాడట. కథ నచ్చడంతో దాన్ని పూర్తిస్థాయి స్క్రిప్ట్‌గా తీర్చిదిద్దమని బన్నీ సుజిత్‌కు సూచించినట్టు సమాచారం. సుజిత్ ప్రస్తుతం ప్రభాస్‌తో 'సాహో'ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. బన్నీ-త్రివిక్రమ్ సినిమా ప్రస్తుతం జోరుగా ప్రీప్రొడక్షన్ జరుపుకుంటోంది. సినిమా పూర్తయ్యేలోపు సుజిత్ కూడా 'సాహో' పూర్తిచేసి బన్నీ సినిమాపై ఫోకస్ పెట్టే అవకాశం లేకపోలేదు.



ఫస్ట్ లుక్స్..

సీత ఇలా..




బెల్లంకొండ శ్రీనివాస్, కాజల్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం -సీత. రిపబ్లిక్ డే సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. హీరో ఆనందంతో అరుస్తుంటే, హీరోయిన్ షాకింగ్‌గా చూస్తున్న స్టిల్ ఆకట్టుకునేలా ఉంది. 'సీత, రామతో కలిసి ప్రయాణం చేయడానికి సిద్ధంగి ఉండండి' అన్న క్యాప్షన్‌తో కాజల్ ఈ స్టిల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సీత చిత్రం తనకెంతో ప్రత్యేకమని, ప్రేక్షకుల ముందుకు రావడానికి చాలా ఉత్సుకతతో ఉన్నానంటూ ఆమె పోస్ట్ పెట్టారు. తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. సంగీతం అనూప్ రూబెన్స్ అందిస్తున్నాడు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తైందని, ప్రతినాయకురాలి పాత్రలో కాజల్ కనిపించే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.

ఎదురీత..



40 ఏళ్ల మధ్యతరగతి తండ్రికి కొడుకంటే అమితమైన ప్రేమ. కొడుకు కోరిందేదీ కాదనకుండా ఇస్తుంటాడు. ఆ అతి ప్రేమే ఎన్ని అనర్థాలు తీసుకొచ్చిందన్న ఇతివృత్తంతో తెరకెక్కుతున్న చిత్రం -ఎదురీత. బోగారి లక్ష్మీనారాయణ నిర్మాతగా దర్శకుడు బాల మురుగన్ తెరకెక్కించిన చిత్రం. శ్రవణ్ రాఘవేంద్ర హీరోగా, మాస్టర్ చరణ్ కొడుకు పాత్రలు పోషిస్తున్నారు. రియోనా లిషోయ్ కథానాయిక. సినిమా చిత్రీకరణ పూర్తైంది. రిపబ్లిక్‌డే సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ విడుదల చేశారు. నిర్మాత బోగారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రముఖ తమిళ దర్శకుడు విజయ్ మిల్టన్‌వద్ద గోలీసోడా, కడుగు, తెలుగులో '10'గా విడుదలైన విక్రమ్, సమంత సినిమాకు దర్శకత్వ శాఖలో పని చేసిన బాలమురుగన్ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడన్నారు. కొడుకు కోసం కన్నతండ్రి 'ఎదురీత' ప్రేక్షకుల హృదయాలను తాకుతుంది. నిర్మాణానంతర పనులు జరుగుతున్న చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామన్నారు.

4 లెటర్స్ టీజర్ విడుదల



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రాన్ని ఆర్ రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ పూర్తవ్వడంతో, నిర్మాణానంతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. '4 లెటర్స్' టీజర్‌ను దర్శకుడు కె రాఘవేంద్రరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవాస భారతీయుడైన చిత్ర నిర్మాత ఉదయ్‌కుమార్ నిర్మించిన '4 లెటర్స్' నేటితరం యువతీ యువకుల మనోభావాలకు అద్దంపట్టేలా ఉందన్నారు. హీరో ఈశ్వర్‌కు ఇది తొలి చిత్రమైనా చక్కగా నటించాడని, పరిశ్రమలో అతనికి ఉజ్వల భవిష్యత్ ఉండాలని ఆకాంక్షించారు. నిర్మాతలు దొమ్మరాజు హేమలత, ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం '4 లెటర్స్' టీజర్‌ను రాఘవేంద్రరావు విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 30న ఆడియో, ఫిబ్రవరి రెండోవారంలో చిత్రం విడుదలవుతాయన్నారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ కె రాఘవేంద్రరావు హస్తవాసితో సినిమా ప్రేక్షకాదరణ పొందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు ఆర్ రఘురాజ్ మాట్లాడుతూ '4 లెటర్స్' నేటితరం ప్రేమకథాచిత్రం అన్నారు. కుర్రాళ్లకి అర్థమవుతుందిలే అన్న ఉపశీర్షిక పెట్టామన్నారు.